సెప్టెంబరు, 2009

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 7 పేజీలు: 64 వెల: రూ. 20/-

"యా దేవీ సర్వ భూతేషు....."



విజయదశమి శుభాకాంక్షలు



# గామీణ ˇథలు, వ స ˇథల పోట

స వ్తా వ్రీకవి మిషు ˇథ స నం ˇథదే. అయ్తిే, ం ను ం ను వా దయిళ్ల్ల _ ే మంచి ˇథలు ˇయ్యవయిప్తో తుతు యి. అందువల్ల మంచి ˇథ మిటం ˇటాల్బ ఖ్బ ˇ ఎ లన' హి ˇ్బ ంభ్రమించింది.

ప దీవ వళి సందర్భంగాి గామీణ ˇథలు, వ స్వ ˇథలు అనే ంండు విబాగాల్ల పోట్బ ంభ్రమాస్తు ం. ి గామీణ నేపథ్యం ' ండ, ి గామీణ ప్త వంట్బా ి వా బింబించే ˇథలు ఒ ˇ విబాగంల ను, వ స్వ ˇథలను మరో ˇ విబాగంల ను ఎరిగణనల నీసు ˇవటం య్యగ్తు తుంది.

## ఎ ఘమ ఎల వివంల ం

| | |
|---|---|
| ంండు విబాగాలక విడవిడగా ంద ఎరొ న వాసుమ తుంటాయి. | |
| _ మి గామీణ ˇథ | ం్ర 15, 000 |
| _ మ వ స్వ ˇథ | ం్ర 15, 000 |
| ది తీయి _ మి గామీణ ˇథ | ం్ర 10,000 |
| ది తీయి _ మ వ స్వ ˇథ | ం్ర 10,000 |
| _ తీయి _ మి గామీణ ˇథ | ం్ర 8,000 |
| _ తీమ _ మ వ స్వ ˇథ | ం్ర 8,000 |
| ి ప విబాగంల మ డు ˇనో లతున తిపాసుమ్తు ఎలు (ఒ ˇ ˇథ ) | ం్ర 5,000 |
| స దతాణ్రి ఎచుంణ్రక ఎంప ఏి గామీణ, వ స్వ ˇథలక | ం్ర 2,000 |

**గామీణ, వ స ˇథల పోట సి థలు ఎంఎ ంద్రితుం (ఈతుఖు బిది స చటాను గమ ంచ లి:**

- ☆ˇ థలు నింద ఎరొ ఈ చిత్యస వ క అ ˇతిర్ 1వ్తే దీ ల గా అందే విదంగా ఎంఎ లి.
- ☆ ఓ రీ రీం(వ్బ ˇథలయిన ఎంఎవచుతు ☆ ంండు విబాగాల పోటలల ను ఎ ల్గనవచుతు
- ☆ˇ థ ం్త ఈవా మీద ˇథ ఎయ్య వ్తి ఈమే గింద లి. ంట్రణ్తుతు ఈ ఎయ్య ˇథ స్తితు ఎరిచే వ మీ ప్తి ఈలల వుంటతు లు.
- ☆ˇ థ్బ డవి చే ం్త ఈల A4 ఉబా్తా ల్ల 6 ఎజీలు మించకూడదు. ఉబుక మించిన ˇథలను ఎరిశీలించతుం స ద్వపడదు.
- ☆ ఎజీ ని ఒ వ రీవి _ ఈమే, దస్న అంద్రుయ్యే విదంగా, స్పషంగా ం యిఈలి.
- ☆ స వ ˇ అంశిల్తో ఎ టు అ్బ అంశిల ఉహా థలు ఎంఎవచుతు అశ్లీల్తఈ అనబ్బ్యఈ క లమ్తు లను ంచతూటఉదోంణ్రులు, ం ˇయిఈలు, వ్యస్తిగ్గఈదష ణ, ఖిలి్తఈఎం లఈ ండ 'ండ ˇ థలు ఎంఎ లి.
- ☆ పోటని ఎంప ˇ థలు్తు లుగు సంసరో నిడగ్గంగ్రా గింద లి. అయ్యవ్తు చుతుత న ˇథలుశిల ం, విదేశీ సంసరీతీ ˇథల ి వా ఎలించకూడదు. అన ంణ వ్తి ఈల్తో కూడన ˇథలుశిల క ద ంబ్రగా గింద లి.
- ☆ ఎంప ా్బ ˇ థలఉమాటువంటస్తిత్తుఖ్రీ ప్తఈ్యఈ్తు లు గిందవు. ఎంప ˇా్బ ఎ ˇఫల _ ఈమ ˇథలనుి ఎ ఎంఎ ల్బ ˇయ్యక నేఎ య్య అందుక అవసంణ్రున స ంవులు అంటవిచిన ˇవల్లను కూడ_ఈు ˇ_ఈ చేయఈలి.
- ☆ స వ్యయిఖ్యరైఈల ˇ మిట వి_ఈమే తిపాసుమా పొందే ˇథలను్బ ంభ్రమిస్తుంది.
- ☆ ఎంపా న ˇ థలు ఖ్బ ఎ లన' హి లి ి ఎచుత్తు తుమవ్తు యి.
- ☆ ఎల్తి లను నవంతిర్ 2009 ఖ్బ ఎ లన' హి ˇల చఈఉవచుతు


చియిస వ :

ఎడటర్, స ˇ ఎ లన'

ఎ.ఎం. ర్. అఎ ర్, ం జఉిదనగర్,

ఉాదం బాద-500 030. రి దిఎదేశ్, ండయిఈ

పోస: 040-24018656, ఎ్వా : 040-24017005

E-mail: phanikumar@ap.gov.in








# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 8

సెప్టెంబర్, 2009



ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**డి. రామకృష్ణ,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఆర్. అరుణ జ్యోతి**

**ఎన్. విజయ కుమార్**

**బి. నరేంద్రనాథ్ రావు**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : Phanikumar@ap.gov.in


# విషయ సూచిక


సంపాదకీయం ........ 2

పంచభూత ప్రకృతి మాతలకు సమర్పయామి ........ 3

దసరా అనేది ఓ సరదా పండుగేనా ? ........ 5

మానవ వనరుల అభివృద్ధిలో పంచాయితీరాజ్ సంస్థల పాత్ర ........ 9

దేశ ప్రగతికి యునిక్ ఐ.డి. ........ 13

తల్లి - పిల్లి (హాస వికాసం) ........ 18

ఫ్యూచర్స్ మార్కెట్ ద్వారా రైతులకు మేలు ........ 22

మహనీయుల చతురోక్తులు ........ 24

మన గ్రామం - మన రాజ్యం ........ 25

సేంద్రీయ వ్యవసాయంలో రాష్ట్రం ముందంజ ........ 28

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో ........ 30

బాలలకు వరం ఈ విద్యా హక్కు ........ 34

ఖుర్ ఆన్ అవతరించిన పవిత్ర మాసం 'రమజాన్' ........ 36

వ్యవ'సాయం' ........ 40

ఎందరో మహానుభావులు ........ 44

హోమియో వైద్యం ఎందుకు మంచిది ? ........ 46

వార్తల్లో అపార్డ్ ........ 48

ఆదివాసుల ఆటపాటలను కాపాడుకుందాం ........ 49

బాల్ బాడ్మింటన్‌లో నాటి మేటి ప్రతిభాశాలి ........ 51

అనవసర ఆందోళన వద్దు, అవగాహన చాలు ........ 55

ఎన్ని సమస్యలు ఎదురైనా సంక్షేమ పథకాలు ఆగవు ........ 57

శ్రీరమణ పేరడీలు ........ 61

# సంపాదకీయం..

## అప్రమత్తంగా ఉండాలి కానీ, అతి భయం అక్కర్లేదు

లక్షలాది సంవత్సరాలుగా నడుస్తున్న మానవ చరిత్రలో అనేక సార్లు రకరకాల వ్యాధులు, అంటువ్యాధులు మహమ్మారుల్లా విరుచుకు పడ్డాయి. వేలాది, లక్షలాది మందికి బలిగొన్న వ్యాధులు ఎన్నో ఉన్నాయి. క్రీ.శ. ఆరంభం నుంచి ప్లేగు వ్యాధి చాలాసార్లు ప్రపంచాన్ని వణికిస్తూ వచ్చింది. ప్లేగు వ్యాధిలో అనేక రకాలున్నాయి. ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క రకం ప్లేగు విలయతాండవం చేసింది.

కలరా, ఇన్‌ఫ్లుయెంజా కూడా అంతే. పలుమార్లు ఇవి ప్రజలను బలిగొన్నాయి. 20 వ శతాబ్దం ఆరంభం (1918-20)లో వ్యాపించిన స్పానిష్ ఫ్లూ వల్ల, మొదటి ప్రపంచ యుద్ధంలో గాయపడి ఆస్పత్రి పాలయిన వారికంటే ఎక్కువ మంది ఆస్పత్రి పాలయ్యారు. ఇక ఈ వ్యాధితో మరణించిన వారయితే ప్రపంచవ్యాప్తంగా 2 నుంచి 10 కోట్ల మంది వరకూ ఉన్నారు. ఒక్క భారతదేశంలోనే కోటీ 25 లక్షల మంది మృత్యువాత పడ్డారు. స్పానిష్ ఫ్లూనే కాక, 1957-58లో ఆసియా ఫ్లూ, 1969 లో హంగ్‌కాంగ్ ఫ్లూ ప్రపంచాన్ని గాభరా పెట్టాయి.

బ్లాక్ డెత్, పోలియో, స్మాల్‌పాక్స్, మలేరియా, డెంగ్యూ, సార్స్, ఆంత్రాక్స్. చికున్‌గున్యా, హెపటైటిస్-బి, ఎల్లో ఫీవర్, హెచ్ఐవి/ఎయిడ్స్, మెనింగ్జయిటస్, ఎబోలా, టైఫస్, మంప్స్, మీజిల్స్, బర్డ్ ఫ్లూ, మొదలైన వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా ఎన్నోసార్లు విరుచుకుపడి కోట్లాది మందిని బలిగొన్నాయి. 1920 లో భారతదేశం ప్లేగు వ్యాధివల్ల కనీసం 20 లక్షల మందిని కోల్పోయింది.

వైద్యశాస్త్ర పరిజ్ఞానం అంతగా అభివృద్ధి చెందకపోవడం వల్ల చరిత్రలో ఇట్లాంటి మరణాలు సంభవించాయి. వ్యాధుల పుట్టుకను వైద్యశాస్త్రం నివారించలేదేమో కాని, విజృంభణను మాత్రం ఖచ్చితంగా అడ్డుకోగలదు. హెచ్1ఎన్1 గా వ్యవహరించబడే ప్రస్తుత స్వైన్ ఫ్లూ వ్యాధిని పరిశీలిస్తే, ఇదే రుజువవుతోంది. ప్లేగు, కలరా, టైఫాయిడ్, స్మాల్ పాక్స్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వైద్యశాస్త్రం కళ్లాలు వేయగలిగింది. ఇదే పద్ధతిలో, త్వరలో స్వైన్ ఫ్లూను అదుపు చేయగలిగిన స్థితిలోనే మనముంటాం.

స్వైన్ ఫ్లూకి సంబంధించిన వార్తలను గమనిస్తే, ఈ వ్యాధి పట్ల అనవసర భయాలు, అతి భయాలు వ్యాప్తిలో ఉన్నట్లు అర్థమవుతుంది. దీన్ని అదుపు చేయటానికి ప్రభుత్వ పరంగా, ప్రజల పరంగా పలు చర్యలు తీసుకోవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజల్లో వ్యాధిపై అవగాహన పెంచటం, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, చికిత్సా కేంద్రాలను, మందులను విస్తృతంగా అందుబాటులోకి తేవటం వంటి పలు చర్యలు చేపట్టింది.

ప్రజలు తమ వంతుగా ఇళ్లు, పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించటం, బయటికి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండటం వంటివి చేయాలి తప్ప అనవసర భయాలకు లోను కాకూడదు. లేనిపోని పుకార్లు నమ్మకూడదు. సాధారణంగా ఈ కాలంలో పలురకాల జ్వరాలు, జలుబులు రావటం సాధారణమే. కాని ప్రతి జ్వరాన్ని, జలుబుని స్వైన్ ఫ్లూగా అనుమానపడి, సమస్యని మరింత సంక్లిష్టం చేసుకోకూడదు. అప్రమత్తంగా ఉండాలే తప్ప, ఆందోళన అవసరం లేదు. అనవసర, అతి భయం మానవుడికి ఎప్పుడూ నష్టమే చేస్తుంది. అతి సర్వత్రా వర్జయేత్!

# పంచభూత ప్రకృతి మాతలకు సమర్పయామి !



**ఏ పండుగైనా పుట్టింది పల్లెసీమల్లోనే. పెరిగింది కూడ విశ్వాసం నిండి ఉన్న గ్రామ ప్రజల్లోనే. క్రమంగా కాలం (బుద్ధులు) మారాక ఆ వాతావరణం కొద్దిగా మరుగౌతూ ఏదో పండగొచ్చిన రోజున మాత్రమే అమ్మని సేవించడమనే ఆచారాన్ని గుర్తు చేసుకోవడం జరుగుతోంది. ఈ మధ్య మళ్లీ దైవచింతన బాగా పెరుగుతూన్న కారణంగా అమ్మని సేవించాలనే ఆలోచనకి మళ్లీ కొత్త చిగుళ్లు వస్తున్నాయి. ఇది సత్పరిణామమే.**

పల్లె ప్రజలకి నిజంగా తిండి పెట్టేది, తద్వారా అందరికీ ఆహారాన్నందించేదీ నేల తల్లే. అందుకే ఆమెని పూజించడంలో భాగంగా నేలని చీల్చి చాళ్లుగా చేసే నాగలికీ భూమికీ పూజ చేయడం కోసం వర్షపు చినుకు పడిన మరుక్షణం రైతు వెళ్లేది నేలతల్లి గుడికే. ఈ పేరుని ఎక్కడా వినలేదే? అనుకోనక్కరలేదు. అమ్మ పంచభుతాల్లోనూ ఉంటుంది. ఈ నేల తల్లిని పుడవాలమ్మ - పుడమమ్మ అని పిలుస్తూ ఆ తల్లికి కొలుపుల్ని (సేవల్నీ, నివేదనాలనీ) చేస్తుంటారు ప్రజలు.

రెండవ తల్లి పంచభూతాల్లో రెండవదైన నీరు. (అప్). నేలలో తగినంత నీరు లేకున్నా అలాగే ఆకాశం నుండి తగినంత వర్షం కురవకున్నా ఈ నాగలి చాలు వల్ల ప్రయోజనం ఉండదు. అందుకని రైతన్న 'నీటితల్లి'ని ఆరాధిస్తాడు. ఆమెని 'గంగానమ్మ' అని పిలుస్తాడు. ప్రతి ఊరిలోనూ ఓ గంగానమ్మ గుడి ఉండడమే కాక, ఎవరి స్థాయిలో వాళ్లు ఆ తల్లికి తమ తమ భక్తికి తగినట్లు సేవ చేస్తూనే ఉంటారు. ముఖ్యంగా వర్షాలు ఆలస్యమైనప్పుడు ఎన్నెన్నో కుండలతో నీటిని తెచ్చి మంత్రాలని చదువుతున్న ఊరి పురోహితునికి అందిస్తూ, చిత్రవిచిత్ర వేషాలతో, నృత్యాలతో, వాద్యాలతో భూమ్యాకాశాలన్నీ దద్దరిల్లేలా చేస్తుంటారు. ఇదంతా నీటికోసం చేసే ప్రార్థన. అంతేకాదు. కప్ప అనే జీవి నేలమీద, నీటిలోనూ కూడ సుఖంగా జీవిస్తుంది. ఆ కప్పని తెచ్చి ఊరేగించడం రెండు కప్పలకి వివాహం జరిపించడమనేది కూడ గ్రామ ప్రాంతాల్లో జరుగుతుంది. ఇది మూఢవిశ్వాసం కాదు. ప్రతి తల్లికీ అనుభవంలో ఉన్న విషయమే. ఎలాగా?

మాటలు ఇంకా రాని పిల్లవాడు తన వాంఛని తల్లికి తెలియజెయ్యాలని భావించినప్పుడు అమ్మ కొంగును పట్టుకుని లాగుతూ తనక్కావలసిన తిను బండారం ఎక్కడుందో దాన్ని వేలితో చూపిస్తున్నాడు గదా! అప్పుడు తల్లి ఏం చేస్తోంది? పిల్లవాడికి గట్టిగా ఓ ముద్దునిచ్చి, గట్టిగా గుండెలకి హత్తుకుని మరీ ఆ పదార్థాన్ని అందీయడం లేదూ? ఇక్కడ కూడ అంతే. 'తన పిల్లలు వర్షాన్ని కోరుతున్నా' రని అమ్మకి అర్థమయ్యే తీరులో గ్రామంలోని కుల వర్గ మత వర్ణ విభేదాలు ఏ మాత్రమూ లేకుండా అందరూ ఒక్కుమ్మడిగా ఈ కొలుపుల్లో (జాతర) పాల్గొంటారు. ఇది ఒక విధంగా చెప్తే గ్రామంలోని ఐకమత్యాన్ని చేకూర్చే పద్ధతుల్లో ఒకటి.

మూడవ తల్లి పంచభూతాల్లో ఒకటైన 'తేజస్సు'. తేజస్సు అంటే అగ్ని. భూమిని దున్నాక తగినంత నీటితో పదును పెట్టాక కావలసినది తగినంత ఉష్ణత. ఆ మాత్రపు ఎండ తగలని పక్షంలో విత్తనం నీటికి పూర్తిగా నానిపోయి మొక్కదశలోనే మరణించవచ్చు లేదా ఎదిగినా బలహీనంగా ఉండి సంతానాన్ని కల్గించే దశకి చేరకపోవచ్చు. అందుకని, సూర్యుణ్ణి ప్రార్థించడం తప్పనిసరి. ఆ సౌరశక్తిని తనలో నింపుకున్న గ్రామదేవత 'సూరమ్మ తల్లి' ఈమె ఆకాశంలో ఉండే సూర్యునికి ప్రతినిధి కాబట్టి, ఈమెకి దివిటీలని పట్టి సేవలని చేస్తారు జనం. అంతేకాదు. సూర్యునికి పెట్టే నివేదనలని పెట్టడమే కాక, సూర్యరశ్మితో- అంటే - గుడి ముంగిట బహిరంగంగా ఆ ప్రసాదాన్ని తయారుచేసి సూరమ్మ తల్లి ప్రసాదంగా ఊరందరికీ అందజేస్తారు.

నాల్గవతల్లి పంచభూతాల్లో ఒకటైన 'వాయువు. 'కరువలి' అంటే పెద్దగాలి అని అర్థం. ఆ పేరిట 'కరువలమ్మ' తల్లి కన్పిస్తుంది. చిత్రమేమంటే అందరు తల్లులూ ఒకే గ్రామంలో ఒకరి ప్రక్కన ఒకరుగా ఉండరు. ఒక్కో ప్రదేశంలో ఒక్కొక్కరుగా ఉంటూ జనుల్ని రక్షిస్తూ ఉంటారు. ఇలా కాక ఏ గ్రామానికి ఆ గ్రామం చొప్పునే దేవతలుండవచ్చు కదా! అనే అనుమానం వస్తుంది మనికి. అది సరి కాదు. వ్యవసాయదారుడు తన పరిధిలో ఉన్న తన జ్ఞానంతోనే పంటని

## అమ్మవారికి బలి ఇష్టమా ?



పండించడం సరికాదు. అతనికి ఇతర ప్రదేశాలతో – ఇతర ప్రజలతో – ఇతర భూములతో – ఇతరమైన పంటలతో – లాభనష్టాలతో – దిగుబడులతో కూడ పరిచయం ఉండాలనేది పూర్వుల ఆలోచన. అందుకే అందరు దేవతలనీ ఒక్కచోటే ఉంచకుండా అక్కడొక్కరు అక్కడొకరు చొప్పున పెట్టి మొత్తం సర్వప్రదేశాలనీ రైతు తిరిగేలా ఒక పద్ధతిని ఏర్పరిచి ఈ హోదాలన్నింటికీ సంబంధించిన అవగాహనని కల్గించారు పెద్దలు. ఇంతకీ అసలు విషయానికొస్తే ఎంతటి విత్తనమైనా, సారవంతమైన భూమిలో పెట్టబడినా, నీటిని బాగా పెట్టి తడి చేసినా, ఉష్ణత కలిగున్నా తగినంత వాయు ప్రసారమనేది దానికిలేని పక్షంలో అది సరిగా మొలకెత్తి చక్కని దిగుబడిని ఈయ(లే)దు. అందుకని ఓ కరువలమ్మ తల్లీ! (వాయుదేవతా!) అనుగ్రహాన్ని కోరుతున్నామంటూ ఆ తల్లికి సేవలని ఇస్తారు రైతులు.

ఐదవ తల్లి పంచభూతాల్లోనూ ఐదవదైన 'ఆకాశం. ఈమెనే 'కొండమ్మతల్లి' అని పిలుస్తారు. ఆకాశమంతా ఓ కొండలా కన్పించడం దీనిక్కారణం. ఆకాశమనేది నవగ్రహాలనీ, ఉరుముల్నీ, పిడుగుల్నీ, సూర్యచంద్రాదుల్నీ నిలువ చేసుకున్న ఓ పెద్ద కార్యాలయమే కాక, మనకి ప్రయోజనాన్ని కల్గించే వర్షాలనిచ్చేదీ – మనకి అపకారాన్ని కల్గించే పిడుగుల్ని వర్షించేదీ అయిన ఓ అద్భుత శక్తి కేంద్రం అది.

"అమ్మా! శిశువులైన మేం ఈ భూమిని నమ్ముకుని జీవిస్తున్నాం. మీ ఐదుగురు తల్లుల దయా ఉన్నట్లైతే సుఖంగా జీవనాన్ని సాగించగలం. అలా కాక భూమితల్లి కోపించి భూకంపాన్ని కల్గించినా, నీటి తల్లికి శాంత్రం కలిగి నీటి ఊటని పూర్తిగా మానినా–లేక తగినంత అందించకున్నా, అలాగే ఎండతల్లికి కనికరం లేక ఉష్ణతని ప్రసరింపజేయకున్నా, వాయుమాతకి ఆగ్రహం కలిగి గాలిని విసరకున్నా, నలుగురు తల్లులనీ తనలో ధరించిన గగనమాత ఏ పిడుగుల్నో కురిపించినా మేమూ మా సంసారాలూ మీ పంచభూత ప్రకృతి మాతల సాక్షిగా పస్తులుంటూ చెప్పలేని మనోవ్యధకి గురికావలసిందే" నంటూ ప్రార్థించడమే 'కొలుపు' అంటే.

ఇలా ఐదుగురినీ ప్రార్థించాక సంవత్సరమంతా శ్రమించాక చక్కని పంట చేతికి రాగానే, తొమ్మిది నెలలపాటు కష్టపడిన తల్లి ఒక బిడ్డణ్ణి అందించినంత ఆనందంతో ఆ పంటని చూస్తున్న రైతన్న గుండె గాలిపటంగా ఎగిరిపోతూంటుంది. పంట రావడానికి ముందు ఎన్నెన్ని దణ్ణాలని, కొలుపులు వేళ అందరు తల్లులకీ పెట్టాడో, అవే చేతులతో అమ్మకి ఆ పంటలని నవేదించడానికి మరో మారు కొలుపుల పేరిట గ్రామ జనమంతా ఒక్కటోటకి చేరి మళ్లీ నమస్కరిస్తారు. ఇది కృతజ్ఞతా పూర్వక నమస్కారం క్రిందికొస్తుందన్నమాట.

ఇక్కడి నుండి మరో విశేషాన్ని గమనించుకోవాలి. ఉదాహరణకి వరిధాన్యాన్ని పండించిన రైతులయినట్లైతే తమ పంట ధాన్యానికి – సంబంధించినది కాబట్టి తిండిగింజల నిచ్చిన ఆ తల్లిని 'నూకాలమ్మ' పేరిట సేవిస్తాడు. నిజానికి ఆమె నూకలనిచ్చిన అమ్మా 'నూకలమ్మ' తప్ప నూకాలమ్మ కాదు. అయినా అతని ఆనందం అతనిది– అతడు పెట్టుకున్న పేరు అతనికి సొంతం.

ఇక ఆ పండిన పంట కుంకుళ్లైనట్లైతే ఆమెని 'కుంకుళ్ళమ్మ తల్లి'గా భావించి పూజిస్తారు. అంటే ఏమన్న మాట? ఏ ప్రాంతంలో ఏ పంట అయితే ఆ ప్రాంతంలో ఆ పంటకి సంబంధించిన ధాన్యదేవత ఉంటుందని అర్థమౌతోంది. ఇప్పటి రోజుల్లో సాంఘిక శాస్త్రమంటూ ఒకటుంది. ఏ ప్రాంతంలో ఏ రాష్ట్రంలో ఏ పంట? అనేది దీనిలో ఒక ప్రశ్న. దానికి విద్యార్థులు తమకి తమకి తోచినది (గుర్తు లేని కారణంగా – గుర్తుంచుకోవడానికి కష్టమైన కారణంగా రాస్తుంటారు) ఏదో చెప్తుంటారు. ప్రాచీనుల దృష్టి చాల గొప్పది. అందుకని ఆ ప్రాంతంలో ఏ పంట ఉంటుందో ఆ పంట పేరిట ఓ దేవాలయాన్నీ ఆ దేవాలయంలో ఓ అమ్మనీ ఏర్పాటు చేసారు. దీంతో కుంకుళ్లమ్మ తల్లి ఆలయం ఎక్కడుందో గుర్తుంచుకుంటే చాలు – కుంకుళ్ల పంట ఫలానా చోట ఉంటుందనే యథార్థం మనకి తెలుస్తుంది. ఇదే తీరుగా ఏదైనా సరే గుర్తుంచుకోడానికి ఓ దేవాలయ వ్యవస్థని ఏర్పాటు చేవారు పూర్వులు.

పంచభూతాల పేరిటా అలాగే పంటల పేరిటా, దేవాలయాలే కాక, వ్యాధుల పేరిటా నివారణల పేరిటా కూడ కొందరు తల్లులకి దేవాలయాలని సిద్ధం చేసారు పూర్వులు. అంటే ఒక్కో వ్యాధికి ఒక్కో తల్లిని ఉంచి, ఆమె పేరిట దేవాలయాన్ని నిర్మించి సేవలు చేసినంత మాత్రాన ఆ వ్యాధులు నివారింపబడతాయా? అనే సందేహం మనకొస్తుంది. మన పెద్దలు ఎంతో గొప్పవాళ్లు. ఏయే వ్యాధులు ఏయే క్షుద్ర శక్తుల ఆధారంగా వస్తాయో గమనించిన ప్రాచీనులు ఆయా శక్తులతో ఆయా వ్యాధుల్ని నివారించేందుకు వీలుగా ఆయా క్షుద్రశక్తుల్ని పారద్రోలగల్గిన మంత్రాలతో ఒక యంత్రాన్ని సిద్ధం చేసి దాని మీదట దేవీవిగ్రహ ప్రతిష్ఠ చేసి అక్కడ నివేదనలు ఏర్పాటుచేసి, ఈ తీరుగా వ్యాధి నివారణనీ మరో తీరుగా దేవాలయ పద్ధతినీ పరిరక్షించారు.

అందుకే వ్యాధులు ప్రబలిన కాలంలో గ్రామస్థులు తమ పొలిమేరలో ఉన్న దేవతకి సేవలని చేస్తారు. శీతలా దేవి అనే ఒక దేవత ఉంది. ఒక చేతిలో చీపురూ మరో చేతిలో చేటా ఉంటాయి ఆమెకి. ఏ వ్యాధులు తన పొలిమేర దాటి గ్రామంలోనికి ప్రవేశించబోతున్నాయో ఆ యథార్థాన్ని గమనించిన ఆమె తన మరో చేతిలోని చీపురుతో ఆ క్షుద్ర శక్తుల్ని ఊడ్చి తన మరో చేతిలోని చేట లోనికిఎత్తి దూరంగా పడవేస్తుంది. పడవేస్తే తిరిగిరావా? అని మన అనుమానం. ఎత్తిపడవేసినది తమ కంటె బలిష్ఠురాలైన 'దేవి' అని గమనించినప్పుడు ఆ క్షుద్రశక్తులు మళ్లీ తిరిగి రావడం కూడానా? అందుకే వ్యాధులు నివారింపబడుతూండేవి.

ఇలా మనందరి ఆనందాన్నీ మన ముఖాల్లో చూడాలని సంతోషపడే అమ్మ తనకి మనలాగే సంతానమైన మేకలనీ గొర్రె పొటేళ్లనీ, కోళ్లనీ బలిగా కోరుతుందనేది నిజమైన మాట కాదు. బలి అనే మాటకి నిజమైన అర్థం 'ఆత్మబలి' అని. మన ఆత్మని బలంగా చేసుకుని ఆ ఆత్మని అమ్మకి బలి చేయడం (సమర్పించడం) అని దీని భావం. అలాటి పంచభూత ప్రకృతి మాతలూ మనని కరుణించాలనీ, సుభిక్షంగా చేయాలనీ ఈ దసరా వేళ కోరుకుందాం !

– డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

# దసరా అనేది ఓ సరదా పండుగేనా?

భారతీయ సంప్రదాయంలో ఏ పండుగ వెనకైనా చెప్పలేనంత ప్రాధాన్యం, భక్తిభావం, సామాజిక స్పృహ మొదలైనవుంటాయి తప్ప, అలా వినోదమే ప్రధానంగా కలిగినతనం ఏ పండుగలోనూ కన్పడదు. మరి దీపావళిలో వినోదమే కదా కన్పిస్తుందని మనకి తోస్తుంది. అయితే దీపావళి పండుగ నిజానికి మరణించిన- మన యోగక్షేమాలని కాంక్షిస్తూన్న ఆ పితృదేవతలని ఆరాధించుకోవలసిన అమావాస్యరోజు. దురదృష్టవశాత్తూ తల్లీ, తండ్రీ, సంతానమూ అనే అన్ని సంబంధాలూ ఆర్థిక సంబంధాల తెరమాటున నడుస్తూన్న కారణంగా దీపావళి వినోదప్రధానమైన పండుగగా కన్పిస్తూ ఉండడం శోచనీయం. దీపావళిలో దాగిన రహస్యాలని మరోమారు తెలుసుకుందాం గాని ప్రస్తుతం దసరా పండుగ మాత్రం 'వినోదాల పండుగ కానే కా'దన్న విశేషాన్ని అనుకుంటూ వెడదాం.

## ఈ పండక్కి ఈ పేరెలా వచ్చింది?

లోకంలోని ప్రతివానికీ పేరు వెనుక ఏదో ఓ చిన్న కథ ఉంటుంది. పాములు కలలో కన్పించాక పుట్టాడంటూ గణేశుని పేరునీ – తాతగారి ఆబ్దికం (తద్దినం) రోజున వాళ్లమ్మ కన్న కారణంగా వాడికి తాతగారి పేరునీ. . . ఇలా పెట్టుకుంటూ మొత్తానికి ఉన్నంతలో ఒక గుర్తుండే సంఘటన ఆధారంగా పేరు పెట్టడమనేది నూటికి ఎనభై మందికి అనుభవంలో ఉన్న సత్యమే.

సంస్కృతంలో 'అహోరాత్ర' మనే పదం ఒకటుంది 'అహః+రాత్రమ్' కలిపితే 'అహోరాత్రమ్' అని అవుతుంది. 'అహః' అంటే పగలూ, రాత్రమ్ అంటే రాత్రీ అని అర్థం కాబట్టి అహోరాత్రమ్ అంటే ఒక పగలూ, ఒక రాత్రీ కలిసిన 24 గంటల పరిమితి ఉన్న ఒక రోజు అని అర్థం.

సంస్కృతంలో ఉన్న ఒక వ్యాకరణం ప్రకారం 'అహోరాత్ర' అనే పదంలోని 'అ' అనే మొదటి అక్షరం 'త్ర' అనే చివరి అక్షరం లోపిస్తాయి. దాంతో 'హోరా' అనే పదం మిగులుతుంది. ఈ రెండు అక్షరాలు లోపించినా ఈ అక్షరాలు రెండూ ఉంటే ఏ అర్థం వస్తుందో అదే అర్థం వస్తుందనేది వ్యాకరణం చెప్పిన విషయం. దాంతో 'అహోరాత్ర' మనే పదానికి ఎలా 'ఒక రోజు' అనేది అర్థమో, అలాగే 'హోరా' అనే పదానిక్కూడ అదే 'రోజు' అనేదే అర్థం. ఆ ప్రకారంగా 'దశ+హోరా' అంటే పదిరోజులని అర్థమన్నమాట. ఈ 'దశహోరా' అనే మాటే కాలక్రమంలో ఆ నోటా ఈ నోటా పడి మార్పు చెంది చెంది దశోరా – దసరాగా అయిపోయింది. ఆంగ్లేయులు మన చరిత్రని ఇంకా పాడు చేస్తే బాగుంటుందని భావించి 'దుస్సహ్రా' (Dussahra) అని తమ ఆంగ్లభాష ప్రకారం దీన్ని దిద్ది ఈ పదానికున్న చరిత్రని గుర్తుపట్టలేనంతగా మార్చివేసారు.




ఇది ఒక్కరోజు పండుగ కాదు. పదిరోజుల పండుగ అన్నమాట. అందుకే తొమ్మిది రోజులపాటు రాత్రివూట ఉత్సవాలని చేస్తూ వాటికి 'నవరాత్రోత్సవాలు' అని పేరు పెట్టారు

## తొమ్మిది రోజులే ఎందుకు?

నిజానికి 'దసరా' అనే పండుగకున్న అసలు పేరు 'విజయదశమి' అని. దేవతయైన అమ్మ రాక్షసులతో తొమ్మిది రోజులపాటు పోరాడి పోరాడి పదవ రోజున విజయాన్ని సాధించింది. ఆ విజయాన్ని సాధించిన తిథి దశమి కావడంతో దాన్ని 'విజయ దశమి' అన్నారు. ఇది నిజానికి దేవతమైన అమ్మకి సంబంధించిన పండుగే కాదు. లోకంలోని ప్రతి అమ్మకి సంబంధించిన పండుగ కూడ. ఏందుకంటే గర్భధారణ చేసిన ప్రతి స్త్రీ కూడ తొమ్మిది నెలలు పాటు తన గర్భంలో కలిగే అలజడి (కలిగిన మనోవ్యథా, ఆందోళనా. . .) కారణంగా చెప్పలేని అశాంతికి అప్పుడప్పుడు గురి అయి, పదవనెలలో పండంటి బిడ్డని కని, ఆనాడు తన విజయాన్ని ప్రకటిస్తుంది- ఈ పడ్డ కష్టాన్నంతటినీ మర్చిపోతుంది. ఈ విషయాన్నే ఒక కీర్తన ఇలా చెప్పింది. తల్లి గర్భంలో పిండం ఎదిగే విధానం రెండవ నెల దాటిందగ్గర్నుండీ ఇలా ఉంటుందిట.

రెండూ నెలలొక దినమూ అందం బాయెను రాత్రి
శ్రీహరిని వెదుకుచూ చిలుకలా సాగెను
మూడు నెలలొక దినమూ మురికి గర్భములోన
మూల స్థానము నందు ముద్ద ఏరుపడెను
నాలుగు నెలలొకదినమూ నాగకంరుడు వచ్చి



నవసూత్ర ద్వారమున నడుమేరుపరిచెను
ఐదూ నెలలొక దినమూ ఆ రుద్రుడా బ్రహ్మ
అభయా హస్తమునిచ్చి ఆయుష్షు పోసెను
ఆరూ నెలలొకదినమూ ఆ విష్ణువా బ్రహ్మ
కాళ్లూ చేతులు నడుపు క్రమమేరుపరచెను
ఏడూ నెలలొకదినమూ ఎరుకాయె పిండమ్మ
కంఠస్థానము తెరుచు క్రమమేరుపరచెను
ఎనిమిది నెలలొకదినమూ ఎరుకాయె పిండమ్ము
కాంతశ్రీ గర్భమున కదలాడసాగెను
తొమ్మిది నెలలొక దినమూ ఆ తల్లి ఓర్వక
ద్వారమ్ము తెరువుమని శ్రీహరిని ప్రార్థించె
తల్లి ఒక్కతే కాని తన తంద్రులెందరో
తప్పు తీర్చగమంటూ దణ్ణాలు పెట్టెను.

ఇలా ఇందరు దేవతలు ఆ పిండరూపంగా ఉన్న శిశువుకి సహాయపడితే అలా సహాయపడిన కారణంగా జన్మనెత్తిన ఆ శిశువు తన కృతజ్ఞతలని తెలియజేస్తూ రెండు చేతులనీ నమస్కారపూర్వకంగా పెడుతూ తల్లి గర్భం నుండి ఇవతలికి వస్తాడు. ఇదుగో ఈ రావడాన్నే 'విజయదశమి అంటారు లోకంలోని తల్లి విషయంలో.

కాబట్టి విజయదశమి ఉత్సవాన్ని ప్రతి స్త్రీ కూడ తన పండుగగా చేసుకోవచ్చున్నమాట– అక్కడ అమ్మ రాక్షసగణంతో ఎలా పోరాడిందో అలాగే తానూ పోరాడి విజయాన్ని సాధించి దానికి సంకేత రూపంగానూ ప్రతీకగానూ.

ఇక దశ జన్మల (10 జన్మల) పాపాన్ని హరించే పండుగ కాబట్టి దీన్ని 'దశహరా' అంటారనీ, అది క్రమంగా దసరాగా మారిందనీ ఒక కొందరు చెప్తారు. బ్రహ్మ భార్య సరస్వతికీ, శ్రీహరి భార్య లక్ష్మికీ, శంకరుని భార్య పార్వతికీ – ఇలా త్రిశక్తి స్వరూపాలకీ ఈ నెలరోజుల పాటూ పూజ సాగడం దసరాపండుగ లక్ష్యం. సరే!

## ప్రతి పేరూ అర్థవంతమే

అమ్మ ఎందరెందరో రాక్షసుల్ని చంపిందని మనకి పురాణం చెప్తోంది. ఆ రాక్షసులెవరెవరు? వాళ్ల పేర్లేమిటి? అయినా ఆమె ఎవరెవర్నో చంపిందే అనుకుందాం! దానివల్ల మనకి తెలుసుకోవలసిన అంశమంటూ ఏముంది? అనే సందేహం మనకి వస్తూంటుంది.

'అమ్మ చంపింది రాక్షసులనే' అనే మాట యదార్థమే అయినా దాన్ని మన జీవితానికి మనం అన్వయించుకుని చూసుకోవాలి. ఇలా అన్వయించుకోవడానికి ముందు వాళ్లకున్న పేర్లని తెలుసుకుంటే అమ్మ ఏ తీరు రాక్షసుల్ని సంహరించిందో అర్థం కావడమే కాక, ఆ వృత్తాంతాన్ని మనం తెలుసుకున్నందువల్ల మనకి కలిగే ప్రయోజనాలేమిటో కూడ మనకర్థమౌతాయి.

అమ్మ చంపింది మొదటగా 'భండు'డనే రాక్షసుణ్ణి. ప్రతి రాక్షసుని పేరూ అర్థవంతమే 'భండుడు' అంటే బద్ధకం కలిగిన వాడు అని అర్థం. ఈ రోజు పనిని రేపటికీ, రేపటిపనిని ఎల్లుండికీ, ఆనాటి పనిని మరుసటి రోజుకీ వాయిదా వేసుకుంటూ పోయే లక్ష్యమున్నవాడని అర్థం. ఇలాంటి రాక్షసుణ్ణి సంహరించిదనగానే మనం కూడ అర్థం చేసుకోవాలి– మనలోని బద్ధకాన్ని విడిచి పెట్టాలని.

ఇక అమ్మ చంపిన మరో రాక్షసుని పేరు 'విషంగుడు. సంగమంటే సంబంధం, చుట్టరికం, స్నేహం అని అర్థాలు వి+సంగుడు = విషంగుడు. అంటే ఎవరితోనూ ఏ సంబంధమూ లేనివాడూ– ఏ చుట్టరికాన్ని ఎవరితోనూ చేయనివాడూ– ఎవరినీ తన స్నేహితులుగా చేసుకోనివాడూను. కేవలం ఒంటరిగా జీవించే లక్ష్యం, మనస్తత్వం కలవాడని అర్థం. ఎవరూలేక 'తానూ, తన పిల్లలూ తన భార్యా అంతే అనుకుని జీవించేవాడన్న మాట. ఇలాంటి వ్యక్తి వల్ల కూడ సంఘానికీ, దేశానికీ ఏ ప్రయోజనమూ లేదు – ఉండదు. అందుకని ఆ విషంగుణ్ణి సంహరించింది. అంటే మనం అర్థంచేసుకోవాలి మనం అలా ఉండకుండా పదిమందితో పరిచయాన్నీ, స్నేహాన్నీ చుట్టరికాన్నీ కలిగి ఉండి, కలుపుకోలు తనంతో ఉండాలని. తానొకరితో స్నేహాన్ని చేస్తూ ఉంటే, ఆ ఎదుటి వాళ్లు మనతో స్నేహాన్ని చేస్తూ ఉంటారు. కాబట్టి సమైక్యభావం కలిగి ఉండాలనే విశేషాన్ని అమ్మ చెప్తోందన్నమాట.

అమ్మ చంపిన మూడవ రాక్షసుని పేరు విశుక్రుడు. శుక్రమంటే జారిపడే పదార్థమని అర్థం. ఏ వ్యక్తి తానుగా చెప్పిన మాటకి కట్టుబడడో, ఎప్పటికప్పుడు మాటమీద నిలబడకుండా జారిపోతూ ఉంటాడో అలా మాటని తప్పించుకునే లక్షణమున్న వ్యక్తిని విశుక్రునికి సంకేతంగా భావించాలి. దీనిద్వారా మనం నేర్చుకోవాల్సిందేమంటే – మనమెప్పుడూ ఒక మాటమీదే నిలబడి ఉండాలనీ, ఏనాడూ జారిపోకుండా మన శీలాన్ని (నడవడిక) రక్షించుకుంటూ ఉండాలనేను.

ఇలాగే అమ్మ చంపిన రాక్షసులలో మరోకని పేరు మహిషాసురుడు. 'మహిష' మనే పదానికి దున్నపోతు అని అర్థం ఎక్కడ వర్షపుచినుకు తనమీద పడుతుందోననే భయంతో మేఘాలు దట్టంగా పట్టి కారుమబ్బు కన్పించగానే ఆవు ఎక్కడ మరుగు ప్రదేశముందా? అని కలియజూస్తుంది. చినుకు పడగానే తప్పించుకునే చోటున్న పక్షంలో

అక్కడికి చేరిపోతుంది. మరి అదే దున్నపోతుగాని అయితే, కుంభవృష్టి కురిసినా అదే వర్షంలో నిలబడి, వర్షం వెలిసాక - ఇంతేనా? - అన్నట్లు ఆకాశానికేసి చూస్తుంది. అదీ దున్నపోతు లక్షణమంటే. అంతే కాదు. ఆవు పరిశుభ్ర జంతువు. ఎక్కడైనా పేడగాని ఎండుగడ్డి మీద పడితే ఆ దారిదాపుల్లో ఉన్న గడ్డిని కనీసం తిందామని ప్రయత్నమైనా చెయ్యదు. దున్నపోతు మాత్రం పేడ పడినంత భాగాన్ని విడిచి నిర్భయంగా తినేస్తుంది. అంటే ఏమన్నమాట? దీనికి సిగ్గుగాని, అభిమానం గాని, సున్నితమైన పద్ధతి గాని లేక జీవించే మందమైన లక్షణం కలది దున్నపోతని దీని భావమన్నమాట. గౌరవప్రదమైన వ్యక్తిగా సమాజంలో జీవించే ప్రతి వ్యక్తీ తనకొచ్చిన పరిస్థితులని గమనించుకుని, నష్టపోయిన పక్షంలో - ఇంకెప్పుడూ ఇలాంటి పనిని చేయరాదని గమనించి, తప్పుని దిద్దుకోవాలి తప్ప ఎప్పుడూ దున్నపోతువంటి మనస్తత్వంలో దేన్నీ పట్టించుకోని తనంతో ఉండనే ఉండరాదన్నమాట.



ఇలాంటి రాక్షసున్ని అమ్మ సంహరించిందనగానే మనం కూడ ఆ రాక్షస లక్షణాలు మనలో కూడ ఉన్నాయేమోనని గమనించుకుని జాగ్రత్త పడాలని దీని భావమన్నమాట.

## దసరా వేషాలు

దసరాకి చక్కని వేషాలు వేసుకుని ఇళ్లకి వస్తారు కొందరు. మొదటిది వైద్యుని వేషం. చక్కని నల్లని కోటు వేసుకుని డాబులు చెప్తూ వస్తాడు వైద్యుడు. తన దగ్గరున్న మందుల వివరాన్నీ, అవి వ్యాధుల్ని ఏ తీరుగా నయం చేస్తాయో ఆ పద్ధతుల్నీ వివరిస్తాడు. అతని మాటల్లోనే విందాం!

'అయ్యా! వాతపైత్యానికి మందు! శీతపైత్యానికి మందు!
కడుపులో గుల్మానికి మందు!
భేదికి మందు ! మహా భేదికి మందు!
మందులోయ్ మందులు - మందులోయ్ మందులు!
స్వామీ ! కుక్క కాటుకి చక్కని మందుంది - చెప్పమంటారా?
కుక్క కరిచెనేని కుడి రెక్క విరిచేసి
పక్క విరుగగొట్టి పండబెట్టి
నెత్తిలోన మేకు నెమ్మదిగా గొట్ట
కుక్క కాటు విషము ఎక్కదయ్య !

కుక్క గాని కరిస్తే కుడిరెక్కని (భుజానికి సంబంధించిన గూడుని) వెనక్కి విరిచి, ఆ పక్కా ,ఈ పక్కా గట్టిగా కొట్టి నేలమీద పడుకోబెట్టి నెత్తిలో దిగేలా చక్కని మేకుని గాని నెమ్మదిగా కొడితే కుక్కకాటు విషం ఏ మాత్రమూ ఎక్కదని దీని అర్థం. హాస్యాన్ని పండించే పద్యం - వేషం ఇది.

ఇక రోగాల్లో కొన్ని తగ్గని వ్యాధులంటూ కూడ ఉంటాయి. వాటిక్కూడ మా వద్ద తగిన ఔషధాలున్నాయి. వినండి! వినండి!

'కంటి రోగికి మందు కను తొలగించుటే
మొండి భర్తకు మందు పిండి కర్ర
మతిలేని వానికి మందౌను నల్మందు
లోభివానికి మందు నాభి విషము'

'కంటికి రోగం వస్తే పెద్ద కష్టమేమీ కాదు - ఆ కన్నుని శాశ్వతంగా తొలిగించేస్తేచాలు. మొండివాడైన భర్తతో వేగడం ఏమంత కష్టం కాదు. పిండిని ఒత్తుకునే కర్రతో వాడికి తగినంత స్థాయిలో చికిత్స చేయడం మంచిది. మతిలేని వాడుంటే భయమూ బెంగా అక్కరనేలేదు. వాడికి నోటినిండా నల్లమందు కుక్కితే సరి. (మరింతగా మతిపోతుంది) లోభిత్వంతో ఉండే పిసినారికి 'నాభి' ( విరేచనాలు పట్టుకునే మందు) ఔషధాన్నిస్తే చాలు. వాడికి రోజంతా కావలసినంత పని - వచ్చే నీరసానికి, చెప్పలేనంత సొమ్ము ఖర్చూ అవుతుంది'- అని దీనర్థం.

ఇలాంటి వైద్యాలని చేసి గండపెండేరాలనీ - సువర్ణ ఘంటా కంకణాలనీ - విలువైన హారాలనీ - శాలువలనీ బహుమతులుగా పొందామంటూ ఆ వైద్యుడు చెప్పుకుంటూ వెళ్తాడు తన ఉపన్యాసంలో. ఇలా రోజుకొక్క చిట్కా చొప్పున చెప్తూ తొమ్మిదిరోజులూ అయ్యాక 'ఈనాం' (బహుమతి) ఇప్పించండని ప్రార్థిస్తాడు యాజమానిని.

## వ్యాపారి వేషం

లోకంలో వ్యాపారులు ఎలా మోసం చేస్తారో ఆ విషయాలని వివరిస్తాడు సెట్టివేషంలో ఓ వ్యక్తి. ఇది ఎవరినీ ఏ జాతినీ కించ పరచడానిక్కాదు - జనుల్ని ఆనందపెట్టడానికీ.ఆ సెట్టిగారి మాటల్లోనే విందాం!

అయ్యా! అయ్యా! నేనీ ఊళ్లో సంసారం చేసేట్టే ఉందా? ఏపారం నడిపేట్టే ఉందా?

మొన్నటి మొన్న నాలుగువరహాలన్నొన్న జొన్నల్ని ఎనిమిది వరహాలకి అమ్మి నడేట్లో కలిసిపోయాను. నిన్నటికి నిన్న ఆముదాలని నలభై వరహాలన్నొని అరవై వరహాలకి అమ్మి ఆరిపోయాను. ఈ నష్టాల దెబ్బకి తట్టుకోలేక అరవై ప్రాంసరీ నోట్లని రాసి ఆ బాకీలకి ఇ.పి. పెట్టేసాను. ఏం చేత్తామండీ యాపారం? నాదగ్గిరేముంది? సంచికింద బూడిద.



నాకు ఐదుగురే కొడుకులండి ఆళ్లూ ఒట్టి యెదవలేనండి నాలాగ. మొదటోడు ఉక్కిరి బిక్కిరిగాడు. ఆడికి నొట్లల్లో లెక్కలు రాసే పని అప్పచెప్పానండి. ఎవరెక్కువిస్తే ఆడి పక్షానే తీర్పులు చెప్తా ఉంటాడండి. అబ్బే! నేనెప్పుడూ జగడానికే ఎళ్లనండి.జగడం వచ్చినా కోర్టు బోనెక్క నండి. ఎక్కితే హుళక్కే కదండి.

మూడోవోడి పేరు అబద్ధాలగాడండి. ఆడు పేరుకి తగట్టు మాటాడి మాటాడి నిజమంటే ఏంటో మర్చిపోయాడండి.

ఇక చివరి ఇద్దరూ సత్తెశాలయ్య, రాగులయ్యానండి. ఆళ్లిద్దరూ కవలపిల్లలండి. ఆళ్లకింకా యేపారం తెలీదండి.

....ఇలా తొమ్మిది రోజుల పాటు నవ్విస్తూ పదోరోజున బహుమతిని యాచిస్తాడు వ్యాపారివేషంలో వచ్చే వ్యక్తి.

## విజయదశమి

ఆశ్వయుజమాసంలో జరిగే ఈ పది రోజుల ఉత్సవంలోనూ అమ్మవారికి రోజుకి ఒక్కొక్క అలంకారాన్ని వేస్తారు. ఆ అలంకారాన్ని చూడ్డం కోసం అందరూ దేవాలయానికి వస్తూ ఉంటారు. స్త్రీకి తక్కువ స్థానమిచ్చారని నేటి వాళ్లంతా బాధపడుతూ ఉంటారు గాని, భారతదేశం ఎంత గొప్పదంటే స్త్రీని ఒక దేవతగా ఏర్పాటు చేసి ఆమెని ఆరాధింపచేసేంత. మరో విశేషమేమంటే, గణపతికి తొమ్మిదిరోజుల పాటు ఉత్సవం చేస్తే, అమ్మకి మాత్రం ఆశ్వయుజమాసం మొత్తం ముప్పై రోజుల పాటూ (దీపావళి వరకూ ఉత్సవాలే) ఉత్సవాన్ని చేయడమే కాక, ఉగాది నుండి తొమ్మిది రోజుల పాటు వసంత నవరాత్రుల పేరిట కూడ అమ్మ ఉత్సవాలని చేస్తారు. అంటే అమ్మ పేరిట ముప్పై తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరిపే ఏర్పాటుని స్త్రీ దేవత విషయంలో పెద్దలు ఏర్పాటు చేసారంటే స్త్రీకి అంతటి ప్రాదాన్యాన్ని ఇచ్చారన్నమాట. ప్రతి గ్రామానికీ పట్టణానికీ కూడ ఓ స్త్రీ దేవతని గ్రామ దేవతగా ఏర్పాటు చేసారంటే స్త్రీకి విలువని ఇచ్చినట్లా? కాదా?

## విజయముహూర్తం

ఈ సంవత్సరం ఈ పదిరోజుల పాటు జరిగే విజయదశమి ఉత్సవాల్లో విజయముహూర్తం ఈ సారి మధ్యాహ్నం 1-51 నిమిషాలకి వచ్చింది కాబట్టి, ఒంటి గంట నుండి రెండు గంటల మధ్య కాలంలో ఏ పనినైనీ ప్రారంభించినట్లైతే ఆ పని విజయవంతంగా ముగుస్తుందన్నమాట. మర్నాడు ఏకాదశి. ఆ రోజున కూడ విజయ ముహూర్త కాలం మధ్యాహ్నం 1-47 ని॥లకు వచ్చిన కారణంగా ఆ రోజున కూడ ముఖ్యమైన పనుల్ని ప్రారంభించవచ్చున్న మాట.

## శమీ పూజ

విజయదశమి రోజున చేసే చివరి కార్యక్రమం 'శమీపూజ' శమీ అంటే పవిత్రమైనదనీ - జమ్మిచెట్టనీ అర్థాలు. కాబట్టి ఆ రోజున జమ్మి చెట్టుకి ప్రదక్షిణం చేసి ఈ క్రింది శ్లోకాన్ని ముమ్మారు చదవాలని పెద్దలు చెప్పారు.

'శమీ శమయతే పాపమ్!
శమీ శత్రువిశాశినీ!
అర్జునస్య ధనుర్ధారీ!
రామస్య ప్రియదర్శినీ॥'

ఓ శమీ వృక్షమా! పాపాన్ని తొలగించగల శక్తి ఉన్న వృక్షానివి నువ్వు. శత్రువులని పారద్రోలగలగడమే కాక విరాటరాజు కొలువులో పాండవులున్నంతకాలం అర్జునుని గాండీవంతో పాటు అందరి ఆయుధాలనీ ఎవరికంటా పడకుండా రక్షించినదానిని కూడ నువ్వే.రాముడంతటి వానికి కూడ ప్రియాన్ని కల్గిస్తూ సీతమ్మకి బాధానివృత్తి చేసిఅయోధ్యకి తిరిగివచ్చేలా పట్టాభిషేకాన్ని పొందేలా (మొక్కుకుంది సీత) చేసిందానివి నువ్వే! అని దీని అర్థం. ఇలా పండుగ ఈ కార్యక్రమంతో ముగుస్తుంది.

- డా॥ మైలవరపు శ్రీనివాసరావు

**ఏదైనా దేశ అభివృద్ధికి ఆ దేశంలో లభ్యమయ్యే సహజవనరులు, ఆర్ధిక వనరులు ఎంత ముఖ్యమైనవో మానవ వనరులు కూడా అంతకంటే ముఖ్యమైనవి. దేశంలోని ప్రజలలో పేదరికం, ఆకలితో అలమటించటం, పౌష్టికాహార లోపం, శిశు మరణాలు, మాతృమరణాలు ఎక్కువగా ఉండటం, జీవన ప్రమాణాలలో మెరుగుదల తీసుకొనివచ్చే త్రాగునీరు, గృహవసతి, విద్యుత్తు, విద్య, వైద్యం తదితర కనీస వసతులు అందుబాటులో లేని ప్రజలతో కూడిన సమాజాలు, దేశాలు అభివృద్ధికి ఆమడదూరంలో నిలుస్తాయనేది నిష్ఠుర సత్యం.**

గత 60 సం.లలో దేశాన్ని అభివృద్ధి పథంలో నడపటానికి వివిధ రకాలయిన ప్రణాళికా వ్యూహాలద్వారా గత 60 సంవత్సరాలలో 10 పంచవర్ష ప్రణాళికలు అమలు పరిచి వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్ధిక, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ, మానవ వనరుల అభివృద్ధి రంగంలో మన దేశం నేటికీ సమకాలీన దేశాలకన్నా ఎంతో వెనుకబడి ఉంది.

భారతదేశం జనాభా పరంగా ప్రపంచంలో రెండవ అతిపెద్ద దేశమయినప్పటికీ, దేశంలోని మానవవనరులను అనుకూలంగా మలచుకొని అభివృద్ధి పథంలో ముందంజ వేయటానికి బదులు మానవ అభివృద్ధి రంగంలో తిరోగమన దిశలో పయనిస్తోందనటానికి 2008 లో ఐక్యరాజ్య సమితి (యు.ఎన్.డి.పి) మానవ అభివృద్ధి నివేదికను ప్రామాణికంగా తీసుకొనవచ్చును. 179 దేశాలలో మానవ అభివృద్ధి రంగంలో సాధించిన ప్రగతిపై జరిపిన సమగ్ర పరిశోధనల ఆధారంగా రూపొందించిన జాబితాలో భారతదేశం 132వ స్థానంలో ఉన్నది . మానవ సగటు ఆయు: ప్రమాణాల సూచీలో 127, వయోజన విద్యా సూచిలో 118, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యా సూచిలో 134వ స్థానంలో ఉన్నదనే విషయం విస్మయం కలిగించే విషయమైనా, అంగీకరించాల్సిన విషయం.

ప్రపంచీకరణ, స్వేచ్ఛీకరణ, ప్రైవేటీకరణల కారణంగా భారత ఆర్ధిక వ్యవస్థ మూలాలు స్థిరపడి జి.డి.పిలో 6 నుండి 7 శాతం మధ్య గణనీయమైన వృద్ధి సాధిస్తున్నప్పటికీ, ఈ సంస్కరణ ఫలాలు గ్రామీణ పేద ప్రజలకు ఇంకా అందుబాటులోకి రాలేదు. ధనికులు, పేదల మధ్య అంతరాయం రోజురోజుకూ పెరిగిపోతూ, పేదలు రాను రానూ దుర్భర దారిద్ర్యంలోకి నెట్టివేయబడుతున్నారు. దేశంలో 1973-74 నాటికి 55 శాతం ఉన్న పేదరికస్థాయి (దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న ప్రజల శాతం) 2004-05 సం. నాటికి 27.5 శాతానికి తగ్గినప్పటికీ, పేదరికంలో మగ్గిపోతున్న జన సంఖ్యలో పెద్దగా మార్పులేదు. ప్లానింగ్ కమీషను

# మానవ వనరుల అభివృద్ధిలో పంచాయతీ రాజ్ సంస్థల పాత్ర



అంచనాల ప్రకారం 1994- 95 నాటికి సుమారు 32 కోట్ల జనాభా దారిద్రరేఖకు దిగువన నివసిస్తున్నారు. త్రాగునీరు, పారిశుద్ధ్యం ఆరోగ్యం, విద్య, వైద్యం, విద్యుత్తు, గృహనిర్మాణ రంగాలలో ఎన్నో గ్రామాలలో నేటికీ కనీస మౌలిక సదుపాయాలకు, సేవలకు నోచుకోక అరకొర సౌకర్యాలతో జీవితాలు గడపటానికి ప్రజలు అలవాటు పడిపోవటం మనం గమనిస్తూనే ఉన్నాము. ప్రజల జీవన ప్రమాణాలలో మెరుగుదల కోసం 11వ పంచవర్ష ప్రణాళికా కాలం (2007-2012) లో సమ్మిళిత అభివృద్ధి వ్యూహం అవలంబించటం ద్వారా ఇతర రంగాలలో సాధిస్తున్న అభివృద్ధితో పాటుగా దశాబ్దాలుగా వెనుకబాటుతనానికి గురవుతున్న వర్గాలకు, మరీ ముఖ్యంగా అనుసూచిత జాతులు/ అనుసూచిత కులాల ప్రజలను, మహిళలకు అభివృద్ధిలో భాగస్వామ్యం కలిస్తూ సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించటం ముదావహం.

## మానవ అభివృద్ధి - సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు

క్రీ.శ.2000 సం.లో ప్రపంచవ్యాప్తంగా మానవ అభివృద్ధి రంగంలో మెరుగైన ప్రమాణాలు సాధించటం కోసం 8 అంశాలలో 191 దేశాలు ఏర్పరచుకొన్న సహస్రాబ్ది లక్ష్యాలను (మిలీనియం డెవలప్‌మెంట్ గోల్సు) మన దేశం కూడా అన్వయించుకొన్నది. ఈ లక్ష్యాలలో (1) దేశంలో పేదరికాన్ని, ఆకలి చావుల్ని నివారించటం (2) సార్వత్రిక ప్రాథమిక విద్య సాధన (3) లైంగిక సమానత్వాన్ని, మహిళా సాధికారతను సాధించటం (4) శిశు మరణాలను తగ్గించటం (5) ప్రసూతి మరణాలను తగ్గించటం (6) హెచ్.ఐ.వి/ ఎయిడ్స్, మలేరియా తదితర వ్యాధులపై పోరాటం (7) పర్యావరణ పరిరక్షణ (8) ప్రపంచ అభివృద్ధికి సమిష్టి, భాగస్వామ్యం వంటివి ఉన్నాయి. ఈ 8 ప్రధాన లక్ష్యాల సాధనకు గాను 48 ఉపలక్ష్యాలను నిర్దేశించుకొని పలు రకాలయిన అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరుస్తోంది. ఐతే ఈ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సాధించిన ప్రగతి కూడా ఆశించిన మేర లేదనేది 2007 లో ఢిల్లీలోని సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషను విడుదల చేసిన సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల మధ్యంతర నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను అధిగమించటానికి విశేషమైన కృషి జరగాల్సిన అవసరాన్ని ఈ నివేదిక నొక్కి చెప్తోంది. సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషను నివేదిక ప్రకారం, దేశంలో నేటికీ 27.5 శాతం జనాభా దారిద్రరేఖ దిగువన నివసిస్తున్నట్లు, గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థుల నమోదు శత శాతం సాధించినప్పటికీ 1నుండి 5వతరగతి వరకూ పూర్తి చేసే పిల్లల శాతం 71 శాతం మాత్రమే ఉన్నట్లు, పాఠశాలలో బాలికల - బాలుర నిష్పత్తిలో 88 శాతం వరకు మాత్రమే సాధించినట్లు, 5 సంవత్సరాల లోపు మరణించే పిల్లలు ప్రతీ 1000కి 99 మంది ఉన్నట్లు, కేవలం 32.36 శాతం జనాభా ఇళ్ళలో మరుగుదొడ్లు / స్నానపు గదుల సౌకర్యాలు ఉన్నాయనీ, 41 శాతం కాన్పులు మాత్రమే నిపుణుల పర్యవేక్షణలో జరుగుతున్నాయని, ప్రతీ 1000 శిశు జననాలకి 58 మరణాలు సంభవిస్తున్నాయని, ప్రతీ లక్ష మంది గర్భవతులలో 301 మంది మరణిస్తున్నారని, త్రాగునీటి సౌకర్యాన్ని పొందుతున్న ప్రజలు 85.22 శాతం మాత్రమే ఉన్నారని ఈ నివేదిక వెల్లడించింది.

2007లో వెలువరించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేక్షణ- 3 ప్రకారం కూడా ప్రతీ 1000 జననాలకు 57 శిశు మరణాలు సంభవిస్తున్నాయనీ, 41 శాతం కాన్పులు మాత్రమే నిపుణుల పర్యవేక్షణలో జరుగుతున్నాయని, 44 శాతం జనాభాకు మాత్రమే మరుగుదొడ్ల సదుపాయం ఉన్నదనీ, 27.9 శాతం జనాభాకి మంచినీటి సరఫరా పైపులైను ద్వారా జరుగుతున్నదని మనం అర్థం చేసుకోవచ్చు. అదే విధంగా



యునిసెఫ్ 2008లో విడుదల చేసిన నివేదిక కూడా పలు చేదు నిజాలను బహిర్గతం చేసింది. ఈ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 5సం.లోపు సంభవించే శిశుమరణాలలో 21 శాతం మరణాలు భారతదేశంలోనే సంభవిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా తక్కువ బరువుతో జన్మించే శిశువులలో 43 శాతం భారతదేశంలోనే జన్మిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంభవించే నియోనేటల్ (0-28 రోజులలోపు) మరణాలలో 1/3వ వంతు మనదేశంలోనే సంభవిస్తున్నాయి. అధికారిక లెక్కలకి, క్షేత్ర స్థాయిలో వాస్తవపరిస్థితులకీ మధ్య వ్యత్యాసం సంగతి ఎలా ఉన్నా ఈ గణాంకాలను ఒక సారి పరిశీలిస్తే పేదల జీవన ప్రమాణాలు నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్న చందాన తయారవుతున్నాయన్న వాస్తవాన్ని మనం జీర్ణించుకోక తప్పదు.

మానవఅభివృద్ధి రంగంలో పురోగతి కోసం గత 60 సం.లోపు జరిగిన ప్రయత్నాలను పున: సమీక్షించుకొని ఈ రంగంలో 11వ పంచవర్ష ప్రణాళికా కాల వ్యవధిలో పెద్ద ఎత్తున కేటాయింపులు జరిపి ప్రమాదకరంగా పరిణమిస్తున్న పరిస్థితులను చక్కదిద్దాలని ప్లానింగు కమీషను వ్యూహం సిద్ధ పరిచింది. ఈ దిశలో పురోగతి సాధించాలంటే కేంద్రీకృత స్థాయిలో పథక రచనలు, అమలు పర్యవేక్షణలకు స్వస్తి పలికి స్థానిక ప్రభుత్వాలకు పథకాల ఎంపిక, అమలు, పర్యవేక్షణ, మదింపు ప్రక్రియలో పూర్తిస్థాయి భాగస్వామ్యం కలుగచేస్తే తప్ప మానవ అభివృద్ధి రంగంలో ఆశించిన మేర పురోగతి సాధ్యంకాదని ప్రణాళికా కమిటీ తన 11వ పంచవర్ష ప్రణాళికా పత్రంలో పేర్కొనటం జరిగింది. అంతేకాకుండా 11వ పంచవర్ష ప్రణాళికా కాలం (2007-2012)లో జిల్లా ప్రణాళికా రచన తప్పనిసరి చేయటంతో భారత రాజ్యాంగపు ఆర్టికల్ 243 జి మరియు 243 జడ్.డి.ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థలు సూక్ష్మ స్థాయి ప్రణాళికలు తయారు చేయవల్సిన పరిస్థితులు కూడా నేడు ఉత్పన్నమయ్యాయి.

## మానవ అభివృద్ధి - పంచాయతీ రాజ్ సంస్థల పాత్ర

సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను దేశస్థాయిలో ఏర్పరుచుకొన్నప్పటికీ మొత్తం 8 అభివృద్ధి లక్ష్యాలలో మొదటి ఏడు (1) పేదరికాన్ని, ఆకలి చావుల్ని నివారించటం (2) సార్వత్రిక ప్రాధమిక విద్య సాధన (3) లైంగిక సమానత్వాన్ని, మహిళా సాధికారతను సాధించటం (4) శిశు మరణాలను తగ్గించటం (5) ప్రసూతి మరణాలను తగ్గించటం (6) హెచ్.ఐ.వి./ ఎయిడ్స్, మలేరియా తదితర వ్యాధులపై పోరాటం (7) పర్యావరణ పరిరక్షణలకు గాను లక్ష్యాల కార్యాచరణ ప్రణాళికలను గ్రామస్థాయిలో తయారుచేసుకొని సాధించవలసినవే. ప్రజా భాగస్వామ్యం లేనిదే ఈ అంశాలలో పురోగతి సాధించటం అనుకొన్నంత సులభం కాదు. గ్రామ స్థాయిలోనే ఈ లక్ష్యాల సాధనకు రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన పంచాయతీ రాజ్ సంస్థలు ఎంతో సహాయకారిగా ఉండటమే కాక, ప్రజలకు, ప్రభుత్వానికి వారిధిగా కూడా పనిచేస్తాయి.

ప్రపంచీకరణ, స్వేచ్ఛీకరణ, ప్రైవేటీకరణల ఫలాలు సక్రమరీతిలో లక్షిత ప్రజలకు అందచేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు జరిగే పథకాలకు కేటాయింపులు పెంచటం ఒక ఎత్తయితే, ఈ పథకాలను క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలుచేయటం మరొక ఎత్తుగా భావించవచ్చు. కేంద్రీకృత స్థాయిలో పథక రచన చేయబడి, పంచాయతీలకు సమాంతరంగా ప్రత్యేక ఏజన్సీల ద్వారా అమలు చేయబడే వివిధ పథకాలు ఏ మేరకు ఫలితాలు ఇచ్చాయో అన్న వాస్తవాలని 2008 ఐక్యరాజ్య సమితి మానవ అభివృద్ధి నివేదిక, యునిసెఫ్ నివేదిక 2008 ల ద్వారా బహిర్గతమౌతోంది. ఐతే ఈ బాధ్యతను పంచాయతీ రాజ్ సంస్థలు సమర్థంగా నిర్వర్తించగలవనటానికి ఉదాహరణగా ఉపాధిహామీ పథక నిర్వహణను పేర్కొనవచ్చును. ఈ పథకాన్ని, చట్టం ద్వారా పూర్తిగా పంచాయతీరాజ్ సంస్థలకు అప్పగించి కూలీలకు ఉపాధి కల్పించటంలో బాధ్యులను చేయగా పంచాయతీ రాజ్ సంస్థలు విజయవంతంగా అమలు చేయటం మనకు తెలిసిన విషయమే. నేడు సుమారు 30100 కోట్ల రూపాయలు పంచాయతీల ద్వారా పారదర్శకంగా ఖర్చు అవుతున్నాయి. ఇదే విధంగా మానవ వనరుల అభివృద్ధికి సంబంధించిన ఇతర కార్యక్రమాల విషయంలో కూడా పంచాయతీ రాజ్ సంస్థలకు సముచితమయిన పాత్రను కల్పించనట్లయితే ఈ సంస్థలు విశేషమయిన కృషి చేయటానికి అవకాశం ఉంది.

> **ప్రపంచీకరణ, స్వేచ్ఛీకరణ మరియు ప్రైవేటీకరణల కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ మూలాలు స్థిరపడి జి.డి.పిలో 6 నుండి 7 శాతం మధ్య గణనీయమైన వృద్ధి సాధిస్తున్నప్పటికీ, ఈ సంస్కరణ ఫలాలు గ్రామీణ పేద ప్రజలకు ఇంకా అందుబాటులోకి రాలేదు.**

73వ రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243 జి.(ఎ), (బి) ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థలకు స్థానిక ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి సామాజిక న్యాయం సాధించడానికి ప్రణాళికలు తయారుచేయటమే గాక ఈ లక్ష్యాలను సాదించడానికి ఉద్దేశించబడిన పథకాలను అమలు పరిచేటందుకు కావలసిన నిధులు, సిబ్బందిని కూడా అప్పగించవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించటం జరిగింది. అయితే, వివిధ కారణాల వలన పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగంలో 11వ షెడ్యూలులో సూచించిన 29 అంశాలకు సంబంధించిన నిధులు, విధులు, సిబ్బందిని బదలాయించి ఈ సంస్థలను బలోపేతం చేయటానికి పలు రాష్ట్ర ప్రభుత్వాలు సుముఖంగా లేవు . పంచాయతీ రాజ్ సంస్థలు బలోపేతంగా ఉన్న రాష్ట్రాలలో వివిధ మానవ అభివృద్ధి అంశాలలో మెరుగుదల ఉన్నట్లుగా పలు నివేదికల ద్వారా మనకు అర్థం అవుతోంది. ఉదాహరణకు కేరళ, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలలో బలమైన పంచాయతీ రాజ్ వ్యవస్థలు ఉండటం వల్ల, వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణను పూర్తిగా ఈ సంస్థల ద్వారా చేయటం వల్ల, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయటం వల్ల, సేవలతో నాణ్యత పెరిగి, ఈ రాష్ట్రాలలో గ్రామీణ స్థాయిలో శిశుమరణాలు, మాతృ మరణాలు, పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం వంటి సూచికలలో దేశస్థాయి సరాసరి కన్నా మెరుగైన ఫలితాలను మనం గమనించవచ్చు (పట్టిక1)

## పట్టిక 1. వివిధ రాష్ట్రాలలో మానవ అభివృద్ధి సూచికలు

| వ. సం. | సూచిక | కర్ణాటక | కేరళ | తమిళ నాడు | పశ్చిమ బెంగాల్ | ఆంధ్ర ప్రదేశ్ | భారత దేశం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | శిశుమరణాలు ప్రతీ వెయ్యి సజీవ జననాలకు | 43 | 15 | 31 | 48 | 53 | 57 |
| 2 | పోషకాహార లోపంతో ఉన్న పిల్లల్లో (3 సం.లోపు) - తక్కువ బరువు కల్గిన వారి శాతం | 41 | 29 | 33 | 44 | 37 | 46 |
| 3 | ఆసుపత్రులలో జరిగే ప్రసవాల శాతం | 67 | 100 | 90 | 43 | 69 | 41 |
| 4 | సుశిక్షితులైన సిబ్బంది సమక్షంలో జరిగే ప్రసవాల శాతం | 71 | 99 | 93 | 45 | 74 | 48 |
| 5 | మరుగుదొడ్డి సౌకర్యం గల కుటుంబాలు | 46.5 | 96 | 42 | 59 | 42 | 44 |
| 6 | 1-5 తరగతులలో నమోదు శాతం | 108.9 | 96.9 | 116.5 | 107.33 | 87.7 | 98.2 |
| 7 | 6-8 తరగతులలో నమోదు శాతం | 76.2 | 93.6 | 100.4 | 64.28 | 64.8 | 62.4 |

- ఆధారం : 1-5 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేక్షణ 3(2005-2006) నివేదికలు
- 6-7 ఆధారం: డైరక్టరు, ఎకనామిక్సు మరియు స్టాటిస్టిక్సు, ఆంధ్రప్రదేశ్

మానవ వనరుల అభివృద్ధి రంగంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, సెకండరీ విద్య, మహిళా శిశు సంక్షేమం, త్రాగునీరు, గ్రామీణ విద్యుదీకరణ, పారిశుద్ధ్యం వంటి విభాగాలలో సేవల మెరుగుదలకు పంచాయతీ రాజ్ సంస్థలు విశేషమయిన కృషి చేయవచ్చు. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని 11 వ పంచవర్ష ప్రణాళికా కాలంలో గ్రామీణ ప్రాంతాలలో కనీస అవసరాలను కల్పించటానికి కేంద్ర ప్రభుత్వం రాజీవ్ విద్యామిషన్ (సర్వ శిక్ష అభియాన్), త్రాగునీరు, పారిశుధ్య మిషన్, సంపూర్ణ పారిశుధ్య ఉద్యమం, మధ్యాహ్న భోజన పథకం వంటి ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలు, భారత నిర్మాణ్, రాజీవ్ గ్రామీణ విద్యుదీకరణ పథకం, వంటి అనేక ఇతర కార్యక్రమాల ద్వారా మానవ అభివృద్ధి రంగంలో గణనీయ మార్పు తీసుకొనిరావటానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఈ పథకాలన్నింటినీ స్థానిక ప్రాంతాలలో వివిధ స్థాయిలలోని పంచాయతీ రాజ్ సంస్థలు (గ్రామ పంచాయతీ / మండల పరిషత్తు / జిల్లా పరిషత్తు) ఆయా స్థాయిల్లో వాటికి కేటాయించబడిన కార్యకలాపాల ప్రకారం ప్రణాళికలు తయారు చేయటం, అమలు పరచటం, పర్యవేక్షించటంలోను పాలుపంచుకొన్నట్లయితే మరింత పారదర్శకత, జవాబుదారీ తనంతో సేవలు అందచేయటానికి అవకాశం ఉంటుంది.

పంచాయతీ రాజ్ సంస్థలు, ముఖ్యంగా మానవ అభివృద్ధి రంగంలో తమదైన ముద్ర వేయాలంటే విద్య, ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం వంటి భాగాలలో నెలకొల్పబడిన మౌలిక సదుపాయాల ద్వారా ప్రజలకు ఏ మేరకు సేవలు అందుతున్నాయి, లేదా ఈ సేవలలో ఏమైనా లోపాలు ఉన్నాయా అన్న విషయాలను విశ్లేషించుకొంటూ సేవలను మరింత మెరుగుపర్చటానికి చర్యలు చేపట్టవచ్చును. ఉదాహరణకు ప్రజారోగ్యాన్ని సంరక్షించటానికి వైద్య, ఆరోగ్య శాఖతో, గ్రామీణ నీటి సరఫరా శాఖతో, మహిళా శిశు సంక్షేమ శాఖతో సమన్వయంగా పనిచేస్తూ ఆసుపత్రులలో ప్రసవాలను ప్రోత్సహించటం, పిల్లలందరికీ టీకాలు వేయించటం, పోషకాహార పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటం ద్వారా, దోమల నిర్మూలనా కార్యక్రమాలు చేపట్టటం, సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టటం, సురక్షిత త్రాగునీటి సరఫరా కార్యక్రమాలను చేపట్టటం వంటి పనుల ద్వారా శిశు మరణాలను, మాతృ మరణాలను నివారించవచ్చు. ఇదే విధంగా మిగిలిన రంగాలలో కూడా సమస్యలను గుర్తించుట, స్థానికంగా పరిష్కారాలు కనుగొనటం చేయవచ్చును.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని నిధులు సమకూర్చినప్పటికీ, స్థానికంగా పంచాయతీ రాజ్ సంస్థలు ఈ బృహత్ప్రయత్నంలో పాలుపంచుకోనట్లయితే లక్ష్యాలను సాధించటం కష్టతరమవుతుంది. అలాగే ఈ రంగంలో పురోగతి ఒక్క పంచాయతీ రాజ్ సంస్థలలో పనిచేసే సిబ్బంది, ఈ సంస్థలకు ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధుల వల్ల మాత్రమే సాధ్యం కాదు. ఇందుకు గాను పంచాయతీ రాజ్ సంస్థలు స్థానికంగా పనిచేసే వివిధ స్వచ్ఛంద, సామాజిక సంస్థలతో, కార్పోరేట్ సంస్థలతో, మానవతా వాదులతో కలిసి పనిచేయటం అలవర్చుకోవాలి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో పలు గ్రామాలలో త్రాగునీటి కాలుష్యాన్ని నివారించటానికి గాను సురక్షిత మంచినీటి సరఫరా వ్యవస్థలను పబ్లిక్ - ప్రైవేట్ - పంచాయతీ భాగస్వామ్యంతో ఏర్పరుచుకొని కొన్ని పంచాయతీలు ప్రగతి పథంలో సాగటం మనం గమనించవచ్చు. స్థానిక ప్రజల మనోభావాలను పరిగణనలోనికి తీసుకుంటూ, వారి భావనలకు విలువనిస్తూ ముఖ్యంగా విద్య, మహిళా శిశు సంక్షేమం పారిశుద్ధ్యం, ఆరోగ్యం, వయోజన విద్య వంటి అంశాలలో మెరుగైన సేవల కల్పనకు పంచాయతీ రాజ్ సంస్థలు కృషి చేసినట్లయితే, ప్రజల జీవన ప్రమాణాలు మానవ అభివృద్ధి సూచికలలో గణనీయమైన అభివృద్ధిని సాధించటంతో పాటు ప్రపంచ దేశాల సరసన గౌరవ ప్రదమైన స్థానాన్ని దక్కించుకోవచ్చు.

**డా. వి. శివశంకర ప్రసాద్**
**జూనియర్ ఫాకల్టి, అపార్డ్**




# దేశ ప్రగతికి 'యునిక్ ఐ.డి'

తగిన గుర్తింపు లేకుండా ఎవరూ విదేశాలకు వెళ్ళలేరు. తగిన అనుమతి లేకుండా ఆ విదేశాల్లో ఉండనూలేరు. అందుకే విదేశాలకు వెళ్ళేవారు విధిగా పాస్‌పోర్ట్‌నూ, విదేశీ వీసాను పొందితేనే అక్కడికి వెళ్ళగలరు. అయితే మన దేశంలో మాత్రం, ప్రతి పౌరుడికీ పాస్‌పోర్ట్ విధిగా ఉండి తీరాలి, అనే నియమం ఇప్పటి వరకూ లేదు. అదే వుండి ఉంటే నేడు తీవ్రవాదుల చొరబాట్లుండేవి కావు. ఇన్ని తీవ్రవాద విధ్వంసక చర్యలు జరిగేవి కావనేది విశ్లేషకుల అభిప్రాయం.

నిజానికి విదేశీయుల అక్రమ వలసలనేవి మనదేశాన్ని ఏనాటినుంచో పట్టిపీడిస్తున్న జాడ్యం. మనింట్లో మనకు తెలీకుండా ఒక మనిషి జొరబడి నివసించడం ఎంత అసంబద్ధం? మీరే చెప్పండి! మన ఇల్లు, మన వాడ, మన నగరం, మన రాష్ట్రం మన దేశం – అన్నీ అంతే, మన ఇల్లు మనకెంత ముఖ్యమో, మన దేశం కూడా అంతే ముఖ్యం!




ఈ మధ్య మనదేశంలో సూపర్ బజార్ల సంస్కృతి పెరిగింది. రోజు రోజుకీ వీటి సేవలు కూడా బాగా పెరుగుతున్నాయి. తమ వద్ద తరచూ సరుకులు కొనేవారి కోసం ప్రత్యేకంగా గుర్తింపు కార్డులను జారీ చేస్తున్నారు కూడా! ప్రతి కొనుగోలు దారునుకి ఒక గుర్తింపు సంఖ్యతో గుర్తించడం జరుగుతోంది. మనకు ఇది కొత్తేమీ కాదు. నిజానికి, చౌకధర దుకాణాల్లో సరుకులు మనకు 'రేషన్ కార్డు'ంటేనే లభిస్తాయన్నది అందరికీ తెలిసిందే! బస్‌పాస్ ఉంటేనే బస్‌లో ప్రయాణం. ఇక ఇన్‌కమ్‌టాక్స్ చెల్లిస్తుంటే అందరికి పాన్‌కార్డుండాలి. అలాగే స్కూటర్, కారు, లారీ మొదలగునవి నడపాలంటే డ్రైవింగ్ లైసెన్సు కావాలి. ఇలా పలు విధాలుగా పౌరులను గుర్తించే ప్రక్రియ ఇప్పటికే అమలులో ఉంది.

దేశ రక్షణ, వనరుల సంరక్షణ, మెరుగైన పౌరసేవలందించాలంటే ఒక గుర్తింపు కార్డు అనేది చాలా అవసరం. ఇది లేకపోవడం వల్లేకదా, ఎవరో ఆగంతకులు నెలల తరబడి ఒక ముంబై హోటల్‌లో మకాంవేసి, చివరికి దాన్నే తగలబెట్టేంతదాకా వారిని అతిథులు

అనుకుని భావించాం. నిజానికి భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఉన్నంత స్వేచ్ఛ మరే దేశంలోనూ లేదు. ఒక గుర్తింపు కార్డు జేబులో ఉంచుకొని తిరగాల్సిన ఆగత్యం అంతకన్నా లేదు. భారతదేశంలో అడుగుపెడితే చాలు! 'స్థానికత' దానంతట అదే వచ్చేస్తుందనే ధీమా చాలా మందికి ఉంది. ఇటువంటి పరిస్థితి మరే దేశంలో లేదంటే ఆశ్చర్యం లేదు.

ఈ విదేశీయులు, చొరబాటుదారులు మన దేశంలోకి, రాష్ట్రంలోకి, ఇంకా చెప్పాలంటే మన నగరంలోకి ఎలా వచ్చారు? ఎందుకొచ్చారు? వారు సరైన అనుమతితోనే వచ్చారా? అసలైన జాతీయత కలిగిన పౌరుడు ఎవరు, నకిలీ ఎవరు ? అని గుర్తించగలిగితే, జాతీయ పౌర సేవా పథకాలను కూడా ఎంతో సమర్థవంతంగా అమలు చేయవచ్చు. బ్యాంకురుణాల వితరణ, డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ, వాహనాల రిజిస్ట్రేషన్ - వీటినీ తప్పసరి చేయవచ్చు. తద్వారా సమర్థవంతమైన సేవలను అందించడం ప్రభుత్వానికి సుసాధ్యమౌతుంది కూడా!




మన దేశ జనాభాలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు అసలు 58 మిలియన్లయితే, జారీ అయిన రేషన్ కార్డుల సంఖ్య దాదాపు 97 మిలియన్లుగా ఉంది. అంటే దాదాపు 40 మిలియన్ల రేషన్ కార్డులు బోగస్‌వన్నమాటే! ఇది కాక రైతులకోసం 65 మిలియన్ల కిసాన్ కార్డులు జారీ అయ్యాయి. గుర్తింపు కార్డులనేవి లేనందువల్లే ఇటువంటి బోగస్ కార్డుల జారీ అయ్యాయనేది నిర్వివాదాంశం.

ఇవన్నీ ముందే ఊహించి, అందరికి గుర్తింపు కార్డులను జారీ చేసుంటే ఎంతో బావుండేది. ఐతే ఇప్పటికీ ఆలస్యంగానైనా, మన దేశ ప్రభుత్వం దేశ ప్రజలందరికి ఒకే రకమైన రీతిలో గుర్తింపు సంఖ్యను జారీ చేయాలనుకోవడం ముదావహం. దీనికి 1.5 లక్షల కోట్లు అవసరమౌతుందని అంచనా! ఈ పథకానికే "యుఐడి ప్రాజెక్ట్" అని నామకరణం చేశారు. తొలి విడతగా రూ. 120 కోట్ల బడ్జెట్ కేటాయింపు చేశారు. దీనికోసం "యునిక్ ఐ.డి. అథారిటీ ఆఫ్ ఇండియా" అనే దాన్ని కూడా ఆరంభించారు.

లోగడ ఒకసారి ఓటరు గుర్తింపు కార్డు అనేది ఉంటేనే ఓటు వేయడానికి అనుమతిస్తామంటూ, ఎలక్షన్ కమీషన్ ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేసే ప్రక్రియ చేపట్టింది. అందరికీ ఓటరు కార్డు లేకపోవటం వల్ల కొన్ని ఇబ్బందుల్ని ఎదుర్కొంది. చివరికి ఓటు వేయాలంటే, ఏదో ఒక గుర్తింపు కార్డు - అది రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు లాంటివుంటే చాలని సర్ది చెప్పుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో "యుఐడి ప్రాజెక్టు" ప్రతిపాదన ప్రజలలో సరైన ఆసక్తి రేకెత్తించలేకపోగా దీనివల్ల ఐటి సంస్థలకే లబ్ధి చేకూరే అవకాశాలు మెండుగా ఉన్నాయంటూ, అందరూ బాహాటంగా చెప్పుకోవడం కొంత బాధనిపించినా అందులో సత్యం లేకపోలేదు. కానీ యు.ఐ.డి. వల్ల వొనగూరే లాభాలను గూర్చి మీడియాలో సరైన అవగాహన కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది. తద్వారా అపోహలు తొలగిపోతాయి.

దేశ విదేశాల్లో ఐడెంటిటి కార్డ్, కాన్సులర్ ఐడికార్డు, నేషనల్ ఐడి కార్డ్, రెసిడెంట్ ఐడెంటిటీ కార్డ్, సెక్యూరిటీ ఐడెంటిఫికేషన్ కార్డ్, పాస్ పోర్ట్, సిఐడి కార్డ్, ట్రావెల్ కార్డ్, గ్రీన్ కార్డ్, ఒడెక్స్ ( వెనీజుల్లా) కార్డు, వీసా - ఇలా ఎన్నెన్నో అమలులో ఉన్నాయి.

మన దేశంలో కూడా పాస్‌పోర్ట్ జారీ చేస్తున్నారు. కానీ ఇది విదేశీ ప్రయాణం చేయడానికి మాత్రమే తప్పనిసరి. భారతదేశంలో ఎప్పుడైనా, ఎక్కడికైనా, ఎలాగైనా ఏ గుర్తింపు కార్డు లేకుండా వెళ్ళవచ్చు. ఎలాంటి ధృవ పత్రాలూ, అనుమతి లేదా గుర్తింపు పత్రాలూ అక్కర్లేదు. పాస్ పోర్ట్ తప్పనసరి కాదు. మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో రేషన్ కార్డు ఒక్కటే తప్పనసరిగా అందరూ తీసుకొంటున్నారు. ఎందుకంటే దారిద్ర్యరేఖకు దిగువనుండే జనాభా-అది ఉంటేనే నిత్యావసర వస్తువులను చౌక ధరల దుకాణాల్లో పొందగలరు. దారిద్ర్య రేఖపైన ఉండే జనాలకు వేరే ఎలాంటి గుర్తింపు లేని కారణంగా ఈ రేషన్ కార్డే పెద్ద ఐడెంటిఫికేషన్ కార్డు.

మరి అది చాలుగదా, వేరే యుఐడి కార్డు ఎందుకు? అనే సందేహం రావచ్చు. రేషన్ కార్డులో ఒక ఇంటి యజమాని, అతని కుటుంబ సభ్యుల పేర్లు, ఇంటి చిరునామా వాటి వివరాలను మాత్రమే నమోదు చేస్తారు. దీన్ని ఎక్కడా ఒక రిజిస్టర్‌లో పొందుపర్చి అందుబాటులో ఉంచే వీలు ఇంతదాకా లేదు. రాష్ట్ర ప్రభుత్వాల వద్ద వివరాలున్నా ప్రతి కుటుంబ సభ్యునికీ ఎలాంటి నెంబర్‌నూ కేటాయించ లేదు.

రేషన్ కార్డు, కిసాన్‌కార్డు, ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డు, సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం కార్డ్, ఆదాయపన్ను పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ కార్డ్, వాహన రిజిస్ట్రేషన్ కార్డ్ - ఇలా ఎన్నో కార్డులు ఒకే వ్యక్తికి జారీ చేయాల్సివస్తోంది. దీవల్ల ఒకే వ్యక్తి ఒక్కోకార్డు జారీకి ఒక్కో రకం సమాచారం ఇచ్చినా ఆశ్చర్యంలేదు. ఇలా చాలా సార్లు జరుగుతోంది కూడా ! ఏ రెండు కార్డుల్లోనూ ఒక వ్యక్తి గురించిన ఒకే రకమైన సమాచారం ఉండటం లేదు.

వీటిని జారీ చేయడం ఒక ఎత్తు. సమాచారం ఎప్పటికప్పుడు తాజాగా ఉంచడం మరో ఎత్తు. లేదంటే కార్డులు దుర్వినియోగమయ్యే అవకాశాలు మెండు. "ఒక పౌరుడు - ఒక కార్డు" - ఇది మనకే ఆదర్శదాయకం,

అభిలషణీయం కూడా! 2003 సంవత్సరంలోనే ప్రభుత్వం ప్రతి పౌరునికీ ఒక గుర్తింపు సంఖ్యను 'సోషల్ సెక్యూరిటీ నెంబర్ ' (ఎస్.ఎస్.ఐ.డి.) అనే పేరుతో జారీ చేయాలనే ప్రతిపాదనలు చేసినా, ఎన్నో కారణాల వల్ల అది కార్యరూపం దాల్చనే లేదు. తిరిగి ఇప్పుడు ప్రభుత్వం తాజాగా యునిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్ (యుఐడి నెంబర్) అనే పేరుతో కార్య రూపంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. దీని కోసం ప్లానింగ్ కమీషన్‌లో భాగంగా "యునిక్ ఐడి అథారిటీ ఆఫ్ ఇండియా"ను ఆరంభించింది. దీనికి సారధ్యం వహించడానికి అటు ప్రభుత్వ పనితీరూ, ఇటు ప్రైవేటు పనితీరూ బాగా తెలిసి, అందులో అనుభవముండి, అంతర్జాతీయంగా పేరు పొందిన శ్రీ నందన్ నీలేకని అనే (ఇన్‌ఫోసిస్ సంస్థ మాజీ సి.ఇ.ఓ.) అనే అనుభవజ్ఞుని నియమించింది ప్రభుత్వం. శ్రీ నందన్ ఎం. నీలేకని సారధ్యంలో రాబోయే 12-18 నెలల కాలంలో తొలి జాబితా యుఐడి విడుదల చేయాలనేది ప్రభుత్వం ధృఢ సంకల్పం.

ఈ సందర్భంలో అమెరికా, యు.కె. దేశాల్లో జరిగిన సంగతులు కొంత చెప్పుకోవాలి. 1936 ప్రాంతాల్లో అమెరికాలో ఉద్యోగుల గుర్తింపు కోసం ఎకౌంట్ నెంబర్లను జారీ చేసింది. 8 నెలల్లో దాదాపు 30 మిలియన్ల మందికి గుర్తింపు నెంబర్లివ్వడానికి అక్కడి ప్రభుత్వం పెద్ద కసరత్తునే చేయాల్సి వచ్చింది. యు.కె.లో మొదటి నుంచీ 'పాస్ పోర్ట్' అనేది అమలులో ఉన్నా, ఒకటవ ప్రపంచ యుద్ధ సమయంలో ఐ.డి. కార్డులను జారీ చేసింది. ఆ తర్వాత విరమించుకొంది. 1995లో, 1997లో మళ్ళీ ప్రతి పాదనలు చేసినా ప్రతి పక్షాల తీవ్ర ఆక్షేపణల మధ్య ఆ కార్డులు ప్రస్తావనకే పరిమితమయ్యాయి. 2002 లో ఈ "నేషనల్ ఐ.డి." గురించిన ప్రతిపాదనలు మళ్ళీ ప్రజల మధ్య కొచ్చాయి. ప్రజలు సానుకూలంగా స్పందించారు కూడా. 2003లో బ్రిటిష్ ప్రభుత్వం ఈ "నేషనల్ ఐడెంటిటీ కార్డ్"ను నేషనల్ ఐడెంటిటీ రిజిష్టర్‌తో అనుసంధానం చేసి జారీ చేయనున్నట్టు ప్రకటించింది. 2003లో రాణి సైతం ఈ కార్డుల గురించి స్పష్టమైన ప్రస్తావన చేయడంతో, ఆమె ప్రసంగం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొంది. తిరిగి 2004లో సైతం దాన్ని ప్రస్తావించడం, అక్కడి హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రవేశపెట్టి, మెజారిటీ పార్లమెంట్ సభ్యుల ఆమోదాన్ని పొందినా, ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత మాత్రం తగ్గలేదు. 2006లో ఐడెంటిటీ కార్డ్స్ యాక్ట్ - 2006 పేరున చట్టం చేసారు కూడా. దాని అమలుకు సైతం పలు దశలను కూడా నిర్దేశించారు. ఈ ఐడెంటిటీ కార్డ్ లేదా పాస్‌పోర్ట్ డిజైన్, దాని ఉత్పత్తి చేయడం, జాతీయ బయోమెట్రిక్ గుర్తింపు విధానం - వీటన్నింటినీ మేళవించి, నేషనల్ ఐడెంటిటీ రిజిష్టర్‌కు అనుసంధించి, తాజా మార్పులు చేసే వీలునేర్పించడం - ఇదీ ఆలోచన. దీనిలో దాదాపు 50 రకాల పౌర సమాచారం ఉంచవచ్చు. పది వేళ్ళ ముద్రలూ, ముఖ చిత్రమూ, కను పాపలనూ చిత్రీకరించడంతో ఆయా వ్యక్తుల పూర్వనివాసం, ప్రస్తుత నివాసం, ఎంత కాలంపాటు నివాసమున్నారు అనే వివరాలను ప్రభుత్వ డేటా బేస్‌లతో అనుసంధానం చేసి అందుబాటులోకి తేవచ్చనీ ఆ చట్టం చెబుతోంది.

పౌరులు తమ పాస్‌పోర్టును రెన్యువల్ చేసినా లేక కొత్తగా పాస్‌పోర్ట్ తీసుకుంటున్నా వారు విధిగా నేషనల్ ఐడెంటిటీ రిజిష్టర్‌లో నమోదవ్వాల్సి ఉంటుంది. యు.కె. పాస్ పోర్ట్ సేవలు కొత్తగా ఐడెంటిటీ అండ్ పాస్ పోర్ట్ సర్వీస్ పేరుతో వ్యవహరింపబడుతాయనీ ఆ యాక్ట్ పేర్కొంది. ఇది 2009లో ఆరంభం కావాల్సింది. కానీ, ప్రస్తుతం ఉన్న పాస్ పోర్ట్ సేవలను

**మన దేశంలో రేషన్‌కార్డు, ఓటరు కార్డు మాత్రమే ప్రస్తుతం గుర్తింపుగా వాడుతున్నారు. వివిధ సేవల్లో వాడకంతో బాటు, గుర్తింపునిచ్చే విధంగా యు.ఐ.డి. కార్డుగా, స్మార్ట్ కార్డ్‌ను జారీ చేసే యోచనలో ఉంది ప్రభుత్వం**

పటిష్టం చేస్తే చాలనీ, కొత్తగా ఇంత పెద్ద ఎత్తున కసరత్తు చేయాల్సిన అవసరం లేదు పొమ్మంటూ యు.కె. హోం సెక్రటరీ డేవిడ్ బ్లంకెట్ అభిప్రాయం. 2009 ఏప్రిల్ 27 లో జరిగిన ఇన్‌ఫో సెక్యూరిటీ యూరప్‌లో మాట్లాడుతూ, "నేషనల్ రిజిష్టర్ అవసరం లేదు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ మరింత పటిష్టంగా చేస్తే చాలు". అని పేర్కొన్నారు. దాంతో కథ కంచికి చేరిందన్నమాట!.

ఇక అమెరికా సంగతికొస్తే, శాశ్వత వాసం కావాలంటే అక్కడ గ్రీన్ కార్డ్ తప్పసరిగా ఉండాలి. కొన్ని నియమ బంధనలకు లోబడి ఉండాలని అ గ్రీన్ కార్డ్ జారీలో పేర్కొనబడుతుంది. ఎవరైనా సరే నియమ నిబంధనలను ఉల్లంఘించినట్లు రుజువైతే వారి గ్రీన్ కార్డ్ రద్దవుతుంది కూడా! ఈ గ్రీన్ కార్డులను బ్యూరో ఆఫ్ సిటిజెన్‌షిప్ & ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (బి.సి.ఐ.యస్) జారీ చేస్తోంది. దీని పేరు ఇప్పుడు యు.ఎస్. సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుయస్‌సిఐయస్).

అమెరికన్ గ్రీన్ కార్డ్‌ను చూస్తే, ఫోటో, పేరు, సంతకం, వేలిముద్రలతో బాటు కింద భాగాన 3 లైన్లుంటాయి. ఇందులో 1వ లైన్‌లో యు.యస్. లేదా కెనడా / మెక్సికో వాసి అని సూచించేలా సి1 లేదా సి2 అ ఉంటుంది. తర్వాత 3 అక్షరాలు యు.యస్.ఎ. అని జారీ చేసిన దేశం పేర్కొంటుంది. దీని తర్వాత 9 డిజిట్ నెంబర్, దాని తర్వాత ఒక చెక్ డిజిట్ ఉంటుంది. ఆతరువాత ఇమ్మిగ్రేషన్ కేస్ నెంబర్ ఉంటుంది. '<' గుర్తు ఖాళీని సూచిస్తుంది.

ఇక రెండవ లైనులో మొదటి 6 కాలమ్స్ yy/mm/dd ఫార్మేట్‌లో పుట్టిన తేది, 7వ కాలమ్ చెక్ టిజిట్, 8వ కాలమ్ జెండర్, 9-14 కాలమ్స్ కార్డ్ ఎక్స్‌పైరీ తేదీ, 15 వ కాలమ్ చెక్ డిజిట్, 16-29 కాలమ్స్ పుట్టిన దేశం, 30వ కాలమ్‌లో చెక్ డిజిట్ ఉంటాయి.

మూడోలైనులో చివరి పేరు, మొదటిపేరు, మధ్య పేరు, తండ్రి ఇంటి పేరు, తల్లి ఇంటి పేరు వివరాలుంటాయి. < < గుర్తులు ఆయా ఫీల్డులను వేరు చేస్తుంటాయి.

ఈ కార్డునే అన్ని చోట్ల పలు విధాలుగా అవసరమైనప్పుడల్లా వాడుతుంటారక్కడ.

ఇక మన దేశానికి వస్తే రేషన్‌కార్డు, ఓటరు కార్డు మాత్రమే ప్రస్తుతం గుర్తింపుగా వాడుతున్నారు. వివిధ సేవల్లో వాడకంతో బాటు, గుర్తింపునిచ్చే విధంగా యు.ఐ.డి. కార్డుగా, స్మార్ట్ కార్డ్‌ను జారీ చేసే యోచనలో ఉంది ప్రభుత్వం. అన్నింటికీ ఒకే విధంగా పనికొచ్చే సోషల్ సెక్యూరిటీ నెంబర్ (యస్‌యస్ఐడి) అనే దాన్ని యునిక్.ఐ.డి. అనే పేరుతో అమలు చేయనుంది మన ప్రభుత్వం. ప్రతి పౌరుకీ తప్పనిసరిగా ఒక గుర్తింపు సంఖ్య ఉంటుంది గనుక, బోగస్ కార్డులను నివారించవచ్చు. పౌరుల్లో అసలు ఎవరు, నకలు ఎవరు అనేది గుర్తించవచ్చు. దేశీయులెవరో, విదేశీయులెవరో ఇట్టే తెలిసిపోతుంది. అంతే గాక నిధుల దుర్వియోగాలను అరికట్టవచ్చు.

ప్రజా పథకాల అమలును మెరుగుపరచవచ్చు. వ్యక్తిగత సెక్యూరిటీ, హెల్త్‌కార్డు, టాక్స్ కార్డ్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు – ఇన్నింటి బదులు ఒకే యు.ఐ.డి. కార్డునే వాడవచ్చు.

2008లో నవంబర్ నెలలో 'ఒక కార్డు – పలు లాభాలు' అనే పేరున అప్పటి ' ఎంపవర్డ్ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్' పేరుతో కొందరు మంత్రుల బృందం ఈ యు.ఐ.డి. ప్రాజెక్ట్ ద్వారా పౌరులందరికీ గుర్తింపు కార్డుల నిర్వహణ వల్ల ఏం లాభాలో ఏకరువు పెడుతూ ఒక ప్రణాళికను రూపొందించింది. ప్లానింగ్ కమీషన్ ఆధ్వర్యాన యు.ఐ.డి. అథారిటీ ఏర్పాటైంది. 'కేంద్రీయ ప్రధాన డేటాబేస్ ' ను రూపొందించి నిర్వహిస్తుంది. ప్రతి పౌరునికీ ఒక యు.ఐ.డి. కేటాయించడం ఈ అథారిటీ పని. దానిని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు వాడుకొంటాయి. మరి దేశ జనాభా మొత్తానికీ డేటాబేస్ రూపొందించి నిర్వహించడం అంటే మాటలు కాదు. పకడ్బందీ రూపకల్పన ఒకటే కాదు, ఎంతో మానవ వనరులను వినియోగించాలి. ఎంతో డబ్బులూ ఖర్చు చేయాల్సి ఉంటుంది కూడా!

ఆదాయ పన్నుల శాఖ గత 20 ఏళ్ళ క్రితమే ఆదాయపు పన్ను కట్టేవారంతా విధిగా పాన్ నెంబర్ (లేదా పర్మనెంట్ అకౌంట్ నెంబర్) అనేదాన్ని పొందాలనే నిబంధన విధించింది. ఈ పాన్ కార్డుల జారీ కూడా ఎలక్టోరల్ కార్డుల జారీలో కలిగిన ఇబ్బందులను సృష్టించింది. అయినా పాన్ కార్డులు జారీ అవుతూనే ఉన్నాయి. యు.ఐ.డి. కార్డు వస్తే, దీన్నీ దానితో అనుసంధించగల్గాలి. అప్పుడే అన్ని రకాల ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

**'ఐ.టి.' రంగంలో ఆంధ్రప్రదేశ్ మిగిలిన రాష్ట్రాలకన్నా ఎప్పుడూ ముందే ఉంటుంది. అలాంటిది, దాదాపు పదేళ్ళ క్రితమే యం.పి.హెచ్.యస్.- మల్టీ పర్పస్ హౌస్ హోల్డ్ సర్వే అనే దానికి శ్రీకారం చుట్టింది. ప్రతి పౌరుడికీ ఒక సోషల్ సెక్యూరిటీ నెంబర్ ఇచ్చి ప్రభుత్వ పథకాల అమలును పటిష్టం చేయవచ్చనేదే దాని వెనుక ఆలోచన.**

మన దేశంలో యు.ఐ.డి. ప్రాజెక్టు తొలి ప్రయత్నమేమీ కాదు. 2003లో కేంద్ర ప్రభుత్వం 'నిషాన్' ఏర్పాటుకై ప్రతిపాదనలు పిల్చింది. 2003 ఫిబ్రవరి నెలలో టాటా కన్సెల్టెన్సీ సంస్థ 'జాతీయ గుర్తింపు కార్డు' ప్రాజెక్టు ప్రతిపాదనల్లో బిడ్డింగ్ చేసింది. అన్ని రాష్ట్రాలకూ ఈ ప్రాజెక్టు వర్తింపజేసేలా రూపొందించిన టిసిఎస్ ప్రణాళిక 'నిషాన్' పేరుతో ప్రతిపాదించడం జరిగింది. నిషాన్ అంటే నేషనల్ ఐడెంటిటీ సెక్యూరిటీ హోమ్ అఫైర్స్ నెట్ వర్క్. దీనికి 10 ఏళ్ళ కాల వ్యవధిలో రూ.1584 కోట్ల వ్యయం అవుతుందని టిసియస్ ప్రతిపాదించింది. ఇది కాకుండా రూ.600 కోట్లు డేటా సేకరణకు అవసరం అవుతుందని ప్రతిపాదన చేసింది. ఇంతలో కేంద్రంలో ప్రభుత్వం మారింది. కారణాలు ఏవైనా నిషాన్ అమలు కాలేదు.

'ఐ.టి.' రంగంలో ఆంధ్రప్రదేశ్ మిగిలిన రాష్ట్రాలకన్నా ఎప్పుడూ ముందే ఉంటుంది. అలాంటిది, దాదాపు పదేళ్ళ క్రితమే యం.పి.హెచ్.యస్.– మల్టీ పర్పస్ హౌస్ హోల్డ్ సర్వే అనే దానికి శ్రీకారం చుట్టింది. ప్రతి పౌరుడికీ ఒక సోషల్ సెక్యూరిటీ నెంబర్ ఇచ్చి ప్రభుత్వ పథకాల అమలును పటిష్టం చేయవచ్చనేదే దాని వెనుక ఆలోచన. మొత్తం 1125 మండలాలల్లో జనాభా నుంచి డేటా సేకరించి 76.5 మిలియన్ రికార్డుల పరిమాణంలో ఒక డేటా బేస్ తయారైంది. ప్రతి రికార్డులోనూ సాంఘిక, ఆర్థిక వివరాలతో పౌర సమాచారం ఉండటం వల్ల దీన్ని ఉపయోగించి బర్త్ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పథకం, లోకల్ సర్టిఫికేట్ వంటివి జారీ చేయడం నిజానికి సులభం. ఐతే ఈ డేటాలో డూప్లికేట్ రికార్డులుండటం, డేటా బేస్ సైజు అనూహ్యంగా పెద్దదై పోవడం వల్ల, కంప్యూటర్ వనరులూ సహకరించలేనంత క్లిష్టమైపోయింది. అందువల్ల ఈ ప్రాజెక్టు ఇంక ఏ స్థితిలో ఉందో అర్థమయ్యే ఉంటుంది.

అమెరికా గ్రీన్ కార్డ్‌లో 9 అంకెలు ఉండే సంఖ్య ఐడెంటిఫికేషనిస్తే, ఈ యస్.యస్.ఐ.డి.లో 16 డిజిట్స్ ఉండేలా ప్రతిపాదన చేశారు. దీనిలో తొలి రెండు అంకెలు జిల్లాను, తర్వాతి రెండు అంకెలు మండలాలను, తర్వాతి రెండు మున్సిపాలిటీ, తరువాత 3 అంకెలు గ్రామాల (లేదా వార్డు)ను వరసగా సూచిస్తాయి. దీంతో 9 అంకెలు పూర్తి అయ్యాయి, మిగిలిన 7 అంకెల్లో మొదటి 5 అంకెలూ ఆ పౌరుని నివాస (ఇల్లు) స్థలాన్ని సూచిస్తే, మిగిలిన 2 అంకెలూ ఆ ఇంట్లో సంబంధించిన 'వ్యక్తి' గా గుర్తిస్తాయి. ఇవన్నీ 16 కె.బి. మెమరీ ఉండే స్మార్ట్ కార్డ్‌లో ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐ.టి. శాఖ 14.8.2001 నాడు విడుదల చేసిన ఐటి గైడ్ లైన్స్ జి.ఓ.యం.యస్. సంఖ్య 40 ప్రకారం, ఈ 16 అంకెలను 12 అంకెలకు కుదించారు. ఐతే యు.ఐ.డి. మాత్రం తిరిగి 16 అంకెలతోనే రూపొందడం గమనార్హం. హోలోగ్రామ్, పౌర ఫోటో, వేలిముద్రలతో బయోమెట్రిక్ స్మార్ట్ కార్డులను జారీ చేయనుంది ప్రభుత్వం. ఖర్చు ప్రతి కార్డుకీ 30నుంచి 50 రూపాయలదాకా అవుతుంది. ఇవి కాక కేంద్రీయ డేటాబేస్ రూపకల్పన, దాన్ని వివిధ శాఖలతో అనుసంధానం చేయడానికీ చాలా ఖర్చే ఉంటుంది. 2011 నాటికల్లా జాతీయ జనాభా రిజిస్టర్‌ను నెలకొల్పి ప్రచురించాలన్నదే ఆశయం.

ఇంతకీ కార్డులను ఎలా జారీ చేస్తారు? ఎవరు చేస్తారు? అనే విషయాలపై స్పష్టమైన ప్రకటన వెలువడలేదు.

యు.ఐ.డి అథారిటీ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేసేందుకన్నాముందే, 13 రాష్ట్రాల్లో 13 జిల్లాలను వాటిలో 20 జిల్లాలను ఎంపిక చేసి, ఆ ప్రాంత ప్రజలకు నేషనల్ ఐ.డి. కార్డును మల్టీ పర్పస్ నేషనల్ ఐడెంటిటీ కార్డు అనే పేరుతో జారీ చేసే పైలట్ ప్రాజెక్టు ఒకటి 2008లో ప్రారంభం అయ్యింది. కోస్తా తీర ప్రాంతాల రాష్ట్రాలకు ఇది బాగా వినియోగిస్తుందని ఆశించారు కూడా! ఈ ప్రక్రియ కోసం 115 మంది సిబ్బందితో ప్లానింగ్ కమీషన్‌తో ఒక కోర్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, గోవా, తమిళనాడు, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కేరళ, గుజరాత్‌లతో కలిపి 8 రాష్ట్రాల్లోనూ, కేంద్రపాలిత ప్రాంతాలైన దాద్రానగర్ హవేలీ, పాండిచ్చేరి, లక్షద్వీప్, అండమాన్, నికోబార్‌లతోనూ ఈ ఐ.డి. కార్డులను జారీ చేయాలని ఆరంభంలో ఆశించారు. తమిళనాడులో రామనాథపురం జిల్లా తిరువాడనై తాలూకాలోనూ, ఆంధ్రప్రదేశ్‌లో మెదక్ జిల్లాలో నర్సపూర్, హద్నూర్, కౌదిపల్లి, విరాంపేట్, జిన్నారం అనే 5 మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టను ప్రారంభించారు.

ఇదే కోర్ టీం నేడు రూపు మార్చుకొని శ్రీనందన్ నీలేకని అధ్యక్షతన యు.ఐ.ఎ.ఐ. గా నేడు అవతరించింది.

ఆగష్టు12, 2009 ఈ యు.ఐ.ఎ.ఐ. తొలి సమావేశం జరిగింది.

ఇందులో ప్రధాన మంత్రి అధ్యక్షతన పలు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ''యు.ఐ.ఎ.ఐ. అనేది యు.ఐ.డి. కార్డులకు ప్రమాణాలను రూపొందిస్తుందనీ, విధి విధానాలను స్పష్టంచేస్తుందనీ ప్రధానమంత్రి స్పష్టంచేస్తూ, వివిధ జాతీయ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల్లో దీన్ని వాడటం తప్పనిసరి చేస్తామని కూడా ఆయన చెప్పారు. "తొలి దశలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ( ఎన్.ఆర్.ఇ.జి.ఎ.) కింద ఆరోగ్య భీమా, పి.డి.యస్.లలో దీన్ని తప్పసరి చేయడం వల్ల అధిక సంఖ్యలో ప్రజలు నమోదౌతారు. ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడానికి సైతం ఇది దోహదం చేస్తుందని" ప్రధాని అనడం గమనార్హం!

జాతీయ యు.ఐ.డి. సంఖ్య అనేది రాండం సంఖ్య. ఒక వరస క్రమంలో లేకున్నా, ఒక గణాంక పద్ధతిననుసరించి విశిష్టంగా రూపొందే సంఖ్యను రాండమ్ సంఖ్య అంటారు. ఒకరికి కేటాయించిన సంఖ్య మారొకరికి రాదన్నమాట. అలాంటి రాండమ్ ప్రక్రియ ద్వారా పౌరులకు విశిష్టమైన గుర్తింపు సంఖ్యలను కేటాయించడం జరుగుతుంది. వీటిని ఆయా రాష్ట్రాల్లో విడిగా కేటాయిస్తే ఒక రాండం సంఖ్య, ఒక రాష్ట్రంలో ఒక పౌరుడికి కేటాయించినప్పుడు విడిగా కేటాయింపు జరిగితే, మరో రాష్ట్రంలో ఇంకో పౌరుడికీ అలాంటి లేదా అదే సంఖ్య గుర్తింపు సంఖ్యగా కేటాయించడం జరిగి గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్లే ఈ సోషల్ సెక్యూరిటీ గుర్తింపు సంఖ్య లేదా యు.ఐ.డి. అనేది రాండమ్ పద్ధతులలో జాతీయ స్థాయిలో కేంద్రీకృతమైన శాఖ ఆధ్వర్యంలో జరగాలి. అలా జరిగితేనే దేశంలో "ఒక పౌరుడికి ఒక గుర్తింపు సంఖ్య" అనేది సాధ్యమౌతుంది. ఈ యు.ఐ.డి. స్మార్ట్ కార్డ్‌లో పేరు, పుట్టిన తేదీ, తల్లిదండుల పేర్లు, చిరునామా, వేలిముద్ర ఉంటాయి. ఆదాయ స్థాయి, విద్య వంటి వివరాలను ఉంచవచ్చు. ఇది బర్త్ సర్టిఫికెట్లను జారీ చేసే సమయంలోనే ఇచ్చేలా చూస్తారు. ఐ.యస్.ఓ./ఐ.ఇ.సి. 7816 ప్రమాణాలతో రూపొందుతుంది. 18 ఏళ్ళ ప్రాయం రాగానే పౌర యు.ఐ.డి. కార్డు ఓటర్ కార్డ్‌గా ఆటోమెటిగ్గా యాక్టివేట్ అవుతుంది. ఇదీ యు.ఐ.ఎ.ఐ. కన్నా ముందు ఏర్పడిన ప్రణాళిక. మరి యు.ఐ.ఎ. వచ్చాక ఎలా రూపాంతరం చెందుతుందో తెలీదు.

ఈ నేపథ్యంలో పెట్రోలియయం శాఖ, పుణె, హైదరాబాద్, బెంగళూరు నగరాలతో బాటు కొన్ని గ్రామాల్లో ఎల్.పి.జి. కిరోసిన్ వాడకందారులకు స్మార్ట్ కార్డులను జారీ చేసే యోచనలో ఉన్నట్టు ప్రకటించడం గమనార్హం దీన్ని జారీ చేశాక ఆ డేటాబేస్‌ను యు.ఐ.ఏ.ఐ. తో పంచుకొంటామని మంత్రి చెప్పారు. ఐతే ఏకంగా దీన్నే యు.ఐ.డి. గా ఎందుకు రూపొందించకూడదు? అనేది కూడా ఆలోచించాలి.

యు.ఐ.డి. కార్డులను జారీ చేయడానికి యు.ఐ.ఎ.ఐ. ముఖ్యంగా జనాభా లెక్కలు, ఎలక్షన్ కమీషన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, మున్సిపాలిటీ, రవాణాశాఖ, ఆదాయపు పన్ను శాఖలు పూర్తిగా సమన్వయంతో ఈ యు.ఐ.డి.ల రూపకల్పన ప్రక్రియను చేపట్టితే, ఇలా ఎవరికి వారు స్మార్ట్ కార్డులను జారీ చేయాల్సిన బెడద తప్పుతుంది. ఇవన్నీ పట్టించుకోకుండా, ఇప్పటికే పలు ఐటి సంస్థలు ఎలా సొమ్ము చేసుకోవాలా అని చూస్తున్నాయి. అలక్ష్యం చేస్తే పెద్ద ఎత్తు ధనం దుర్వియోగం కావచ్చు. ఈ ప్రమాదాలను కూడా యు.ఐ.ఎ.ఐ. దృష్టిలో ఉంచుకోవాలి.

మామూలు గుర్తింపు కార్డు జారీ చేయడమా? స్మార్ట్ కార్డ్ జారీ చేయడమా అనే విషయానికొస్తే, మామూలు గుర్తింపు కార్డులో కేవలం ముద్రించిన సమాచారం మాత్రమే ఉంటుంది. దానిలో ఎలాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమం ఉండదు. కాబట్టి 5 నుంచి 10 రూపాయల్లో దీన్ని రూపొందించి జారీ చేయవచ్చు. ఐతే ఇ గవర్నెన్స్ ప్రాజక్టులలో వీటిని పొందటం వల్ల ఒనగూరే ప్రయోజనం దాదాపు ఏమీ ఉండదనే చెప్పాలి. స్మార్ట్ కార్డు అనేది ఒక ఎలక్ట్రానిక్ చిప్ ఆధారితంగా రూపొంది, కనిపించే సమాచారం, చిప్‌లో నిక్షిప్తమైన సమాచారం రెండిటినీ కలిగి ఉంటుంది. అన్ని రకాల ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టులలోనూ వాడుకోవచ్చు. దీని ఖరీదు 30 నుంచి 60 రూపాయల దాకా ఉంటుంది. ఐతే ఈ స్మార్ట్ కార్డ్‌లను చదవాలంటే కంప్యూటర్, స్మార్ట్‌కార్డ్ రీడర్ – ఇలా అదనపు సామాగ్రి సమకూర్చుకోవాలి. మౌలిక వనరులను నెలకొల్పడానికెంతో ఖర్చవుతుంది. ఐతే మామూలు కార్డును నకిలీ చేయడం సులభం. అదే స్మార్ట్ కార్డు నకిలీ చేయడం అసాధ్యం కాకపోయినా చాలా ఖరీదైన పని.

అలాగే ప్రతి పౌరుడు తన సమాచారం ఎప్పటికప్పుడు మార్పు చేర్పులతో సవరించుకునేలా నిబంధనలు రూపొందాలి. ఎలాంటి యు.ఐ.డి. జారీ కాని పౌరుడికి ఎలాంటి సేవలు లభించవు అనే నిబంధన రావాలి. అంటే యు.ఐ.డి. నమోదు కాకపోతే అతనికికి గుర్తింపుండదు. తప్పుడు సమాచారం ఇస్తే భారీ జరిమానా, దుర్వియోగంచేస్తే, దాన్ని గుర్తించి జరిమానా వేయడం జరగాలి. డ్రైవింగ్ లైసెన్స్‌కి కూడా దీన్నే వాడేలా చేసి నేరాలు చేసినప్పుడు గుర్తించి తగిన చర్యలు తీసుకునేలా చూడాలి. అన్నిటికీ మించి యు.ఐ.డి. చట్టబద్ధమైన గుర్తింపు సంఖ్యగా అమలులోకి తేవాలి. కేవలం ప్రభుత్వపరమైన బాధ్యతగా కాకుండా ప్రతి పౌరుడు తన వంతు కర్తవ్యంగా దీనిలో పాలుపంచుకోవాలి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలంటే రాబోయే జనాభా లెక్కలతో దీన్ని ముడిపెట్టాలి. ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టుకింద కేంద్ర, జాతీయ జనాభా రిజిష్టర్ డేటాబేస్‌ను ఏర్పాటుచేసి ప్రతి పౌరుడు తమ సమీప మున్సిపాలిటీ పౌర సరఫరా కేంద్రాలకు వెళ్ళి తమ బర్త్ సర్టిఫికెట్‌లతో పాటు పేర్లు నమోదు చేసుకోవాలి. ఇతర వివరాలతో సహా తప్పులు లేకుండా అందించాలి. వేలి ముద్రలను నమోదు చేయించాలి. బయోమెట్రిక్ కార్డును జారీ చేశాక, వాటిని అప్‌డేట్ చేయాలి. కొత్త కార్డులను జారీ చేయడం వేగవంతం చేయాలి. ప్రతి ఐదేళ్ళకూ కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలి. కార్డు పోయినా ఆ విషయాన్ని నమోదుచేసే ఏర్పాటుండాలి. దీనికి పోలీసు సహాయం తీసుకోవచ్చు. ఇప్పటికే వివిధ శాఖలలో ప్రభుత్వ విభాగాలు కంప్యూటర్లు ఉన్నాయి. అందువల్ల అదనపు ఆర్థిక భారం లేకుండానే ఈ పథకాన్ని అమలు చేయవచ్చు. కావల్సిందల్లా కార్య దక్షత. పని చేయాలన్న జిజ్ఞాస. వీటితోపాటు "అందరూ భారత దేశ పౌరులమే, ఈ కార్డుల జారీ వల్ల తీవ్రవాదాన్ని అరికట్టగలం, ఆగంతకులను గుర్తించగలం" అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

అంతే కాదు ! తాజాగా పౌరులందరికీ యు.ఐ.డి. వచ్చాక వాటి సెల్‌ఫోన్ నెంబర్స్‌గా మార్చి ఇచ్చే అంశాన్ని కూడా టెలికాం రంగ సంస్థ సిడాట్ పరిశీలిస్తోంది. ఇప్పుడును 10 అంకెల సెల్ నెంబర్లన్నీ త్వరలో నిండుకొనే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో యు.ఐ.డి. లను సెల్‌ఫోన్ నెంబర్‌లుగా కేటాయించాలనుకోవడంతో యు.ఐ.డి. మరింత ప్రాధాన్యతను సంతరించుకొంటోంది.

**– డా॥ వి.వి.వి. రమణ**, ఎన్.ఐ.సి. హైదరాబాద్

*జలమునయగ్ని, ఛత్రమున చండమయూఖుని,*
*దండ తాడనంబుల వృషగార్ధబంబులన్*
*శృణింజెలగెడు రోగమౌషధముచే, ఇమ్ముల*
*దగ జక్కజేయనగు మూర్ఖుని మూర్ఖత మాన్పవచ్చునే.*

– *భర్తృహరి సుభాషితం*




**నీటితో నిప్పుని రూపుమాపవచ్చును. గొడుగుతో సూర్యుని ఉష్ణతీవ్రతను తప్పించ వచ్చును. దండంతో కొట్టిగాని, త్రాళ్ళతో బంధించిగానీ ఎద్దులను, గాడిదలవంటి పశువులనదుపులోకి రాబట్టవచ్చును. తగిన ఔషధప్రయోగంతో విషజ్వరాలనైనా మాన్పవచ్చును గానీ, మూర్ఖుని మూర్ఖతను మాన్పడం ఎంతమాత్రం సాధ్యం గాదని దీని తాత్పర్యం.**

నడివయస్సు చేరుకున్న రాఘవయ్య తన భార్య తాయారుతో తీర్థయాత్రకి బయల్దేరుతాడు. ప్రయాణానికి సిద్ధమైనప్పటికీ, అతని ధ్యాస ఇంటి పట్టునే వదిలి వెళ్ళాల్సి వస్తున్న తన తల్లి మీదే వుండగా, తన భార్యకి మాత్రం తన పెంపుడు పిల్లిని వదిలి వెళ్ళాల్సి వస్తోందన్న బాధ ఎక్కువగా వుంటుంది. బయల్దేరి వెళ్ళబోతూ గుమ్మం దగ్గర ఆగిన రాఘవయ్య తమ ఇంటి పాలేరు 'మాలోకం' తో. . .

***రాఘవయ్య :*** ఒరే మాలోకం– మేమిద్దరం తీర్థయాత్రలు ముగించుకొని తిరిగిచ్చేదాకా మన ఇల్లు జాగ్రత్త! ముఖ్యంగా మా తల్లిగారి విషయం. పెద్దావిడగదా– చాలా జాగ్రత్తగా వుండాలి– తెలిసిందా?

***మాలోకం:*** ఆయ్!

*(ఇది విన్న తాయారు వెంటనే తిరగబడుతూ)*

***తాయారు:*** ఓరే మాలోకం – ఆయన తల్లి మాటేమోగానీ, నా పిల్లి విషయం మటుకు చాలా జాగ్రత్తగా చూసుకోవాలి – అర్థమైందా? ఎక్కడన్నా తేడా జరిగిందో –తిరిగొచ్చాక నీ తాట తీస్తా. గుర్తుంచుకో. . .


***మాలోకం:*** ఆయ్ – అలాగేనండమ్మగోరూ. .


***రాఘవయ్య :*** అది సర్లేరా! నేను చెప్పింది బాగా గుర్తుందిగా– అదే మా తల్లి. .

***తాయారు:*** కాదు – నాపిల్లి . . .

***మాలోకం:*** ఆయ్ అలాగేనండి. . !

# తల్లి-పిల్లి






***రాఘవయ్య :*** ఊ – సర్లే (అని భార్యని చూసి) ఇంక బయల్దేరు. . . (అంటూ వీధిన పడి బండెక్కుతారు. అనుకోకుండా ఐదురోజుల తీర్థయాత్ర ఇట్టే గడిచి పోతుంది కానీ, ఇంకో నాలుగైదు పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలు చూసి వెళ్దామనుకుంటున్న వాళ్ళకి చిన్న విరామం దొరుకుతుంది. పొద్దున్నే ఫలహారం కానిచ్చాకా. . .)

***రాఘవయ్య :*** హమ్మయ్య, ఆపైవాడి దయవల్ల ఇన్నాళ్ళకి మనం ఈ తీర్థయాత్రలు చేయగలిగామే తాయారూ! దీంతో ఆనందం పట్టలేక నాకు ఒళ్ళంతా పులకరించి పోతోందనుకో!

***తాయారు:*** చాల్లెండి బడాయి– పెళ్ళయిన ఇన్నేళ్ళకి లక్షసార్లు మొత్తుకున్న ఇన్నాళ్ళకి ఏదో కంటి తుడుపుగా నన్ను లాక్కొచ్చారు. ఇంతోటి దానికి అంత పులకరింపు దేనికీ?

***రాఘవయ్య :*** నువ్వెన్నన్నా చెప్పు! మనం వెళ్ళిన ప్రతి పుణ్యక్షేత్రంలో నాకు ఆ శ్రీమన్నారాయణుడే కళకళలాడుతూ దర్శనమిచ్చాడే, 'నా తల్లిని పదికాలాల పాటు చల్లగా చూసి కాపాడు స్వామీ' అంటూ ఆయనకి పదేపదే మొక్కుకున్నానంటే నమ్ము!

***తాయారు:*** ఆఁ కనబడతాడు కనబడతాడు. అదేమోగానీ, నాకు మాత్రం ఏ గుడికెళ్ళినా, ఏ దేవుణ్ణి చూసినా అక్కడ నా పిల్లి ముండే కనబడ – నా వైపు దిగులుగా చూస్తున్నట్టు అనిపించిందండీ. ఆఖరికి ఇప్పుడు నీ మొహంలో కూడా నాకు నా పిల్లి ముండే ...

***రాఘవయ్య :*** ఛీ నోర్ముయ్. . . (ఇంతలో సెల్ ఫోన్ మోగుతుంది రాఘవయ్య ఫోను అందుకుంటూ) ఎవరూ? మన మాలోకం ఫోన్‌లా వుందే. ఇప్పుడెందుకు చేస్తున్నాడబ్బా. . .

***రాఘవయ్య :*** 'హలో' మాలోకం. . .

***మాలోకం:*** అయ్యగారేనా, నేనూ మాలోకాన్ని.. మీ మాలోకాన్నండీ. . .

***రాఘవయ్య :*** ఆహఁ! సరేలే ! ఎందుకు ఫోన్ చేశావ్!

***మాలోకం:*** అయ్యగారు– మరండీ – విషయం ఏంటంటేనండీ. . . మరండీ!

***రాఘవయ్య :*** ఏవిట్రా గోల? విషయం నాన్చక త్వరగా చెప్పి చావు!

***మాలోకం:*** ఆయ్– మరండీ – అసలేం జరిగిందంటే. . .

***రాఘవయ్య :*** ఆఁ చెప్పు – మా అమ్మగారు కులాసాయేనా?

***మాలోకం:*** ఆయ్! బామ్మగారు కులాసాగానే వున్నారండి. ఐతే మన. . .

(ఇది వింటున్న తాయారుకి ఒళ్ళుమండి)

***తాయారు:*** ఏమిటండీ! ఎంత సేపూ మీ అమ్మగారి గురించే అడుగుతున్నారు – నా పిల్లి విషయం కనుక్కోరేవిటీ?

***రాఘవయ్య :*** మధ్యలో నీ గోలేంటే– ఓ క్షణం ఆగు! ఆఁ! చెప్పురా మాలోకం– విషయం ఏమిటీ!

***మాలోకం:*** విషయం అంటేనండీ – మన అమ్మగారి పిల్లీ. . .

***రాఘవయ్య :*** : ఓ అదా ఆవిడ పిల్లి సంగతా! ఐతే ఓ క్షణం ఆగు.!!! (అని,తన చేతిలోని సెల్ ఫోను భార్యముందు పడేస్తూ) ఇదిగో – నీ పిల్లిగోల మొదలైనట్టుంది. నువ్వే మాట్లాడుకో !

(అనేసి చకచకా బయటి వరండాలోకి వెళ్ళి, అప్పటి వరకు ఐన ఖర్చు లెక్కలు సరిచూసుకుంటుంటాడు. తన ముందు పడేసిన సెల్‌ని అందుకుంటూ తాయారు)

***తాయారు:*** ఏరా మాలోకం – నీకసలు బుద్ధుందా?

***మాలోకం:*** అమ్మగోరూ మరే. . .

***తాయారు:*** ఆఁ! ముందు నా పిల్లి గురించి మాట్లాడకుండా – ఆయన తల్లి గురించి మాట్లాడతావా!

***మాలోకం:*** అమ్మగారు అసలేవయిందంటే. . .

***తాయారు:*** ఏమయిందిరా? ఏవయింది? నా పిల్లి నా గురించి బెంగెట్టుకుందా!

***మాలోకం:*** కాదండీ.

***తాయారు:*** మరైతే ఏం జరిగిందీ? మూడుపూటలా పాలు తాగుతోందా?

***మాలోకం:*** అదికాదండీ. . . .

***తాయారు:*** మరైతే ఏం జరిగిందో చెప్పరా దద్దమ్మా. . .

***మాలోకం:*** మరే. . . మరీ. . . మీ పిల్లీ . . . ఇవాళ పొద్దున్నే. . .

***తాయారు:*** ఆఁ ఇవాళ పొద్దున్న . . . ఏమయిందిరా. ఇవాళ పొద్దున్న ఏవయిందీ?

***మాలోకం:*** చచ్చిపోయిందండీ! ఆఁ. . . .!

(అంటూ ఏడుస్తాడు)

*తాయారు:* ఆఁ – చచ్చిపోయిందా – నా పిల్లిముండ కాస్తా చచ్చిపోయిందా – భగవంతుడా? ఆఁ!!! ఎన్ని ఆశలు పెట్టుకున్నానే నీ మీద ! పిల్లిముండా?

(అంటూండగా చేతిలోంచి సెల్ జారి పక్కమీద పడిపోతుంది. తాయారు పక్కకి ఒరిగిపోతుంది. కట్టలు తెంచుకువచ్చే దుఃఖంతో భర్తను పిలుస్తుంది)

*తాయారు:* ఏవండీ – ఏవండీ. . . ఏవండీ. . .

(బయట వరండాలో లెక్కలు చూసుకుంటున్న రాఘవయ్యకి భార్య పిలుపు ఓ ఆర్తనాదంలా వినబడి, ఒక్క ఉదుటున లోపలికొస్తాడు– వెక్కి వెక్కి ఏడుస్తున్న భార్యను ఓదార్చబోతాడు)

*రాఘవయ్య :* ఏవయిందే తాయారు – దేనికా ఏడుపూ? ఏవయిందంటే మాట్లాడవేమే – అడుగుతోంది నిన్నే. అసలేం జరిగిందీ?

*తాయారు:* ఊఁ అని ఏడుస్తూ (తన ఎడమ చేత్తో పక్కనున్న సెల్‌ని చూపిస్తుంది)

*రాఘవయ్య :* ఆఁ! ఫోనా. . . (వెంటనే ఆ సెల్‌ని అందుకుంటూ రాఘవయ్య మాట్లాడుతాడు)

*రాఘవయ్య :* ఏరా మాలోకం. . .

*మాలోకం:* అయ్యగోరు నేనేనండి!

*రాఘవయ్య :* అది తెలుస్తోనే వుందిలేరా సన్నాసీ– ఇంతకీ అమ్మగారికి ఏమి చెప్పి చచ్చావ్?

*మాలోకం:* అయ్యో ! అమ్మగారికేవైనా అయ్యిందాండీ? (ఏడుస్తాడు)

*రాఘవయ్య :* ఏడిశావ్‌లే – నీ బోడి పరామర్శ నువ్వూనూ! అసలు ముందావిడకి ఏం చెప్పిచచ్చావో సరిగా ఏడు! నీ మాటలు విని ఆవిడ ఎందుకు కళ్ళు తిరిగి పడిపోయిందిరా? ఏ విషయం చెప్పావంటే మాట్లాడవే?

*మాలోకం:* అయ్యగోరూ నేను పెద్దగా ఏమీ చెప్పలేదండీ. అమ్మగారి పెంపుడుపిల్లి సచ్చిపోయిందని చెప్పానండీ అంతే!

*రాఘవయ్య :* ఆఁ! అలా జరిగిందా! సర్లే – ఛస్తే పీడాబోయిందిలే గానీ. . .

(ఇది విన్న తాయారు ఒక్క సారి విరుచుకుపడుతూ. . .)

*తాయారు:* ఆఁ – అలాగంటారా ? (అంటూ పెద్దపెట్టున ఏడుస్తుంది దాంతో నాలిక్కరుచుకున్న రాఘవయ్య. . . బయటికి నడుస్తూ. . .)

*రాఘవయ్య :* ఐనా – అలా ఎందుకు చెప్పావురా!

*మాలోకం:* నిజంగానే చచ్చిపోయింది కదండీ!

*రాఘవయ్య :* చస్తే చచ్చిందిలేకానీ. . . అలాంటి చావుకబురు ఒక్కసారిగా చెప్పకూడదని నీకు తెలిదేవిట్రా చచ్చుబుర్రా?

*మాలోకం:* అలాగాండీ? నిజంగా నాకు తెలీదండయ్యగోరూ– మరైతే ఇంకెలా చెప్పాలండీ?

*రాఘవయ్య :* ఏడ్చినట్టుంది! ఇప్పుడు నీకు చావు కబురు ఎలా చెప్పాలో ఇక్కణ్ణుంచి నన్ను నేర్పమన్నావా? ఖర్మ ఖర్మ. . .

*మాలోకం:* ఆయ్!

*రాఘవయ్య :* సరే ఏడు. . . ఇలాంటి చావు కబురు ఒక్క సారిగా చెప్పకూడదురా సన్నాసీ! నేను చెప్పేది జాగ్రత్తగా విను!

*మాలోకం:* ఆయ్ ! ఇంకెలా చెప్పాలండీ!

*రాఘవయ్య :* అదే చెప్తున్నాగా విని చావు. . .

*మాలోకం:* ఆయ్!

*రాఘవయ్య :* చావు కబుర్నీ – అంటే ఉదాహరణకి ఈ పిల్లి చావు కబుర్నే చెప్పాలంటే ముందు క్షేమ సమాచారాలు కనుక్కొని అవీ ఇవీ కాస్త మాట్లాడి అప్పుడు. . . మీ పిల్లి గోడ ఎక్కిందండీ! అనాలి!

*మాలోకం:* ఆయ్!

*రాఘవయ్య :* ఆ తర్వాత పిల్లి అటకమీదికి పాకిందండీ! అని చెప్పాలి!

*మాలోకం:* ఆయ్– ఆ తర్వాతండీ!

*రాఘవయ్య :* వెధవా– మధ్యలో అడ్డుపుల్లలు వెయ్యక చెప్పేది శ్రద్ధగా విను!


*మాలోకం:* ఆయ్ – అలాగేనండీ!

*రాఘవయ్య :* తర్వాత, అది ఆ అటక మీంచి కిందికి దూకబోతూ, పిల్లి కాలు విరక్కొట్టుకుని చచ్చిపోయిందండీ! అని నిదానంగా చెప్పాలి. అంతేగానీ ఒకేసారి గబగబా చెప్పెయ్యకూడదు! అర్థమైందా?

*మాలోకం:* ఆయ్!

*రాఘవయ్య :* ఆయ్–వూయ్ గాదు – నేను చెప్పిందంతా సరిగా అర్థమైందా – అనడుగుతున్నాను!

*మాలోకం:* అర్థమైందండీ! పైకి ఎక్కడం–



పాకడం- దూకడం-చావడం-అంతేగదండీ - బాగా అర్ధమైందండి!

***రాఘవయ్య :*** ఆ- అదీ! ఈ విషయం బాగా గుర్తుంచుకో

***మాలోకం:*** ఆయ్- అలాగేనండీ! ఇంకెప్పుడూ ఇలాగే చెప్తానండీ! ఆయ్

***రాఘవయ్య :*** సర్లే - విన్నది చాలు గానీ- ఫోనుపెట్టెయ్!

(మాలోకం ఫోన్ పెట్టేస్తాడు- రాఘవయ్య తనలో)

***రాఘవయ్య :*** ఆం! హమ్మయ్య! ఇప్పటికో పనయింది. ఈ చిన్న విషయం చెప్పడానికి వాడికి ఎంత క్లాసు పీకాల్సొచ్చింది! ఐతే అయ్యిందిగానీ. . వెధవ మొత్తానికి పాయింటు అర్ధం చేసుకున్నాడు! ఐనా - చివర్లో అలా అన్నాడేవిటే- ఆం - ఏదోఓటి అన్నాడులే - వాడి నోటికి అర్ధమేవుందీ.

(ఆ తర్వాత తాయారు తన పిల్లి పోయిన దిగుల్తో నిద్రాహారాలు మాని ఓ మూడు రోజులు అలానే పక్కదిగకుండా రోదిస్తూ వుంటుంది. దాంతో రాఘవయ్య ఓదార్చబోతూ భార్యదగ్గరికొస్తాడు)

***రాఘవయ్య :*** చూడు తాయారూ! ఇంక నీ ఏడుపు ఆపు! అది చచ్చి మూడురోజులు దాటింది కదా. ఇంకా ఎందుకా దుఃఖం! ఐనా ఓ పెంపుడు పిల్లి కోసం ఇంత దిగులెందుకు? ఆ పిల్లి కాకపోతే -ఇంకో పిల్లిని తెచ్చి పెంచుకుందువు గానీ . . . కాస్త నీ ఏడుపు ఆపు!

***తాయారు:*** ఆం- ఏవన్నారూ మళ్ళీ అనండి.

***రాఘవయ్య :*** నేనేవన్నానూ - ఆ పిల్లి కాకపోతే ఇంకో పిల్లిని తెచ్చి పెంచుకోవచ్చు గదా అన్నానంతే.

***తాయారు:*** అంటారంటారు! నా పిల్లి విషయంలో మీకెప్పుడూ చులకన భావమే. మీ తల్లి విషయంలో అలా అంటే మీకెలా వుంటుందో చెప్పండి!

***రాఘవయ్య :*** ఛీ నోర్ముయ్ - బుద్ధి లేనిదానా!

(ఇంతలో మళ్ళీ సెల్ మోగుతుంది రాఘవయ్య దాన్ని అందుకుంటూ)

***రాఘవయ్య :*** ఆం- మళ్ళీ మాలోకంగాడి ఫోన్! దేనికయ్యుంటుందీ. ఆం చెప్పరా మాలోకం!

***మాలోకం:*** అయ్యగారూబ- నేను మాలోకాన్ని. . .

***రాఘవయ్య :*** అర్ధమయిందిలేరా జిడ్డు సన్నాసీ. ఎందుకు ఫోన్ చేశావో చెప్పు?

***మాలోకం:*** అయ్యగోరూ మీరు కులాసాయేనా? ఇంటికెప్పుడొస్తున్నారు?

***రాఘవయ్య :*** మా కులాసాకేంలే గానీ ఎందుకు ఫోన్ చేశావో చెప్పి చావు! ఇంకా ఈ చుట్టు పక్కల మేము చూడాల్సిన పుణ్యక్షేత్రాలు ఇంకో రెండు మూడున్నాయి అవి చూసుకుని తిరిగొస్తాం గానీ విషయం చెప్పు!

***మాలోకం:*** అదేంటండీ - మీరేగా గబగబా చెప్పకూడదన్నారు.

***రాఘవయ్య :*** ఆం! అంటే నువ్వు ఏం చెప్పబోతున్నావురా?


***మాలోకం:*** ఏంటంటేనండీ- అసలు - మన బామ్మగారూ-

***రాఘవయ్య :*** వెధవా మన బామ్మగారేవిటీ?

***మాలోకం:*** అదేనండి - మీ తల్లిగారూ - ముందు గోడెక్కారండీ!

***రాఘవయ్య :*** ఆం - మా తల్లిగారూ - ముందు గోడెక్కటవేవిట్రా?

***మాలోకం:*** ఆయ్ ! ఆ తర్వాత . . . ఆ . . . ఆ. . . తర్వాత్ అదే - అటకే గదండీ! అదెక్కారండీ! . . ఆయ్




***రాఘవయ్య :*** ఛీ! దౌర్భాగ్యుడా ఫోన్ పెట్టేయ్!

***మాలోకం:*** ఆ అదేవిటీ చెప్పమన్నట్టే చెప్తున్నా తిడుతున్నారెందుకూ. ..?

(ఇవి విన్న తాయారు భర్తను చూసి అడుగుతుంది)

***తాయారు:*** ఏమంటున్నాడండీ! దేనికంత చికాగ్గావున్నారు ఏ వంటున్నాడూ?

***రాఘవయ్య :*** ఏమంటున్నాడా - మా అమ్మ అటకెక్కిందీ - అంటున్నాడే . . . (అని ఏడుపు మోహం పెడతాడు)

***తాయారు:*** అటకెక్కిందా - (అని మెటికలు విరుస్తూ ఆనందంగా తనలో. . .) హమ్మయ్యపీడా విరిగింది. . .!

*"తివిరి ఇసుమున తైలంబుతీయవచ్చు*
*దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు*
*తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు*
*జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు"*

*- భర్తృహరి సుభాషితం*

*( హాస్య ప్రహసనాన్ని యథాతథంగా చిత్రీకరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానెల్ ప్రతి సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రసారం చేస్తున్న 'హాస వికాసం' కార్యక్రమంలో దీన్ని హాస్య ప్రియులు చూసి ఆనందించవచ్చు)*

*- శంకు, దర్శకుడు-రచయిత)*

☆

# ఫ్యూచర్స్ మార్కెట్ ద్వారా రైతులకు మేలు

**రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టాలని భావిస్తున్న సహకార వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను ఫ్యూచర్స్ మార్కెట్ ద్వారా ట్రేడింగ్ జరిపితే రైతులకు గిట్టుబాటు ధరలు వస్తాయని నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్ ఎక్సేంజ్ (ఎన్‌సీడీఎక్స్) మేనేజింగ్ డైరెక్టర్, సి.ఈ.వో. శ్రీ ఆర్.రామశేషన్ అన్నారు.**

**దీని ద్వారా వ్యవసాయోత్పత్తులపై రైతులకు ఆదాయం బాగా పెరుగుతుందని ఆయన చెప్పారు. తమ ఎక్సేంజ్ ట్రేడింగ్ కార్యకలాపాలు, ఇతర అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. ముఖ్యాంశాలు. . . .**

**ప్ర: రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగంలో వ్యవసాయ క్షేత్రాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీని వల్ల రైతులకు మంచి గిట్టుబాటు ధర వచ్చేలా నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లాంటి సంస్థలు ఏ మేరకు ఉపయోగపడతాయి?**

**జ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం చక్కటి ఏర్పాటు చేస్తోంది. మన దేశంలో రైతుకు బేరమాడే శక్తి చాలా తక్కువ. ఇలా సహకార వ్యవసాయ క్షేత్రాల్లో పండించిన తమ ఉత్పత్తులను రైతులు విక్రయించాలనుకుంటే ఫ్యూచర్స్ మార్కెట్ వారికి చక్కటి వేదిక కాగలదు. సహకార సంఘం రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వారికి మంచి రేటు ఇవ్వగలదు. దీనివల్ల రైతుకు అధిక రాబడి వచ్చే అవకాశం ఉంది.

**ప్ర: సహకార వ్యవసాయాన్ని స్వాగతిస్తున్నారా?**

**జ:** ఇది రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తీసుకుంటున్న చర్య. దీనిని నేను హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తున్నాను. అలాగే వ్యవసాయ కమోడిటీ ఎక్సేంజ్‌లలో మాది నెంబర్‌వన్. అంటే మేం భవిష్యత్తులో గణనీయ వ్యాపార పరిమాణం అంధ్రప్రదేశ్ నుండి పొందే అవకాశం ఉంది. ఇది హర్షణీయం.

**ప్ర: రైతుకు ఏ విధంగా లబ్ధి చేకూరుతుంది?**

**జ:** ఇప్పుడు రైతు తాను పండించిన పంటలో పంటలో 40 శాతం మేర మాత్రమే ఆదాయాన్ని పొందుతున్నాడు. రైతుకు వచ్చే ధరలో క్వింటాలుకు రూ. 10 పెరిగినా మనం వారికి ఎంతో మేలు చేసినట్టే. కేవలం మధ్యస్థాయిలో వ్యయం పెంచటం వలన దేశానికి మనం ఎంతో సేవ చేసిన వాళ్లం అవుతాం.

**ప్ర: సింగపూర్ కమోడిటీ ఎక్సేంజ్‌తో చేసుకున్న ఒప్పందంలో పురోగతి ఎంతవరకు వచ్చింది?**

**జ:** మేం ఇంకా విధివిధానాలను సమీక్షిస్తున్నాం. ప్రధానంగా అక్కడ రబ్బర్





## ఎన్‌సీడీఎక్స్ నుంచి ఆవాల కాంట్రాక్టు

**వ్యవసాయాధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో కమోడిటీస్ వ్యాపారానికి మంచి అవకాశాలున్నాయని నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌సీడీఎక్స్) మేనేజింగ్ డైరెక్టర్, సీ.ఈ.వో. శ్రీ ఆర్. రామశేషన్ తెలిపారు. మరో రెండు వారాల్లో తాము ఆవాలకు కూడా ఫ్యూచర్స్ కాంట్రాక్టు ప్రారంభిస్తున్నామన్నారు. స్టీల్ కాంట్రాక్టుకు గతంలో పెద్దగా ఆదరణలేదని, అయితే దీన్ని మళ్లీ ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నామన్నారు.**

**శనగలో తామిదివరకే కాంట్రాక్టు ప్రవేశ పెట్టామని, రాష్ట్రంలోని నంద్యాల, కోయిలకుంట్ల, ఆళ్లగడ్డ, బనగానపల్లి, తాండూరు, గుంతకల్, హైదరాబాద్, ఉరవకొండ, కడప, గుంటూరు కేంద్రాలు ఈ పంటకు ప్రధాన మార్కెట్లని చెప్పారు. ప్రపంచ ఉత్పత్తిలో 80 శాతం పసుపు ఇండియాలోనే పండుతుందని, ఎగుమతుల్లో 60 శాతం వాటా మనదేనన్నారు.**

కాంట్రాక్టులు చాలా యాక్టివ్‌గా ఉన్నాయి. ఇండియాలో మేం రబ్బర్, కాఫీ ఫ్యూచర్స్ ప్రారంభించినా వ్యాపార పరిమాణం పెరగటం లేదు. అయితే ఈ ఒప్పందం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం చివరిలోగా సింగపూర్ ఎక్స్ఛేంజ్‌తో మా ట్రేడింగ్ మెంబర్లు వ్యాపారం చేసే అవకాశం ఉంది.

**ప్ర: ఎలక్ట్రిసిటీ ఎక్స్ఛేంజ్‌లో వ్యాపారం అంతంత మాత్రంగానే ఉంటోంది, మీ కామెంట్ ?**

**జ:** ఎలక్ట్రిసిటీ ఎక్స్ఛేంజ్‌ను మేం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో కలిసి ప్రమోట్ చేశాం. అయితే ఇది ప్రత్యేక కంపెనీ, ఇందులో వ్యాపారం జరుగుతోంది. మీరన్నట్టు వ్యాపార పరిమాణం పెరగాల్సి ఉంది. ఇందులో మాకు సగం వాటా ఉంది.

**ప్ర: విదేశీ ఇన్వెస్టర్లు కమోడిటీ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే వ్యాపారం పెరుగుతుందా ?**

**జ:** నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో విదేశీ ఇన్వెస్టర్లను అనుమతించరు. ఇక ఫ్యూచర్స్ కాంట్రాక్టుల్లో పెట్టుబడి పెట్టాలంటే అవి తప్పకుండా ఇండియాలోనే రూపొందించబడి ఉండాలి.

**ప్ర: రబ్బర్ కాంట్రాక్టులు ఎందువల్ల విఫలమయ్యాయి?**

**జ:** రబ్బర్ ఉత్పత్తిదారులకు ధరలో 98 శాతం నేరుగా చేరుతోంది. దాంతో అక్కడ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌తో పనిలేకుండా పోతోంది. దీన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో మాకే తెలియటం లేదు.

**ప్ర: కార్బన్ ట్రేడ్ ఫ్యూచర్స్ కోల్ ఫ్యూచర్స్‌లో మా అనుభవాలు. . ?**

**జ:** కార్బన్ ట్రేడ్ ఫ్యూచర్స్ కోల్ ఫ్యూచర్స్ గత ఏప్రిల్‌లో ప్రారంభించాం. అయితే అవి అంత విజయవంతం కాలేదు. కార్బన్ క్రెడిట్‌కు విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. అయితే విదేశీ ఇన్వెస్టర్లు ఇక్కడకువచ్చి కొనే అవకాశం లేదు. ఇది ఎలా ఉందంటే అమ్మే వాళ్లున్నారు కానీ కొనే వాళ్లే లేరు. ప్రభుత్వం నిబంధనలు సడలిస్తే కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ బాగా పుంజుకునే అవకాశం ఉంది. ఇండియాలో అనేక కంపెనీలు పెద్ద మొత్తంలో కార్బన్ క్రెడిట్‌లు కలిగి ఉన్నాయి. మనం కనుక ట్రేడింగ్ డెస్క్ ఏర్పాటు చేస్తే, ఇందులో కంపెనీలు మంచి లాభం పొందే అవకాశం ఉంది.

**ప్ర: కోల్ ఫ్యూచర్స్‌కు డిమాండ్ ఎలా ఉంది?**

**జ:** కోల్ ఫ్యూచర్ కాంట్రాక్టును మనం ప్రవేశ పెట్టాం. అయితే తగినంత స్పందన లభించటం లేదు. దీనిని మళ్లీ ప్రవేశపెట్టే ఆలోచన ఉంది.

**ప్ర: మీ తక్షణ ప్రణాళికలు ఏమిటి?**

**జ:** ప్రస్తుతం అమలులో ఉన్న కాంట్రాక్టులను మరింత విస్తృతపరుస్తున్నాం. దేశవ్యాప్తంగా కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో జరిగేలా చూడడమే మా ముందున్న లక్ష్యం. రైతుకు మరింత ఆకర్షణీయమైన ధర లభించేలా చూస్తాం.

**ప్ర: మీ ముందున్న సవాళ్లు, అవకాశాలు. . .**

**జ:** స్టాక్ మార్కెట్‌ను సంస్కరించడమే మా ముందున్న సవాల్. మేం ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నామన్న అపవాదు మళ్లీ వస్తుంది. వినియోగదారుడు, వ్యాపారి ఇద్దరికీ లాభం చేకూరితే మాపై ఈ అపవాదు తొలిగిపోతుంది. ఎక్కువ మంది ట్రేడర్లు మా కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పాల్గొంటే ధరల్లో సమతుల్యత వస్తుంది.

**– ఆర్.కె.**



# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## పరబ్రహ్మ అడిగిన 'పాదము'

**చే**మకూర వెంకట కవి తర్వాత చిత్ర కవితలతో బంధ కవితలతో రస స్ఫూర్తిని కోల్పోయి ప్రజలకి దూరమై పోయిన ఆంధ్ర సరస్వతికి, ప్రజలలో తిరిగి ప్రాచుర్యం కల్పించిన ఘనత, తిరుపతి వెంకట కవులది. ఆశుకవితలతో ఆంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించి ప్రజల మనస్సులలో సాహిత్యానికి పట్టాభిషేకం గావించిన మహాకవులు వారు.

వారు ఎన్నో సభల్లో తమ సామర్థ్యాన్నీ, చమత్కారాన్నీ ప్రదర్శించి మన్ననలను పొందారు. వినుకొండలో జరిగిన అవధానంలో "దశావతారాల పేర్లు కంద పద్యం మొదటి రెండు పాదాల్లోనూ ఇమిడ్చి, తక్కిన రెండు పాదాల్లోనూ మీ పేర్లు చేర్చండి – అంతేకాదు, అధ్యక్షులైన పరబ్రహ్మ శాస్త్రిగారి పేరు కూడా చేర్చండి" అని పృచ్ఛకుడు అడిగాడు.

చాలా క్లిష్టమైన పని అది.

అక్కడికీ తిరుపతి కవుల్లో ఒకరైన వెంకట శాస్త్రిగారు "అయ్యా రెండుపాదాల్లో అసలే చోటు తక్కువ. ఆ యిరుకులో, మాలాంటి యాచక పండితుల పక్కని, నెలకి 3,4 వందలు జీతం తీసుకునే మండల ప్రభువు పరబ్రహ్మశాస్త్రిగారు ఎలా వుంటారు? మేము స్థలం చాలక అయన్ని నొక్కితే – అసలే ఆయన స్థూలకాయులు కదా?" అన్నారు. "ఫరవాలేదు. సర్దుకుంటాను. మీ పక్కని ఈ కందంలో నాక్కూడా చోటివ్వండి" అని అర్థించారు పరబ్రహ్మశాస్త్రిగారు. "సరే" అని చెళ్ళపిళ్ళవారు ఈ క్రింది పద్యం చెప్పారు.

*జలచరులలికిరి నరహరి*
*కలిత వటు త్రివిధ రామ కలుకులు బుద్ధుం*
*డిల దిరుపతి వెంకట శాస్త్రులను పరబ్రహ్మ*
*శాస్త్రి జూతురు పేర్మిన్ –*

అంతా చప్పట్లు కొట్టారు చెళ్లపిళ్ళవారి చమత్కృతికి.

☆

## అమూల్యానికి అమూల్యం

**ఇ**రవయ్యవ శతాబ్ది తొలి ముప్ఫయి నలభై ఏళ్ళనీ తిరుపతి వెంకటకవుల యుగం అని పిలవచ్చు. సాహిత్యాన్ని ప్రజల సమీపానికి తీసుకువచ్చారు వారిద్దరూ. వారి పాండవోద్యోగ విజయాల్లో పద్యాలు ఒకటి రెండయినా కంఠతా రాని తెలుగు వాడెవరూ ఆ రోజుల్లో ఉండేవారు కాదు. నానా రాజ సందర్శనాలతో, అష్టావధాన శతావధానాలలో ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించేశారు.

అటువంటి మహానుభావుల ఆశీస్సులు కావాలని ప్రతి సాహితీవేత్తా కోరుకోవడం సహజం. పుస్తకానికి వారి పీఠికో, తమ రచనపై వారి అమూల్య అభిప్రాయమో ఉంటే, ఇంక ఆ పుస్తకానికో, ఆ రచనకో, ఐ.యస్.ఐ. ముద్ర లభించినట్లే.

అందువల్ల ఆ రోజుల్లో, నాలుగు అక్షరం ముక్కలు వచ్చిన ప్రతివాడూ ఓ పుస్తకం రాయడం, దాని గురించి తమ అమూల్య అభిప్రాయం దయ చేయండని శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారిని (అదృష్టవశాత్తూ అప్పటికి తిరుపతి శాస్త్రిగారు చనిపోయారు) వేధించుకు తినడం మొదలెట్టారు.

ఇలా రోజూ పది, పదిహేనుగురు రావడం, వెంకటశాస్త్రిగారిని బతిమాలి, బామాలి, పీడించి, వేధించి తమ గ్రంథాలపై అమూల్యాభిప్రాయాలు రాయించుకువెళ్ళడం జరుగుతోంది.

వెంకటశాస్త్రిగారికి ప్రాణం విసిగిపోయింది. మంజువాణి ప్రెస్ మేనేజరు దగ్గరికి ఒక కాగితం పట్టికెళ్ళి "ఇది వెయ్యి కాపీలు అచ్చు వేసిపెట్టు" అని అడిగారు. అతను చూసి "ఇదేవిటండి శాస్త్రిగారూ!" అని అడిగాడు.

"అమూల్యాభిప్రాయాలు రాయలేక నా ప్రాణాలు పోతున్నాయి. ఇవి ఒక వెయ్యి కాపీలు అచ్చు వేయించి దగ్గర పెట్టుకున్నాననుకో. వచ్చిన ప్రతివాడికీ పని గట్టుకుని రాయక్కర్లేదు. పైన అతని పేరు రాయడం, కింద నా సంతకం పెట్టకం – అంతే!" అన్నారు.

"ఇదీ ఒక అమూల్యమైన అభిప్రాయమే!" అంటూ నవ్వి, మంజువాణి ప్రెస్ మేనేజరు, వెయ్యి అమూల్యాభిప్రాయ ఫారాలూ అచ్చువేసి, "ఈ ప్రింటింగ్ మూల్యం మీరు చెల్లించనక్కర్లేదు. మీ అమూల్యమైన అభిప్రాయాలకి, ఇది నా అమూల్యమైన కానుక" అంటూ ఆ ఫారాల కట్ట శాస్త్రి గారి చేతిలో పెట్టాడు

☆

## సాహెబ్‌గారి ప్రశ్నకి సంధ్యావందనమే సమాధానం

ఆధునిక ఆంధ్ర సాహిత్య చరిత్రలో, మేటి నాటక రచయితగా రసపట్ వచన రచనాధురీణుడుగా, సాక్షి వ్యాసవిన్యాస ప్రవీణునిగా ప్రతిష్ఠాత్మకమైన స్థానాన్ని అధిరోహించిన శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు చక్కని చమత్కారీ, సరస సంభాషణా చతురుడూను. పిఠాపురం వారి సంస్థానంలో శ్రీ దర్భా సర్వేశ్వరశాస్త్రి, శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి, శ్రీ చిలుకూరి వీరభద్రశాస్త్రి వంటి ఉద్దండ పండితుల నే తన చమత్కార పూరితమైన సంభాషణలతో ఏమీ మాట్లాడకుండా చేసేవారు.

ఏదో ఒక క్లిష్టమైన ప్రశ్న వేసి, 'నాకు తెలియదు' అని శ్రీ పానుగంటిచేత అనిపిద్దాం అని కొందరు పండితులు ఎన్నిమార్లో ప్రయత్నంచేసి విఫలులయ్యారు.

చివరికి నలుగురు పండితులు ఒక పథకం వేసి, పదిమందిలోను పానుగంటిని ఉర్దూలో ప్రశ్నించమని ఓ సాహేబుగారిని ఏర్పాటు చేశారు. ఆ ప్రకారం అందరూ వుండగా, ప్రక్కనుంచి నడిచి వెళ్తున్న పానుగంటిని ఉద్దేశించి, సాహేబ్‌గారు "కహా జాతే?" అని ఉర్దూలో ప్రశ్నించారు.

పరిచయంలేని భాషలో, ఊహించని ఆ ప్రశ్నకి, పానుగంటి లక్ష్మి నరసింహారావుగారు మొదట తెల్లబోయారు, కాస్త తబ్బిబ్బుపడ్డారు కూడా.

కాని, వెంటనే తేరుకొని, తను రోజూ పఠించే సంధ్యావందనంలోని మంత్రం, స్ఫురణకి రాగా, చిరునవ్వుతో చూశారు.

సాహేబ్‌గారు మళ్ళీ "కహాజాతే?" అన్నారు.

వెంటనే పానుగంటి సుస్వరయుతంగా "ఉత్తమే శిఖరే జాతే" .....అని ఆగారు.

అంతే! ఆయన్ను ఏదో తమాషా చేద్దాం అనుకొన్న పండితులు, పక పకా నవ్వి "భూమ్యాం పర్వతమూర్ధనే...." అంటూ తక్కిన సంధ్యా వందన భాగాన్ని పూర్తిచేశారు. అంతా నవ్వుకున్నారు సాహేబుగారితో సహా!

ఈ విధంగా పానుగంటి వారు తనకి తెలిసిన సంధ్యా వందనాన్ని, తనకి తెలియని సాహేబుగారి ప్రశ్నకి సమాధానంగా అడ్డంవేసి, ఇబ్బంది నుంచి ఇవతల పడ్డారు.

☆

# మన గ్రామం మన రాజ్యం



**మేం** ఏం చేయగలం? మాకేం అధికారాలున్నాయి? ఇది చాలా మంది స్థానిక సంస్థల ప్రతినిధులను వేధిస్తున్న ప్రశ్న. ప్రజాస్వామ్యం కేంద్రంలోనూ, రాష్ట్రంలోను మాత్రమే ఉన్నదని, స్థానిక సంస్థల్లో ఉన్నది అధికారుల పెత్తనమే తప్ప ప్రజాస్వామ్యయుతంగా ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలకు ప్రాతినిధ్యం ఇవ్వడం జరగడం లేదనే వాదనా ఉంది. భారత దేశంలో స్థానిక పరిపాలన రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన స్థాయికి చేరుకోవటానికి, స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించడానికి చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.

ఆ ప్రయాణ క్రమంలో స్థానిక సంస్థలకు ప్రస్తుతం రాజ్యాంగం, చట్టాలు కల్పించిన హక్కులు, అవకాశాల గురించి అవగాహన పెంచుకోవాలి. చట్టపరమైన అంశాలంటే అదేదో న్యాయవాదులు, న్యాయస్థానాలు చూసుకొనే విషయమని, సామాన్య ప్రజలకు అతీతమైనదనే భావనను తొలగించటం ద్వారానే న్యాయ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచగలం. ప్రస్తుతం ఉన్న చట్టాల్లోని ఉన్న అవకాశాలను అవగాహన చేసుకోవటం, వాటిని అమలు జరపడం, అమల్లో వచ్చే ఇబ్బందుల పరిష్కారానికి కృషిచేయడం ద్వారా మరింత మెరుగైన చట్టాన్ని

సాధించుకోవటం జరుగుతుంది. అందుచేత సమకాలీన చట్టాల పట్ల అవగాహన పెంచుకోవటం ద్వారానే మానవుని సామాజిక పరిపూర్ణత చేకూరుతుంది. 73వ రాజ్యంగ సవరణ భారతదేశంలో స్థానిక సంస్థల ప్రాదాన్యతను పెంచే క్రమంలో ఒక పెద్ద ముందడుగు.



గ్రామ పంచాయితీలకు ''స్థానిక స్వపరిపాలన" యూనిట్లుగా పనిచేయటానికి కావలసిన అధికారాలను కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలను చేవట్టవలసి ఉంటుందని భారత రాజ్యాంగంలోని 40వ అధికరణలో పేర్కొన్నారు. గ్రామ పంచాయితీలకు అధికారాలను అప్పగించకపోతే గ్రామీణ ప్రజలు ఈ రాజ్యాంగాన్ని తమదిగా భావించజాలరని రాజ్యంగ నిర్మాతలు సరిగానే హెచ్చరించారు.

'భారతదేశం గ్రామాల్లో నివసిస్తుంది' అని చెప్పదగినంత విస్తారమైన గ్రామీణ ప్రాంతం, ప్రజలు ఉన్న దేశంలో, ఆ ప్రజలు ఈ రాజ్యాంగాన్ని తమదిగా భావించే విధంగా చేయటం రాజ్యాంగ లక్ష్యం. ఈ లక్ష్యసాధన దిశగా జరుగుతున్న కృషిని ఈ క్రింది మూడు అంశాలుగా పేర్కొనవచ్చు.

1. **గ్రామ పంచాయితీలను ఏర్పరచటం**
2. **స్వయం పరిపాలనాకేంద్రాలుగా గ్రామ పంచాయితీలు అభివృద్ధి చెందటానికి కావలసిన అధికారాలను కల్పించటం.**
3. **కల్పించిన అధికారాలు ఆచరణ రూపం తీసుకునే విధంగా చేయటం.**

భారత రాజ్యాంగంలోని 12వ అధికరణం "రాజ్యం" (state) అంటే భారత ప్రభుత్వం మరియు పార్లమెంట్, రాష్ట్రప్రభుత్వం మరియు శాసన సభ, భారత ప్రభుత్వ అధికారం క్రింద భారతదేశంలో ఉన్న స్థానిక, ఇతర అధారిటీలు అని పేర్కొన్నది. అంటే స్థానిక సంస్థలు కూడా "రాజ్యం" (state) నిర్వచనంలో భాగంగా పేర్కొన్నారు. ఈ 12వ అధికరణాన్ని ప్రాధమిక హక్కుల్లో పొందుపర్చారు. 40వ అధికరణలో ఉపయోగించిన



"స్థానిక స్వయం పాలిత ప్రభుత్వం" అనే పద విస్తృతిని అవగాహన చేసుకోవాలంటే ప్రాధమిక హక్కుల్లో ఉన్న 12వ అధికరణతో కలిపి పరిశీలించాల్సి ఉంటుంది.

భారత రాజ్యాంగంలో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పొందుపర్చిన 9వ భాగం పంచాయితీల గురించి పేర్కొంటుంది. 243 జి అధికరణలో పంచాయితీల అధికారాలు, అధికారం, బాధ్యతలు గురించి పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఇతర అంశాలకు లోబడి రాష్ట్రప్రభుత్వాలు పంచాయితీలకు స్థానిక స్వయం ప్రభుత్వాలుగా పనిచేయుటకు కావలసిన అధికారాలను కల్పించే విధంగా చట్టాలను రూపొందించాలని సూచించారు.

అర్థికాభివృద్ధికి, సామాజిక న్యాయయానికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించటానికి, అందుకు సంబంధించిన పథకాల అమలుకు ఈ రాజ్యాంగం పదకొండవ షెడ్యూల్లో పొందుపర్చిన అంశాలతో సహా పంచాయితీలకు అధికారాలను, బాధ్యతలను సంక్రమింపజేసే విధంగా అట్టి చట్టాలను రూపొందించాలని కూడా ఈ అధికరణ ఉద్దేశ్యం.

భారత రాజ్యాంగం లోని పదకొండవ షెడ్యూల్లో ఈ క్రింది 29 అంశాలను పొందుపర్చారు.

1. వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ
2. భూమి అభివృద్ధి, భూ సంస్కరణల అమలు, ల్యాండ్ కన్సాలిడేషన్, ల్యాండ్ కన్సర్వేషన్.
3. చిన్న నీటిపారుదల, నీటి యజమాన్యం, వాటర్‌షెడ్ అభివృద్ధి.
4. పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మరియు పౌల్ట్రీ
5. మత్స్య సంపద
6. సామాజిక అడవులు,వ్యవసాయక అడవులు (Farm Foresty)
7. మైనర్ అటవీ ఉత్పత్తి



ఈ అంశాలన్నిటినీ ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టంలోని 1వ షెడ్యూలులో పునర్లిఖించటం ద్వారా ఈ రాష్ట్రంలోని పంచాయితీలకు ఈ అధికారాలను కూడా కల్పించినట్లయింది.

చట్ట పరంగా కల్పించబడ్డ ఈ అధికారాలను ఆచరణలో అమలు జరిగే విధంగా చూడటం చాలా క్లిష్టమైన ప్రక్రియ. అదే గ్రామ స్వరాజ్యం లక్ష్యం. అప్పుడే గ్రామ సభలు పరిపుష్టం అవుతాయి. గ్రామీణ సమాదాయాల సాంఘిక, ఆర్థిక పురోగతి సాధించబడుతుంది.

స్థానిక సంస్థలకు బాధ్యతలు, అధికారాలు కల్పించకుండా వాటి అభివృద్ధి సాధ్యం కాదు. స్థానిక సమస్యలు అవగాహన చేసుకోవటం, బాధ్యతలను గుర్తించటం, ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఉన్న అధికారాలను వినియోగించి వాటిని పరిష్కరించటం జరిగినప్పుడే గ్రామీణ అభివృద్ధి వాస్తవరూపం సంతరించుకుంటుంది.

స్థానిక పరిపాలన మీద నిరంతర పర్యవేక్షణ, పరిశీలన చేయటం ద్వారా అట్టి స్థానిక పరిపాలన యొక్క యదార్ధ ఫలితాన్ని పొందగలం. ప్రజలచేత ఎన్నికకాబడిన ప్రజా ప్రతినిధులతో కూడిన స్థానిక సంస్థలు పరిపాలనా క్రమంలో పరిణితి చెందిన ప్రజాతంత్ర సంస్థలుగా తమ పాత్రను నిర్వహిస్తాయి. అందులో గ్రామ పంచాయితీల పాత్ర మౌళికమైనది కనుక ప్రథమ ప్రాధాన్యత కలిగి ఉంటుంది.

అభివృద్ధి కార్యకలాపాలతో స్థానిక ప్రజాతంత్ర సంస్థల నిర్ణయాలకు ప్రాధాన్యత నివ్వటం వలన అభివృద్ధి కార్యకలాపాల్లో ప్రాధాన్యతలను సూచించే స్థాయి నుండి ఆదేశించే స్థాయికి, శాసించే స్థాయికి ఎదగడం ద్వారా దేశ సమగ్రాభివృద్ధికి జరిగే కృషి సజీవంగా ఉంటుంది.

73వ రాజ్యాంగ సవరణకు సంబంధించిన చట్టపరమైన విషయాలు వచ్చే సంచిక నుండి వివరంగా వెలువడుతాయి.

**– వి. రఘు**
న్యాయవాది

8. చిన్న తరహా పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో సహా
9. ఖాదీ, గ్రామ కుటీర పరిశ్రమలు
10. గ్రామీణ గృహాలు
11. త్రాగునీరు
12. వంటచెరకు, గడ్డి
13. రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, ఫెర్రీలు, జలమార్గాలు, ఇతర వాహనసౌకర్యాలు
14. గ్రామీణ విద్యుదీకరణ, విద్యుత్ పంపిణీ
15. సాంప్రదాయేతర ఇంధన వనరులు
16. పేదరిక నిర్మూలనా కార్యక్రమం
17. విద్య, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలతో సహా
18. సాంకేతిక శిక్షణ, వృత్తి విద్య
19. వయోజన, అనియత విద్య
20. గ్రంధాలయాలు
21. సాంస్కృతిక కార్యక్రమాలు
22. మార్కెట్లు, సంతలు
23. ఆరోగ్యం, పారిశుధ్యం, ఆసుపత్రులు, ప్రాథమిక వైద్య కేంద్రాలు, డిస్పెన్సరీలతో సహా
24. కుటుంబ సంక్షేమం
25. స్త్రీ, శిశు అభివృద్ధి
26. సాంఘిక సంక్షేమం, వికలాంగులు, మానసిక వికలాంగుల సంక్షేమంతో సహా
27. బలహీన వర్గాల సంక్షేమం, ముఖ్యంగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు
28. ప్రజా పంపిణీ వ్యవస్థ
29. సామాజిక ఆస్తుల నిర్వాహణ





# సేంద్రీయ వ్యవసాయంలో రాష్ట్రం ముందంజ

- సేంద్రీయ సాగులో రాష్ట్రానికి రెండోస్థానం
- ఈ యేడాది 25 లక్షల ఎకరాల్లో సాగు
- ఖర్చు తక్కువ, లాభమెక్కువ
- యేటా రైతులకు రూ.320 కోట్లు ఆదా
- యూపీలోనూ అమలుకు రాహుల్‌గాంధీ ఆసక్తి

**ఎరువులు లేవు. పురుగు మందులు అసలే లేవు. అయినా దిగుబడి ఏమాత్రం తగ్గలేదు. కొంచెం పెరిగింది కూడా. సేంద్రీయ సాగు ఫలితమిది. పంటలకు రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు అధికమవడమే కాక భూసారం కూడా త్వరగా క్షీణించిపోతుండటంతో రైతుల దృష్టి ఈ సేంద్రీయ వ్యవసాయంపై పడింది. రసాయనాలు లేకుండా ప్రకృతిలో లభించే వాటినే ఎరువులు, పురుగుమందులుగా ఉపయోగించడమే ఈ సేంద్రీయ వ్యవసాయం.**

దీనివల్ల ఆరోగ్య భద్రతతో పాటు భూసారం కూడా చెక్కు చెదరకుండా ఉంటుంది. పైగా దిగుబడి కూడా కాస్తో కూస్తో ఎక్కువే వస్తుంది. ఫలితంగా సాగుకయ్యే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. లాభాలు పెరుగుతాయి. రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే అవసరం ఉండదు క్యూబాలో రైతులందరూ ఈ సేంద్రీయ వ్యవసాయమే చేస్తున్నారు. సేంద్రీయ సాగులో క్యూబా ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. మన రాష్ట్రంలో కూడా ఈ సేంద్రీయ వ్యవసాయంపై రైతాంగం ఆసక్తి పెరుగుతోంది. ఈ ఏడాది 25 లక్షల ఎకరాలలో సేంద్రీయసాగు చేస్తూ, రాష్ట్రం క్యూబా తరువాతి స్థానం ఆక్రమించింది. మన రాష్ట్రంలో ప్రస్తుతం 4,024 గ్రామాల్లో ఆరు లక్షల మంది రైతులు ఈ తరహా వ్యవసాయం చేస్తున్నారు. రైతుల ఆసక్తికి ప్రభుత్వ సహకారం కూడా తోడవడంతో ఈ సేంద్రీయ సాగు మరింత విస్తరిస్తోంది.

గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం (సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటైన నాన్ పెస్టిసైడ్ ప్రోగ్రాం (ఎన్‌పీఎం) సేంద్రీయ ఎరువుల తయారీ, వినియోగాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, శిక్షణను రైతులకు అందిస్తోంది. ఇందు కోసం ఎన్‌పీఎం స్వచ్ఛంద సంస్థల సహాయాన్ని కూడా తీసుకుంటోంది. సేంద్రీయ ఎరువులతో 36 రకాల పంటలు పండిస్తున్నారు. సేంద్రీయ ఎరువులు వాడే పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకాన్ని ఒక్కసారే నిలిపివేయకూడదని, దశలవారీగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచుకుంటూ రావాలని నిపుణులు చెబుతున్నారు. సేంద్రీయ ఎరువులతో సేద్యం చేసే రైతులతో సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రస్తుతం అనంతపురం, విజయనగరం, శ్రీకాకుళం, వరంగల్, ఖమ్మం, కర్నూలు, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో కనీసం జిల్లాకో లక్ష ఎకరాల్లో సేంద్రీయ సాగు చేస్తున్నారు. మిగిలిన జిల్లాల్లోనూ ఈ తరహా వ్యవసాయం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. పంటలకు పురుగు సోకకుండా సామూహిక మంటలు పెట్టడం, పురుగులను ఆకర్షించే రంగుపటాలు ఉంచడం, పొలానికి సారాన్నిచ్చే వర్మీ కంపోస్టు ఎరువులు వేయడం, పొలం గట్లపై చెట్లు పెంచి ఆ చెట్ల ఆకులను పొలంలోనే ఎరువుగా వాడటం వంటివి సేంద్రీయ సాగు పద్ధతులు. సేంద్రీయ సాగు జరిగిన పొలాల్లో గత ఖరీఫ్ సీజన్ ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం లేకపోవడం వల్ల రైతులకు దాదాపు 320 కోట్ల రూపాయలు ఆదా

## క్యూబా తరువాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్



## అధికారిక లెక్కల ప్రకారం ఖరీఫ్‌లో సేంద్రీయ సాగు వల్ల రైతులు చేసిన ఆదా (రూ.కోట్లలో)

| పంట | విస్తీర్ణం(ఎకరాల్లో) | మందులపై ఆదా | ఎరువులపై ఆదా అధిక ధరతో | అధిక దిగుబడి+ రూ. కోట్లలో | ఆదామొత్తం |
|---|---|---|---|---|---|
| వరి | 3,82,655 | 38.26 | 24.87 | 38.26+76.53 | 177.92 |
| మిర్చి | 13,529 | 20.29 | 1.57 | 2.16+8.17 | 32.19 |
| కందిపప్పు | 75,607 | 9.07 | 2.64 | 4.08+7.56 | 23.35 |
| వేరుశనగ | 2,12,194 | 16.97 | 8.48 | 10.60+10.60 | 46.05 |
| పత్తి | 48,686 | 24.34 | 3.49 | -- | 27.83 |
| కూరగాయలు | 22,000 | 3.30 | 1.1 | 0.44 | 4.84 |
| ఇతరం | 1,77,513 | 17.75 | -- | -- | 17.75 |
| మొత్తం | 9,32,184 | 129.98 | 42.15 | 158.400 | 319.52 |

అయినట్లు అధికారులు అంచనా వేశారు. సేంద్రీయ సాగు వల్ల వరి పంటకు ఎకరాకు పురుగు మందులపై వెయ్యి రూపాయలు, ఎరువులపై 650 రూపాయలు ఆదా అవుతాయని, మిర్చిలో ఎకరాపై పురుగుమందుల్లో 15 వేల రూపాయలు, ఎరువులపై 1300 రూపాయలు ఆదా అవుతాయని, అలాగే పత్తిపై పురుగు మందులపై ఐదువేల రూపాయలు, ఎరువులపై ఎకరాకు 80 రూపాయలు ఆదా అవుతాయని అంచనా వేశారు. వరంగల్ జిల్లా జఫర్‌గడ్ మండలంలో గతంలో 34 ఎరువుల దుకాణాలు ఉంటే, ఇప్పుడు సేంద్రీయ సాగు అమల్లోకి వచ్చాక ఆ దుకాణాల సంఖ్య నాలుగుకు పడిపోయింది. రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న ఈ తరహా వ్యవసాయాన్ని ఉత్తరప్రదేశ్‌లోని తన పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా అమలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రాహుల్‌గాంధీ సైతం ఉత్సాహాన్ని కనబరిచినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం సేంద్రీయ సాగుపట్ల సంతృప్తితో ఉంది. 'నేషనల్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్' లో దీనిని ఒక భాగంగా చేర్చారు.

**– రాధాకృష్ణ**

# “బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...”



తెలంగాణా ప్రాంతంలో ఆశ్వయుజ మాసంలో స్త్రీలు వైభవోపేతంగా జరుపుకునే పర్వం బతుకమ్మ పండుగ. శరదృతువులో వచ్చే ఈ పండుగ పల్లెటూళ్ళను కళకళలాడేట్టు చేస్తుంది. గ్రామ గ్రామంలో స్త్రీలందరూ ఒక చోట కలుసుకునే పర్వంవేళ ఇది. అత్త వారిళ్ళకు వెళ్ళిన ఆడపడుచులంతా పుట్టింటికి చేరుకొని బతుకమ్మ ఆడేందుకు సమావేశమయ్యే చక్కని తరుణం ఇది. తెలంగాణా ప్రాంతంలో అనూచానంగా, శోభాయమానంగా, సంప్రదాయ బద్ధంగా బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.

## బతుకమ్మ అంటే....?

వెదురు లేదా దుసేరు తీగలతో అల్లిన సిబ్బిలో గుమ్మడి పూవులు పరచి వాటిపై తంగేడు, పైడి తంగేడు, గునుగు, నువ్వురుద్రాక్ష, కట్ల, గట్టుగొరిమిడి, కాకర, బీర, గన్నేరు, పొట్లకట్ల పువ్వులతో బతుకమ్మను పేరుస్తారు. దానిపై ‘గౌరమ్మ’ను నిలిపి పసుపు కుంకాలతో అర్పిస్తారు. బతుకమ్మలో అమర్చే గౌరమ్మను పసుపును ముద్దగా చేసి తయారుచేస్తారు. బతుకమ్మను నొమత్రలో ఒక పీటపై ఉంచుతారు. సాయంత్రం కాగానే పెద్దలు, పిల్లలు తమకున్న విలువైన వస్త్రాలను కట్టుకుంటారు. ఇన్నాళ్ళూ పెట్టెలలో భద్రంగా దాచుకున్న విలువైన ఆభరణాలను ధరిస్తారు. పీతాంబరాలను ధరించి నగలను అలంకరించుకున్న ప్రతి యువతి లక్ష్మీదేవిలా ఆగుపిస్తుంది. బతుకమ్మలను ఒక్కొక్కరూ చేతుల్లో పట్టుకొని ఊరిబయట చెరువుల వద్దకు, కాలువల దరికి, దేవాలయాల వద్దకి చేరుకుంటారు. అక్కడ బతుకమ్మల నన్నింటినీ మధ్యన నిలుపుతారు. బ్రాహ్మణుడు వచ్చి పూజ చేసిన తరువాత వారు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చేతులు తడుతూ పాటలు పాడుతారు.

## తొమ్మిదిరోజుల సంబరాలు

భాద్రపద బహుళ అమావాస్య మొదలు ఆశ్వీయుజ శుద్ధ అష్టమి దాకా తొమ్మిదినాళ్ళు (దేవి నవరాత్రుల సందర్భంగా) ఈ పండుగను స్త్రీలు ఘనంగా జరుపుకుంటారు. తొలిరోజున జరుపుకునే ఈ పండగను “ఎంగిలి పూలు” అని వ్యవహరిస్తారు. పాడ్యమి నుండి వరుసగా సాయంత్రం వేళల్లో తమ వాకిళ్ళు, కూడలి ప్రాంతాలలో స్త్రీలు బతుకమ్మ ఆడతారు. ఆరవరోజున పండుగను “అట్లెము” అంటారు. ఈ రోజున బతుకమ్మను పేర్చడం, ఆడడం జరుగదు. అష్టమినాడు జరుపుకునే పండుగను “చద్దుల

బతుకమ్మ" అంటారు. ఈ రోజున స్త్రీలు సుప్రభాత వేళ లేచి అభ్యంగన స్నానాలు చేసి పట్టువస్త్రాలు ధరిస్తారు. దద్ధోజనం, పులిహోర వంటి రకరాల భోజనాలు ఈ రోజున ప్రత్యేకంగా వారు తయారు చేస్తారు. ఈ వంటలనే 'చద్దులు' గా మూటకట్టుకొని సాయంత్రం వేళ వివిధ రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకొని చెరువు, వాగు, నదీతీరాలకు ఆడేందుకు వెళ్లారు. స్త్రీలు బతుకమ్మలతో బయలుదేరేముందు గ్రామవాద్యంగా పేరొందిన "కొమ్ము"ను ఊదుతారు. డప్పులు కొడతారు.

## బతుకమ్మ ఎవరు?

భట్టు నరిసింహకవి రచన ప్రకారం లక్ష్మీదేవి అవతారమే బతుకమ్మ. చోళదేశంలో ధర్మాంగుడనే రాజుండేవాడు. ఆయన భార్య సత్యవతి. ఆ దంపతులు నూరు నోములు నోమి నూరుగురు బిడ్డలను కన్నారు. కాని వారంతా శూరులైనా శత్రువుల చేతిలో హతమయ్యారు. పుత్రశోకంతో బాధపడే ఆ తల్లిదండ్రులు తమ రాజ్యాలను, సిరిసంపదలను, భోగాలను విడిచి అడవులకు వెళ్ళి లక్ష్మీదేవిని గూర్చి తపస్సు చేశారు. లక్ష్మీదేవి మెచ్చుకొని వరమడగమంటుంది. సత్యవతి తన గర్భంలో పుత్రికగా జన్మించమని లక్ష్మీదేవిని ప్రార్థిస్తుంది. శ్రీలక్ష్మి సత్యవతి కూతురుగా జన్మించింది. అక్కడికి కపిల గాలవులూ, కశ్య పాంగీరసులూ, అతివసిష్ఠులు మొదలైన ముని పరివారమంతా వచ్చి ఆ కన్య దర్శనం చేసుకొని "బ్రతికిన ఈ తల్లి బ్రతుకమ్మ" అన్నారంట.

అప్పటి నుంచి ఆమెను తల్లిదండ్రులు 'బ్రతుకమ్మ' అని పిలుచుకున్నారు. ప్రజలంతా 'బ్రతుకమ్మ' అనే ప్రియంగా పిలిచారు. ఆమె యుక్తవయస్కురాలైన తరువాత శ్రీ మహావిష్ణువు చక్రాంగుడనే రాజు వేషంలో వచ్చి ధర్మాంగుని ఇంట్లో ఇల్లరికం ఉండడానికి అంగీకరించి బతుకమ్మను పెళ్ళాడాడు. ఆ దంపతులు పెక్కుమంది సుందరాంగులైన కుమారులను కాంచి వర్ధిల్లారు. వృద్ధులైన సత్యవతీ ధర్మాంగులు సరిలేని సిరులతో సంతోషపడ్డారు. 'జగతిపైన బతుకమ్మ' శాశ్వతంగా వెలిసింది. ఓరుగల్లు ప్రాంతంలోని మొగలిపాకకు చెందిన ఐదుతరాల కిందట కవి భట్టునరసింహుడు చెప్పిన కథ ఇది. ఇది కాక మరో కథ ప్రచారంలో ఉంది.

దక్షప్రజాపతి తాను చేసే యాగానికి సహోదరులందరినీ కుటుంబాలతో రమ్మని ఆహ్వానించి, తనను తన భర్త శివుణ్ణి పిలవనందుకు కోపగించిన 'ఉమ' భగ్గున మండిపడి యజ్ఞగుండంలోకి దూకి ఆత్మార్పణ చేసుకుంది. పరమశివుడు రుద్రుడై వీరభద్రుని ప్రమధ గణాలతో పంపి దక్షయజ్ఞ ధ్వంసం చేయించాడు. యజ్ఞగుండంలో మాడిమసైన గౌరీదేవిని బతికించుకునేందుకు ఆ సుమంగళికి పసుపుతో ఆకారం సృష్టించి "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు గౌరమ్మ ఉయ్యాలో" అని జానపదశైలిలో స్తుతించారని, వారి పూజలకానందించి గౌరీదేవి బతుకమ్మగా శాశ్వతంగా పూజింపబడుతున్నదని ఈ కథ సారాంశం. ఈ రెండు కథలను బట్టి "లక్ష్మీ పార్వతుల ఐక్యరూపమే" బతుకమ్మ అని తెలుస్తున్నది.

## బతుకమ్మ పాటలలో కథలు

స్త్రీలు పాడుకునే బతుకమ్మ పాటల్లో రామాయణ, భారత, బాగవత కథలకు సంబంధించినవీ, వివిధ పురాణ కథలూ ఉన్నాయి. సీత, అనసూయ, చంద్రమతి, శశిరేఖ, సావిత్రి, కన్యకాపరమేశ్వరి వంటి సాధ్వీమణుల చరిత్రలు బతుకమ్మ పాటలలో ఉంటాయి. ఆధునిక కాలంలో గాంధీ వంటి నాయకుల చరిత్రలు ఉయ్యాల పాటలుగా స్త్రీలు పాడుతుంటారు."బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో / బంగారు గౌరమ్మ ఉయ్యాలో" అనే పాట అంతటా ప్రచారంలో ఉంది. ప్రతి చరణం చివర ఉయ్యాలో, చందమామ, వెన్నెలా, కోలు, గౌరమ్మ వంటి పదాలు వస్తుంటాయి. సమకాలిక కథలను, సమస్యలను, సంఘటనలను కూడా కవులు ఉయ్యాల పాటలుగా రచించారు. భట్టునరసింహకవి రాసిన బతుకమ్మ వృత్తాంతం తెలిపే పాట సుప్రసిద్ధమైంది. చెర్విరాల బాగయ్య కవి రచించిన నక్క అండాళమ్మ వంటి బతుకమ్మ పాటలు బహుళ జనాదరణ పొందాయి. నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలలో భువనగిరికి చెందిన నక్క అండాళమ్మ బతుకమ్మ పాటను స్త్రీలు ఎక్కువగా పాడుతుంటారు. ముక్తవరం తాండవకృష్ణయ్య రాసిన "వసంత వాగు రైలు ప్రమాదం" ఉయ్యాల పాటను తెలంగాణా జిల్లాలలో నేటికీ స్త్రీలు ఎక్కువగా ఆలపిస్తారు. పెక్కు బతుకమ్మ పాటలలో స్త్రీల ఆనవాయితీ, అభిమతాలు స్పష్టంగా వ్యక్తమౌతాయి.

తెలంగాణా జిల్లాలలో బహుళ ప్రచారంలో ఉన్న బతుకమ్మ పాట ఇది.

"శ్రీ లక్ష్మీ దేవియు చందమామ
సృష్టి బతుకమ్మయ్యో చందమామ
పుట్టినారీతి జెప్పె....భట్టు నరసింహకవి
ధర చోళదేశమున...ధర్మాంగుడను రాజు
ఆ రాజు భార్యయు అతి సత్యవతి యండ్రు
నూరు నోములు నోమి... నూరు మందిని గాంచె
వారు శూరులయ్యు వైరులచే హతమైరి
తల్లి దండ్రులపుడు తరగని శోకమున
ధనరాజ్యముల బాసి... దాయాదులను బాసి
వనితతో నారాజు వనముల నివసించె

కలికి లక్ష్మీని గూర్చి
ఘనతపం బొనరించె
ప్రత్యక్షమై లక్ష్మి ... పలికెవరమడుగుమని
వినుతించు వేడుచు ... వెలది తన గర్భమున
పుట్టుమని వేడగా ... పూబోణి మదిమెచ్చి
సత్యవతి గర్భమున జన్మించె శ్రీ లక్ష్మి
అంతలో మునులునూ ... కశ్యపాంగీరసులు
అత్రి వసిష్ఠులు ...ఆ కన్నియను జూచి
బ్రతుకగనె ఈ తల్లి ... బతుకమ్మయనిరంత"

బతుకమ్మ పాటలను స్త్రీలు గొంతెత్తి ఆలపించడం చూసేవారికి ఆ సన్నివేశాలు నయనానందకరంగా ఉంటాయి. ప్రధానంగా ఇది స్త్రీల పండుగే అయినా పురుషులు కూడా ఈ ఆనందంలో పాలుపంచుకుంటారు. గ్రామలక్ష్మీ వైభవాన్ని చూసేందుకు బతుకమ్మలాడే స్థలాలలో గుంపులు గుంపులుగా చేరి ఉయ్యాలపాటలు పాడుతూ గుండ్రంగా తిరిగే స్త్రీల నృత్యవైభవాన్ని చూసి ఆనందిస్తారు. బతుకమ్మలాడే సందర్భంగా పెద్దలు, పిన్నలు ఆనందోత్సాహాలతో టపాకాయలు కాల్చడం చేస్తారు. తెలంగాణా ప్రాంతంలో దంపతులు తమకు లేకలేక పుట్టిన ఆడబిడ్డకు, పుట్టినవాళ్ళు పోగా దక్కిన బిడ్డకు 'బతుకమ్మ' అని పేరు పెట్టుకుంటారు.

## ఉయ్యాల పాట తియ్యదనం

బతుకమ్మ పండుగ సందర్భంగా స్త్రీలు పాడే ఉయ్యాల పాటలు ఎంతో మధురంగా ఉండి పలువురిని ఇట్టే ఆకట్టుకుంటాయి. మచ్చుకు

"శ్రీ విలసిల్లగా ఉయ్యాలో చెప్పెదను ఒక కథా ఉయ్యాలో
స్వర్గలోకంబందు ఉయ్యాలో సత్కళల చెన్నొందు ఉయ్యాలో
మక్షకులము నందు ఉయ్యాలో అతివయొకతునన్ బుట్టె ఉయ్యాలో
ఆమె సౌందర్యంబు ఉయ్యాలో అలవియే చెప్పుడ ఉయ్యాలో





మోహనాంగి యౌట ఉయ్యాలో మోహినియను పేర ఉయ్యాలో
క్రమయుగ పెరుగుచు ఉయ్యాలో కడతేరె సత్కళల ఉయ్యాలో"

(ఇవి 'బాలరాజు – బతుకమ్మ' పాటలోని చరణాలు, హైదరాబాదు – సికింద్రాబాదు చుట్టపట్ల గ్రామాలలో పండుగ సందర్భంగా పాడుకునే పాట ఇది)

## గౌరి పాట కమ్మదనం

బతుకమ్మ పండుగ సందర్భంగా స్త్రీలు ఆలపించే గౌరి పాటలలో గౌరీరూపమైన పార్వతిపై వారికి గల భక్తిప్రపత్తులు కన్పిస్తాయి. ఆస్వాదించగలిగే కమ్మదనం ఆ పాటల్లో కన్పిస్తుంది.

"శ్రీ లక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ చిత్రమై తోచునమ్మా
భారతీ సతివయ్యు బ్రహ్మకిల్లాలివై, పార్వతీ దేవివై పరమేశురాణివే
పరగ శ్రీ లక్ష్మివయ్యూ గౌరమ్మ భార్యవైతి విహారికినీ గొప్పయగు నీ
ముద్దు
కొప్పింద్ర నీలములు
గప్పు చీకటి జగతికప్పు
కొప్పున బిళ్ళ చెప్పుతరము గానిదీ గైరమ్మ
చంద్రరేఖా పాటిది
నిగనిగాయునెడు నీ నగుమోము జూచితే
ఏగతి పున్నమునాటి చంద్రుణ్ణి ఓడించు
సొగసైన నీ తిలకమూ గౌరమ్మ – చూచితే ఆనందమురా
నల్లవరి బియ్యమో – మల్లెమొగ్గలోలేక
తెల్ల వజ్రంబులో ముల్లోకములు యేలు
తల్లి నీదంతంబులూ గౌరమ్మ – దానిమ్మ బీజంబులూ"
(భట్టు నరసింహ కవి రాసిందే ఈ గౌరీపాట)

## వాయనాలు 'చద్దులు'

బతుకమ్మ ఆట పూర్తికాగానే బతుకమ్మలను చెరువులలోనో,

నదులలోనో, కాలువలోనో, వాగులలోనో నీళ్ళల్లో వదిలాక స్త్రీలంతా 'గౌరీపాట' పాడుకుంటారు. తరువాత పెసలు, గోధుమ, బియ్యం, కొబ్బరి, నువ్వులతో తయారుచేసిన ఐదు విధాల చద్దులను గౌరమ్మ చిహ్నమైన పసుపును మంగళ సూత్రాల కంటించిన తరువాత ఒకరికొకరు వాయనాలుగా ఇచ్చుకొంటారు. బతుకమ్మలను నీళ్ళల్లో వదలడం, వాయనాల సందర్భంగా పరస్పరం ప్రేమ, అనురాగాలతో ఒకరినొకరు పలకరించుకుంటారు.

పరమ రమణీయమైన ప్రకృతిలో, చుట్టూరా గల పచ్చని పంటచేలు, నీటి ఆవాసాల వద్ద పల్లెటూళ్ళలో జరుపుకునే బతుకమ్మ పండుగ స్త్రీలలో ఐక్యతా సూత్రాలను పెనవేసి ఆత్మీయతను పెంచుతుంది. **- వై. సరోజ**



# దసరా వేళ పులి నృత్యాలు

ఆంధ్రదేశమంతటా ప్రచారంలో ఉన్న జానపద నృత్యప్రక్రియ పులివేషం. తెలుగునాట హిందూ ముస్లిం ప్రజల ఆదరాభిమానాల్ని సంపాదించిన కొన్ని ప్రసిద్ధ కళారూపాలలో పులినృత్యం ఒకటి. దసరా ఉత్సవాలలో భాగంగాను, పైడితల్లి, పోచమ్మ వంటి గ్రామదేవతల జాతరల సందర్భంలోను 'మొహర్రం' అంటే 'పీర్లపండుగ' సందర్భంగానూ ఈ 'పులినృత్యం' తప్పనిసరిగా ఉంటుంది. ఇది ఆరుబయట మైదానంలో జరిపే ప్రదర్శన. పల్లెల్లో ఆబాలగోపాలం ఈ పులినృత్యాలను విశేషంగా అభిమానిస్తారు. ఈ ప్రక్రియలో నిష్ణాతులైనవారు ప్రదర్శించే నృత్యాలు ఇంకా విశేషంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ఇది వంశపారంపర్యంగా ఆ కుటుంబాలకు సంక్రమించే కళారూపం. పులినృత్యకారునికి తాంబూరా, మరపం, ఉలా, బాకా, బూరా (వీటినే 'బిగులు' అని కూడా అంటారు), రామ్‌డోలు (డోలుకన్నా, తాషామార్పా కన్నా కొంచెం పెద్దగా ఉంటుంది) అతని సహకార వాద్యాలు. ఇది ప్రాచీన నృత్యం, పూర్వం క్రూరమృగమైన పులిని చంపిన తరువాత ప్రజలు ఆనందోత్సాహాలతో ఈ నృత్యాన్ని అభినయించేవారు. అదే గిరిజన కుటుంబాలలో, వ్యవసాయ కుటుంబాలలో ఆనంద నృత్యంగా అనాదిగా వస్తోంది.

పులికి, పులిని చంపినవాడికీ మధ్య జరిగే యుద్ధాన్ని జనులు ఆసక్తిగా చూస్తారు. పులిని గాయపరిచి చంపడంతో ఈ ప్రదర్శన ముగుస్తుంది. ఈ నృత్యప్రదర్శనకు మూడునుంచి ఎనిమిది గంటల దాకా సమయం తీసుకుంటారు. పులివేషధారి ఒంటినిండా నల్లని చారలు గల పసుపుపచ్చ తోలును ధరిస్తాడు. పులిముఖం ముసుగుతో కప్పబడుతుంది. వెనుకవైపున బొంబులతో ఓ పొదను సిద్ధం చేసి దానిలో పులితోకను ఉంచుతారు. ఆ తోకను భద్రపరచడానికి ఓ వ్యక్తి చాటుగా సాయపడుతుంటాడు. పులివేషధారి శరీరంపై అవసరమైన పెయింటింగ్స్ వేస్తారు. కడుపుపై పామును పెయింట్ చేయడం ఓ ప్రత్యేకత. పులినృత్యంలో కొన్ని సాహసమైన పనులు కూడా చేస్తారు. నోటిని తెరిచి పళ్ళలో ఇత్తడి బిందెనెత్తడం, నిజమైన గొర్రెపిల్లను నోట్లో కరుచుకోవడం వంటివి. ఈ నృత్య 'ఉదం' (ముందుకు దుముకడం)తో ప్రారంభమై 'దకమే'(వెనుకకు దుముకడం) తో కొనసాగుతుంది. రంగం మీదికి రాగానే 'పులినృత్యం' టెంపో అందుతుంది. కొన్ని ప్రాంతాలలో కృత్రిమంగా చెట్లను నాటి, ఆ అడవిలో పులి మనిషిని వెంటాడినట్టు చూపిస్తారు. హృదయాన్ని ఆకట్టుకునే సాహసనృత్యం 'పులినృత్యం'.





# బాలలకు వరం ఈ విద్యాహక్కు

**పిల్లల విద్య ఒక అవకాశంగా కాకుండా ఒక హక్కుగా మార్చే విద్యా బిల్లు 2009ని లోక్‌సభ ఆగస్టు 4వ తేదీన ఆమోదించింది. అంతకు ముందే జూలై 20 తేదిన ఈ బిల్లు రాజ్యసభ ఆమోదం పొందింది. రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా రూపొందించబడుతుంది. 62 ఏళ్ళ స్వతంత్ర భారత దేశ చట్ట సభలో ఇది ఒక మైలు రాయి అని, 21 శతాబ్దంలో ఎదురయ్యే సవాళ్ళను కొత్త తరం బాలలు అధిగమించేందుకు ఇది ఒక గొప్ప అవకాశమని ఈ బిల్లు ప్రవేశపెడుతూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ కపిల్ సిబాల్ అన్నారు.**

## ఈ బిల్లులోని ముఖ్యాంశాలు

- 6నుండి14 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య
- విద్యనందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, స్థానిక సంస్థల బాధ్యత
- రాజ్యాంగానికి తగినట్టుగా సిలబస్ రూపకల్పన చేయడం.
- నాణ్యమైన విద్య అందించడం.
- సామాజిక బాధ్యతపై దృష్టి పెట్టడం.
- అడ్మిషన్ విషయంలో పాలనా పరమైనా చిక్కులు లేకుండా చేయడం.
- అడ్మిషన్ సమయంలో ఫీజును, చార్జీలు రద్దు చేయడం.
- పిల్లల తల్లిదండ్రులు ప్రవేశ పరీక్షలకు హాజరు కాకుండా చేయడం.
- రాష్ట్రాలు మూడేళ్ళలో నివాస పరిసరాల్లో పాఠశాలలను గుర్తించడం / ఏర్పాటు చేయడం.

ప్రజాస్వామ్యంలో అందిరికీ సమాన అవకాశాలు కల్పించడంలో సార్వత్రిక ప్రాథమిక విద్య కీలక పాత్రను స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే గుర్తించడం జరిగింది. 4 ఏళ్ళ లోపు పిల్లలందరికి ఉచికీ, నిర్బంధ విద్య అందించాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో నిర్దేశించారు. దీనికి అనుగుణంగా అనేక విద్యా కార్యక్రమాలు అమలు పరచడం, స్కూళ్ళ సంఖ్య పెంచుకోవడం జరిగింది. అయితే సార్వత్రిక ప్రాథమిక విద్య మాత్రం సాధించ లేక పోయాం. మధ్యలో బడిమానివేసే పిల్లల సంఖ్య ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా చదువు పూర్తి చేసిన పిల్లలలో కూడా విద్య నాణ్యత చాలా తక్కువగా ఉంటుంది.

ఈ విషయాలను పరిగణనలోనికి తీసుకొని విద్య పిల్లల ప్రాథమిక హక్కుగా 2002 సంవత్సరంలో రాజ్యాంగ 86వ సవరణ తీసుకొచ్చారు. దీని ద్వారా నిర్బంధ విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ, దీనికి అవసరమైన చట్టాన్ని తీసుకొని రావలసివచ్చింది. 2009 ఆగస్టు 4వ తేదీన పార్లమెంటు ఆమోదించిన బిల్లు 86వ రాజ్యాంగ సవరణ అమలుకు చట్ట రూపం తీసుకొనివచ్చింది.

ఈ బిల్లులో ఏడు అధ్యాయాలు ఉన్నాయి. మొదటి అధ్యాయంలో బిల్లులో వాడిన పదాలకు నిర్వచనాలు ఇవ్వడం జరిగింది. రెండవ అధ్యాయంలో ఉచిత నిర్బంధ విద్య హక్కు గురించి వివరించబడింది. 6నుండి 14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలు ఉచితంగా, నిర్బంధంగా 8 సంవత్సరాలు విద్యను పొందే హక్కు కల్పించబడింది. విద్యార్ధి నివాస పరిసరంలో ఉండే పాఠశాలలో చదువుకోవాలి. చదువుకోవటానికి ఫీజులు, ఖర్చులూ భరించాల్సిన అవసరం లేదు. 6-14 ఏళ్ళ మధ్యలో ఏ వయసులో పాఠశాలలో చేరితే ఆ సంబంధిత తరగతిలోనే చేర్చాలి. అయితే ఆ తరగతికి తగిన అర్హత కల్పించటానికి అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఒక వేళ పాఠశాల మారాల్సివస్తే ఎక్కడైనా చదువు కొనసాగించే అవకాశం ఉంటుంది.

మూడవ అధ్యాయంలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు, తల్లిదండ్రుల విధులను పేర్కొన్నారు. పిల్లలకు అందుబాటులో పాఠశాలలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, స్థానిక సంస్థలది. ఈ చట్టం పేర్కొన్న

### విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే విద్యా హక్కు బిల్లు



అంశాలను అమలు చేయటానికి అయ్యే ఖర్చుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చాలి. కరిక్యులమ్, సిలబస్, టీచర్ల ట్రైనింగ్ ప్రణాళిక తదితర విషయాలు కేంద్రప్రభుత్వం చూస్తుంది. పాఠశాలల ఏర్పాటు, వాటికి వసతులు కల్పించటం, ఉపాధ్యాయుల శిక్షణకు తగిన ఏర్పాట్లు చెయ్యటం తదితర బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వర్తించాలి. పిల్లల్ని బడిలో చేర్చటం, సక్రమంగా హాజరయ్యేలా చూడటం, పాఠశాలల నిర్వహణ మున్నగు పనులు స్థానిక సంస్థలు చూడాలి. పిల్లలను బడిలో చేర్చాల్సిన బాధ్యత తల్లిదండ్రులది. బడిలో చేరటానికి ముందు 3 సంవత్సరాల వయసు దాటిన పిల్లలు అందరికీ పూర్వ ప్రాథమిక విద్యను అందించాల్సిన బాధ్యతా ప్రభుత్వానిదే. అది కూడా ఉచితంగానే.

నాలుగో అధ్యాయంలో పాఠశాలలు, ఉపాధ్యాయుల బాధ్యతలు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఎయిడెడ్ పాఠశాలల్లో కూడా ఉచితంగా విద్యని అందించాలి. అన్ ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను బలహీన వర్గాల పిల్లలకు కేటాయించి ఉచితంగా చదువు చెప్పాలి. వారికయ్యే ఖర్చును (ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో సమానంగా) ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. ప్రైవేట్ స్కూల్స్ కేపిటేషన్ తదితర ఫీజులు వసూలు చెయ్యకూడదు. ఒక వేళ చేస్తే వసూలు చేసిన దానికి పదిరెట్ల మొత్తంలో జరిమానా విధించబడుతుంది. పిల్లలకు ఎలాంటి ప్రవేశ పరీక్షలు పెట్టరాదు.

బడిలో చేరటానికి వచ్చిన పిల్లలు ఎవరినీ నిరాకరించరాదు. వయో నిర్ధారణ లేదనే కారణంతో ఎవరికీ ప్రవేశాన్ని తిరస్కరించకూడదు. విద్యా సంవత్సరం మధ్యలో వచ్చినా చేర్చుకోవాల్సిందే. అలాంటి వారికి ఆ విద్యా సంవత్సరంలోనే సంబంధిత తరగతి పూర్తి చేసేలా చూడాలి. ఏ విద్యార్థినీ అదే తరగతిలో తిరిగి కొనసాగించకూడదు. విద్యార్థుల్ని శారీరకంగా, మానసికంగా బాధించరాదు. అలాచేస్తే శిక్షార్హులవుతారు. ఈ చట్టం అమల్లోకి వచ్చాక గుర్తింపులేని పాఠశాల అంటూ ఉండరాదు. అన్ని పాఠశాలలకు నిర్వహణా కమిటీ (ఎస్ఎంసి)లను ఏర్పాటు చేస్తారు (అన్ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్‌కి అవసరం లేదు). ఈ కమిటీల్లో ప్రజాప్రతినిధులు, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. బలహీన వర్గాల పిల్లల తల్లిదండ్రులకు తగిన ప్రాతినిధ్యం ఉంటుంది. ఈ కమిటీ పాఠశాల పనిని పర్యవేక్షిస్తుంది. పాఠశాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తుంది. దాని ఆధారంగానే నిధులు వస్తాయి.

కేంద్ర ప్రభుత్వ అకాడమీకి అథారిటీ నిర్ణయించిన అర్హతలు గల వారినే ఉపాధ్యాయులుగా నియమించటం జరుగుతుంది. అటువంటి అర్హతలు లేనివారు ఎవరైనా వుంటే వారు 5 సంవత్సరాలలోపు నిర్దేశిత అర్హతలు పొందాల్సి ఉంటుంది. ఏదైనా రాష్ట్రంలో పూర్తి అర్హతలు గల వారు లభించకుంటే మినహాయింపు ఇచ్చి ఉపాధ్యాయులను నియమిస్తారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, జీత భత్యాలు తదితర నిబంధనలు ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఉపాధ్యాయులు నిర్ణీత వేళల్లో పాఠశాలకు రెగ్యులర్‌గా హాజరు కావాలి. ప్రతి విద్యార్థి లోని సామర్థ్యాన్ని గుర్తించి, వెనుకబడిన వారికి అదనపు బోధన చెయ్యాలి. తల్లిదండ్రులతో సమావేశాలు జరపాలి. పిల్లల హాజరు, అభ్యసన స్థాయి, పురోగతి తదితర వివరాలు చెప్పాలి. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలి.

ఐదవ అధ్యాయంలో పాఠ్యప్రణాళిక మూల్యాంకాలను వివరించడం జరిగింది. పాఠ్య ప్రణాళిక రాజ్యాంగంలో పేర్కొన్న విలువలకు లోబడి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువుగా ఉండాలి. అభ్యసనం కృత్యాధారంగా, అన్వేషణాత్మకంగా, ప్రతిభను, శారీరక, మానసిక సామర్థ్యాన్ని వెలికితీసేదిగా ఉండాలి. భయం, వత్తిడి, ఆందోళన కలిగించేదిగా ఉండకూడదు. ప్రాథమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ యివ్వాలి. ప్రాథమిక విద్య పూర్తయ్యేలోపు ఎలాంటి బోర్డ్ పరీక్షలు ఉండవు.

ఆరవ అధ్యాయంలో పిల్లల హక్కుల రక్షణ గురించి ఉంది. జాతీయ పిల్లల హక్కుల రక్షణ కమీషన్ మాదిరిగా రాష్ట్ర స్థాయి కమీషన్‌లు ఏర్పాటు చెయ్యాలి. ఈ కమీషన్‌లు ఉచిత నిర్బంధ విద్యపై వచ్చే ఫిర్యాదుల్ని విచారిస్తాయి. విద్యా హక్కు రక్షణ ఏర్పాట్లు సమీక్షించి వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సిఫారసు చేస్తాయి. విద్యా హక్కు చట్టం కల్పించే హక్కులపై స్థానిక సంస్థకి ఫిర్యాదులు చెయ్యవచ్చును. సదరు ఫిర్యాదులను నిర్దేశిత పద్ధతి ప్రకారం పరిష్కరించాల్సి ఉంటుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఒక జాతీయ సలహా సంఘాన్ని ఏర్పాటు చెయ్యాలి.

ఇక ఏడవ అధ్యాయంలో ప్రభుత్వాల బాధ్యత, శిక్షణాధికారాలు, వ్యాజ్యాల నుంచి రక్షణ, ప్రభుత్వాల అధికారాలు, చట్ట సభలకు జవాబుదారీ తదితర విషయాలు పొందు పర్చబడినవి. ఈ బిల్లుకి అనుబంధంగా చేర్చిన షెడ్యూల్‌లో పాఠశాలలకు కనీస వసతులు, ఉపాధ్యాయులు సంఖ్య, పని దినాల గురించి పేర్కొనటం జరిగింది.

ఈ బిల్లు గ్రామీణ విద్యాభివృద్ధికి పెద్ద ముందడుగు. ఈనాడు విద్యా రంగంలో గ్రామీణ ప్రాంతాలు చాలా వెనుకబడి ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, ముఖ్యంగా బాలికలు, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు, పాఠశాలల ఆకర్షణీయమైన, నాణ్యతగల విద్య లభించక పాఠశాలలకు దూరంగా ఉంటున్నారు. వారికి ఈ బిల్లు ద్వారా విద్య హక్కుగా లభిస్తుంది. విద్యారంగంలో వెనుకబడిన రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు బిల్లు ఒక వరం. దీని ఉపయోగించి అన్ని వెనుకబడిన ప్రాంతాలలోను పాఠశాలలను ఏర్పాటు చేసి వాటి ద్వారా పిల్లలందరికి మంచి నాణ్యమైన విద్య అందించడానికి అవకాశం కల్గుతుంది.

డా॥ క్రిష్ణమోహన్ రావు
సెంటర్ హెడ్
రీసెర్చ్& ట్రైనింగ్
ఎ.యం.ఆర్. అపార్డ్





# ఖుర్ ఆన్ అవతరించిన పవిత్ర మాసం 'రమజాన్'

**కాలగమనంలో జాతులు ఏదేని ప్రధాన సంఘటన యొక్క ప్రాశశ్త్యాన్ని చిరస్మరణీయంగా ఉంచుకోటానికి గుర్తుగా తమదంటూ ఒక కాలమానాన్ని ఏర్పరుచుకున్నారు. అలాంటి వాటిలో నేటి క్రీస్తుశకం, శాలివాహన శకంలాగే ఇస్లాం కాల మానం హిజ్రీ శకంగా వ్యవహరించబడుతూ ఉంది. అన్ని శకాల కాలమానాలలోని వారపు దినాలు, మాసపు వారాలు సంవత్సరపు మాసాల సంఖ్య ఒకటిగానే ఉండటం విశేషం.**

అంతిమ దైవప్రవక్త హజరత్ ముహమ్మద్ (స.అ.సం) తాము పుట్టి పెరిగిన అరేబియా నేలపైన మక్కానగరంలో తమ 40వ ఏట క్రీస్తుశకం 12-2-610 రమజాన్ మాసం శుక్రవారం నాడు వారిపై దైవగ్రంథమైన ఖురాన్ అవతరణ ప్రారంభమైన నాటినుండి దైవదౌత్యం పొందారు. ఆనాటి నుండి అల్లాహ్ ఆదేశానుసారం పన్నెండున్నర సంవత్సరాల కాలం ఏకేశ్వర సిద్ధాంత ప్రచారం సాగించిన నేపథ్యంలో మక్కా బహు దైవారాధకుల అవరోధాలు, హింసా దౌర్జన్యాలు పరాకాష్టకు చేరుకున్నాయి. వారి జీవితం దుర్భరమైపోయింది. ఆ పరిస్థితుల్లో అల్లాహ్ ఆదేశానుసారం మక్కాను వదిలి మదీనాకు వలస (హిజ్రత్) వెళ్ళారు. ఆనాటి నుండి ఇస్లాం కాలమానం హిజ్రీ శకం ప్రారంభమయింది. హిజ్రీ శక సంవత్సరం మొహరం మాసంతో ప్రారంభమౌతుంది.

క్రీస్తుశకం 2005 మార్చి మాసంలో వచ్చే మొహరం మాస ఆరంభంతో హిజ్రీ శకం 1445 అంతమై 1446లో ప్రవేశిస్తుంది. హిజ్రీ శక సంవత్సరపు పన్నెండు మాసాలలో తొమ్మిదవ మాసం రమజాన్.

ఇస్లాం చరిత్రలో రమజాను మాసం పవిత్రత, ప్రాధాన్యతలో తనదంటూ ఒక విశిష్ట స్థానాన్ని సంతరించుకుంది. అది సంతరించుకున్న ఆ పవిత్రతను తెలుసుకోటానికి దాని నేపథ్యాన్ని తెలుసుకోవటం ఎంతైనా అవసరం. మరీ ముఖ్యంగా మానవాళి ఇహపర జీవన ముక్తి మోక్షాలకై అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలన్నీ రమజాను మాసంలోనే అవతరించిన కారణంగా ఆ గ్రంథాలను గూర్చి తెలుసుకోవడం మరీ ముఖ్యం.



బ్రహ్మాండమైన గ్రహాల నుండి సూక్ష్మాతి సూక్ష్మమైన పరమాణువుల వరకు ఈ విశ్వంలోని సృష్టితలన్నీ వాటి సృష్టికర్త అయిన అల్లాహ్ వాటిని నిర్దేశించిన విధానాలలో మనుగడ సాగిస్తున్నాయన్నది కాదనలేని సత్యం. ఆ విషయం అంతిమ దైవ గ్రంథమైన ఖుర్ఆన్‌లో ఇలా చెప్పబడింది ''మేము భూమిని, ఆకాశాలనూ, వాటిలో ఉన్న సమస్తాన్ని సత్యం పునాదిగా తప్ప మరొక పునాదిగా సృష్టించలేదు" (15వ అధ్యాయం 85 వచనం). ఆ విధానాల నుండి తొలిగిననాడు అవి నాశనమైపోతాయి. ఆ విధంగా నిర్దిష్ట విధానాల పునాదులపై మనుగడసాగిస్తున్న ఈ విశ్వంలోని భూమిపై పరిఢవిల్లుతున్న మానవజాతి అందుకు అతీతంగా ఉండజాలదు. ఒకవేళ ఉంటే మనజాలదు.

సృష్టిలోని అణువణువుకూ ఒక ధర్మాన్ని ప్రసాదించిన విధాత మానవ జాతి మనుగడకు కూడా ఒక విధానాన్ని ఆదేశించాడు. ఆ విధానాన్ని విస్మరిస్తే, కాలక్రమంలో అది కూడా నాశనమైపోతుంది.



సృష్టిలోని సకల సృష్టితలలో మానవజాతిని అల్లాహ్ కొన్ని ప్రత్యేకతలతో సృష్టించాడు. సృష్టిలో వేటికీ లేని జ్ఞానాన్ని, ఆలోచనా విధానాన్ని, స్వయం నిర్ణయ పరిమిత స్వేచ్ఛను మానవులకు మాత్రమే ప్రసాదించాడు అల్లాహ్. ఆ కారణంగానే సృష్టిలో కెల్లా మానవ జన్మ ఉత్తమ జన్మగా వ్యవహరించబడుతూ ఉంది. దైవం ఆదేశించిన జీవన విధానాన్ని ఆచరించటమో లేక తిరస్కరించటమో అనే స్వేచ్ఛను మనిషి నిర్ణయానికే వదిలివేశాడు అల్లాహ్. ఈ విషయం ఖురాన్‌లో ఇలా చెప్పబడింది.

"ఇది సత్యం. మీ ప్రభువు నుండి వచ్చింది. ఇష్టమైనవారు దీనిని స్వీకరించనూ వచ్చు, ఇష్టం లేనివారు తిరస్కరించనూ వచ్చు" (18వ అధ్యాయం 29వ వచనం). ఇలా చెప్పటమే కాకుండా దైవాభీష్టమైన ప్రకృతి ధర్మంపై జీవితం గడపటం వల్ల ఇహ పరజీవితాలలో కలిగే లాభాన్నీ, మనోభీష్టమైన విశృంఖల జీవితాన్ని గడిపితే జరిగే నష్టాన్ని మనిషికి స్పష్టం చేశాడు. ఈవిషయం దివ్య ఖురాన్‌లో ఇలా చెప్పబడింది.

"ఎవడు నా ఈ మార్గ దర్శకత్వాన్ని అనుసరిస్తాడో అతడు మార్గమూ తప్పడు, దౌర్భాగ్యానికీ గురికాడు. నా జ్ఞాపికకు (హితోపదేశానికి) విముఖుడైనవానికి ప్రపంచంలో జీవితం ఇరుకైపోతుంది. ప్రళయ దినం నాడు మేము అతనిని అంధునిగా లేపుతాము" (20వ అధ్యాయం 122, 123 వచనాలు) ఆ విధంగా అల్లాహ్, ఈ భూమిపై తొలిమానవుడు కాలిడిన నాటినుండి దైవాభీష్ట జీవనాన్ని త్రోసిరాజని తన మనోభీష్ట జీవనం గడిపి వినాశపుటంచులకు చేరుకున్న ప్రతిజాతిని హెచ్చరించటానికీ, వారికి రుజుమార్గం చూపటానికీ ఆయా సమాజాలలోని ఉత్తమ మానవులను తన ప్రవక్తలుగా చేసి పంపాడు. వారిలో ఎంచుకున్న బహు కొద్ది ప్రవక్తల పై ఆకాశగ్రంథాలను కూడా అవతరింపజేశాడు అల్లాహ్.

ఆ విధంగా మానవజాతిని జాగృతం చేయటానికి ప్రతికాలంలోను ప్రభవింపబడ్డ దైవ ప్రవక్తల సంఖ్య ఒక లక్షా ఇరవైనాలుగు వేలని, వారిపై అవతరింపజేసిన ఆకాశగ్రంథాల సంఖ్య 230 నుండి 235గా గ్రంథాలలో చెప్పబడింది. ఈ గ్రంథాలలో బహుకొద్ది గ్రంథాల వివరాలు మాత్రమే మానవ పరిజ్ఞానానికి అందాయి.

ఆ పరంపరలో నేటికి 1400 సంవత్సరాలకు పూర్వం మక్కాలో జన్మించిన హజరత్ ముహమ్మద్ (స.అ.సం) చివరిప్రవక్త. అవతరింపబడిన

ఆకాశగ్రంథాలలో దివ్యఖురాన్ అంతిమ దైవగ్రంథం. ఇక ప్రళయదినం వరకూ మానవజాతికి దైవం ఆదేశించిన జీవన విధానాన్ని చూపే గ్రంథమే 'ఖురాన్'. ఆ గ్రంథంలోని ఆదేశాలను ఆచరించి చూపిన హజరత్ ముహమ్మద్ (స.అ.సం) జీవితం మానవజాతికి ఆదర్శం.

మానవ జాతి ఇహపర జీవన సాఫల్యానికై అల్లాహ్ అవతరింపజేసిన ఆకాశగ్రంథాలన్నీ రమజాను మాసంలోనే (ఆయా కాలమానాల సంవత్సరంలోని తొమ్మిదవమాసం) అవతరింపబడటం విశేషం. నేటికి నాలుగు వేల సంవత్సరాలకు పూర్వం దైవప్రవక్త హజరత్ ఇబ్రాహీం (అలై హివస్సలాం)గారిపై అవతరింపబడిన దైవ ఆదేశమైన "సహీఫా" (గ్రూూూామీా) రమజాన్ మాసం ఒకటి లేక మూడవ తేదీన (2) దైవప్రవక్త హజరత్ దావూద్ (అలై సలాం)గారిపై అవతరింపబడిన 'జబూర్" గ్రంథం రమజాన్ మాసం 12 లేక 18వ తేదీన (3) హజరత్ ఈసా (అలై హివసలాం)గారిపై అవతరింపబడిన దైవ గ్రంథమైన "తౌరైతు" రంజాన్ మాసపు 6వ రోజున దైవప్రవక్త (4) హజరత్ మొహమ్మద్ (స.అ.సం)గారిపై చివరిదైవ గ్రంథమైన ఖుర్ఆన్ రమజాన్ మాసంలో ఒక ఘనమైన రాత్రి అవతరింపబడినట్టు గ్రంథాలు చెబుతున్నాయి. ఈ విషయం ఖుర్ఆన్‌లో ఇలా చెప్పబడింది. "పవిత్ర ఖుర్ఆన్ అవతరించిన నెల రమజాన్ నెల మానవులందరికీ (ఆ గ్రంథం) మార్గ దర్శకం. రుజుమార్గం చూపే, సత్యాసత్యాలను వేరు పరిచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయ్" . . . . . (2వ అధ్యాయం 185వచనం).

దైవగ్రంథమైన ఖురాన్ ఏదో ఒక ప్రత్యేక వర్గానికి చెందిన గ్రంథం కాదని, అది సృష్టికర్త అయిన అల్లాహ్ తాను సృష్టించిన సమస్త మానవాళి ఇహ పర జీవన ముక్తి, మోక్షప్రాప్తికై ఒక సంపూర్ణ జీవన విధానాన్ని ప్రసాదించే గ్రంథమని అది పూర్వంపు సమస్త దైవగ్రంథాల శృంఖలలో చివరి గ్రంథమని, వాటిలోని విషయాలను మానవాళికి మరొకసారి ధృవీకరించటానికై అవతరింపబడిన మాత్ర గ్రంథమనీ, చివరి గ్రంథమనీ స్వయానా ఖురాన్‌లో చెప్పబడింది.

"ప్రవక్తా, మేము నీ వద్దకు పంపిన ఈ గ్రంథం సత్యాన్ని తీసుకొని వచ్చింది. తన కాలంలో ఉన్నటువంటి "అల్‌కితాబ్"లోని భాగాలను అది ధృవీకరిస్తుంది, పరిరక్షిస్తుంది (5వ అధ్యాయం-48వ వచనం). అల్ కితాబ్‌ను సంరక్షించేది అంటే అది పూర్వం అవతరింపబడిన ఆకాశగ్రంథాలలో చెప్పబడిన సమస్త సత్యోపదేశాలను తనలోనికి తీసుకొని పదిల పరుచుకున్నది అని అర్థం. దీని వల్ల ఇంకా వివరంగా తెలిసే సత్యమేమిటంటే ఖురాన్ మరియు వివిధ కాలాలలో, వివిధ భాషలలో అల్లాహ్ తరఫు నుంచి అవతరించిన సమస్త గ్రంథాలు వాస్తవానికి మౌలికంగా ఒకే గ్రంథం. వాటి రచయిత ఒకడే, వాటి లక్ష్యం ఒకటే, వాటి ఉద్దేశం ఒకటే, వాటి ద్వారా మానవ జాతికి ప్రసాదింపబడిన జ్ఞానమూ ఒకటే. ఒకవేళ భేదం ఏదైనా ఉంటే అది రచనా భేదమే. ఆ భేదం కూడా ఒకే లక్ష్యం కొరకు విభిన్న శ్రోతలను బట్టి విభిన్నవిధాలుగా అవలంబించబడింది.

ఆ విధంగా సర్వ మానవాళి జీవన సాఫల్యకారకమైన నిజ లక్ష్యాన్ని విడమరిచి చెప్పిన దైవగ్రంథాలన్నీ రమజాన్ మాసంలోనే అవతరించిన కారణంగా అన్ని మాసాలలో ఆ మాసం అత్యంత పవిత్రతను సంతరించుకుంది. ఈ మాసంలో దైవ కారుణ్యం కుండపోతగా కురుస్తుందని గ్రంథాలలో చెప్పబడిన కారణంగా మాత్ర గ్రంథమైన ఖురాన్ ధర్మాన్ని స్వీకరించిన వారు (ముస్లింలు) ఆ గ్రంథంలోని దైవ ఆదేశానుసారం ఆ మాసంలో ప్రత్యేక ఆరాధనలు, దాన ధర్మాలు మెండుగా ఆచరించడం ద్వారా పుణ్య ఫలాలను దండుకోటానికి ప్రయత్నిస్తారు. రమజాన్ మాసంలో ఆచరించే ఆరాధనలకు, దానధర్మాలకు ఇతర దినాల ఆరాధనల పుణ్య ఫలాలకన్నా డెబ్భైరెట్ల అధిక పుణ్యఫలం లభిస్తుందని గ్రంథాలలో చెప్పబడింది.

## ఖురాన్ గ్రంథ పారాయణం

ఖురాన్ అనే అరబీ పదానికి ఎక్కువగా పఠింపబడేది, పదే పదే పారాయణం చేయ తగ్గది అని అర్థం. అది మానవాళి ఇహ పరాల జీవన ముక్తి మోక్షానికై దైవం అవతరింప జేసిన ఒక సంపూర్ణ జీవన విధానం



చూపే గ్రంథం కావటం మూలంగా, దానిని విశ్వసించి అందులో చెప్పిన విధంగా తమ జీవితాలను గడుపుకోటానికని ఆ గ్రంథ ధర్మాన్ని స్వీకరించిన ముస్లింలు ఆ మాసంలో ఆ గ్రంథాన్ని ఎక్కువగా పారాయణం చేస్తారు. సామూహికంగా ఆ గ్రంధ శ్రవణం చేసే తరావీహ్ అనే నమాజ్‌ను ఆ మాసమంతా ఆచరిస్తారు.

ఈ గ్రంథంలో 114 అధ్యాయాలు, 6236 వచనాలు ఉన్నాయి. ఇందులో సామాజిక, సాంస్కృతిక, వైజ్ఞానిక, ధార్మిక, నైతిక, ఆర్థిక, రాజకీయ మొదలగు మానవ సమస్త జీవన రంగాలలో అనుసరణీయమైన ఒక సంపూర్ణ జీవన విధానం ఆదేశింపబడింది. దివ్యఖురాన్‌లో ఆదేశింపబడిన దైవాభీష్ట జీవన విధానాన్ని ఆచరించటానికి అల్లాహ్ యెడల భయ భక్తులు ప్రధానం. అవి అలవరుచుకోటానికి శిక్షణా కాలమే ప్రతి సంవత్సరంలో ఆదేశింపబడిన రమజాన్ మాసపు ప్రత్యేక ఆరాధనలు. వాటిలో ఉపవాసం ప్రధానమైంది.

## ఉపవాసం

ఉపవాసం దైవానికి అయిష్టమైన సకల అవిహిత చేష్టలకు దూరంగా ఉంచి మనిషి శీల నిర్మాణానికి ఉపకరించగల ఒక చక్కటి ఆరాధన. ఈ విషయంలో ఖురాన్‌లో ఇలా చెప్పబడింది. 'విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది. పూర్వ ప్రవక్తలను అనుసరించేవారికి కూడా



విధించబడింది. దీని వల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది'. (2వఅధ్యాయం 183వ వచనం). ఖురాన్‌లో మరో చోట ఇలా చెప్పబడింది. “మానవులారా! మిమ్మల్ని మీకు పూర్వ వారిని సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి” (2వ అధ్యా 21వచనం) ఆ విధంగా అందరి దైవం ఒక్కడే అనే ఈ సత్యాన్ని గ్రహించగలిగితే మానవులంతా ఒక్కటై, భేదభావం లేకుండా మనగల ఆస్కారం ఉంది. ఉపవాస దినాలలో కేవలం దైవ భీతితో ధర్మసమ్మతమైన అన్న పానీయాలకు సైతం దూరంగా ఉండగల నిగ్రహాన్ని అలవరుచుకునే శిక్షణ పొందటం ద్వారా వారి జీవితంలోని ఇతర అవిహిత కోర్కెలకు దూరంగా ఉండటం సులభతరమవుతుంది.

***జకాత్:*** ఇది సమాజంలో పేదల అవసరాలు తీర్చటానికి విధిగా చెల్లించవలసిన పైకం. ఖురాన్‌లో దీని ఆజ్ఞ ఇలా ఉంది. నమాజ్ వ్యవస్థను స్థాపించండి. పేదలహక్కు (జకాత్) చెల్లిస్తూ ఉండండి” (2వ అధ్యాయం 43వ వచనం). ఇది సమాజంలోని ధనికులకు ఆదేశింపబడిన ఆజ్ఞ. ఇస్లాంలో నమాజ్ తరువాత దీనికే అత్యధిక ప్రాధాన్యం ఉంది. తగుసంపద కలిగిన ప్రతి ముస్లిం తన వద్ద ఉన్న తగు మోతాదు వెండి, బంగారాల విలువలో ఏటా రెండున్నర శాతం ధనాన్ని నిరుపేదలకు ఇతర నిర్దేశిత అంశాలకై విధిగా (దాన ధర్మంగా కాదు) చెల్లించాలి. సాధారణంగా ఇది రమజాన్ మాసంలో చెల్లిస్తారు.

***ఫిత్రా:*** జకాత్ సమాజంలో నిరుపేదల హక్కుగా చెల్లించే ధనం. అయితే ఫిత్రా రమజాన్ మాసం ముగిసిన మరుసటి దినం ఈద్ (పండుగ) నాడు నిరుపేదలు సైతం అందరితోపాటు పండుగ ఆనందాలు పంచుకోటానికని ఇచ్చే పైకం. స్తోమత గల కుటుంబంలోని ప్రతి సభ్యునిపై తలా ఒక కిలో 750 గ్రాముల గోధుమలు గాని అనివార్య పరిస్థితుల్లో దాని విలువకు సరిపడే నగదు పైకం గాని నిరుపేదలకు పండుగ దినానికి ముందు చెల్లించాలి.

***ఘనమైన రాత్రి:*** రమజాన్ మాసంలో ఒకానొక రాత్రి ఘనమైనదనీ, ఆ రాత్రి దైవదూతలు విశ్వప్రభువు ఆజ్ఞతో భూమిపై అవతరిస్తారనీ, అలా వారు ఉదయం వరకూ ఉంటారనీ, ఆ నాటి రాత్రి ఆరాధనలు వేయి నెలల ఆరాధనల కన్నా మిన్న అయిన పుణ్యఫలాన్ని కలుగ జేస్తాయని ఖురాన్‌లో చెప్పబడిన ప్రకారం, ముస్లింలు ఆ మాసపు చివరి దశకపు బేసి రాత్రులలో ఎక్కువ సమయాన్ని ఆరాధనలలో గడుపుతారు.

***ఈదుల్ ఫితర్:*** ఎక్కువ పుణ్య ఫలాలను అందుకునే అవకాశాన్ని కలుగజేసే పవిత్ర రమజాన్ మాసాన్ని ప్రసాదించినందుకు. ఆ మాసంలో ఆరాధనలు చేసే భాగ్యాన్ని కలుగ జేసినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతగా ఆ మాసం ముగిసి, ఆ తరువాత షవ్వాల్ మాసపు తొలిరోజు ముస్లింలు పండుగ జరుపుకుంటారు. దానినే ఈదుల్ ఫితర్ అంటారు.

నిరుపేదలకు ఫిత్రా చెల్లించే పండుగ అయినందున దానికి ఆ పేరు సార్థకమయింది. ఆనాడు ఊరి బయట ప్రత్యేకించబడిన ఈద్‌గాహ్ మైదానంలో సామూహిక నమాజ్ ఆచరించి సమాజ సంక్షేమంకోసం అల్లాహ్‌ను వేడుకుంటారు.

కులమతాలకు అతీతంగా పేదలకు దానధర్మాలు చేస్తారు. బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ముస్లిం, ముస్లిమేతరుల మధ్య అనిర్వచనీయమైన పరస్పర స్నేహ సౌభ్రాతృత్వాలు పెనవేసుకున్న విశిష్ట సంస్కృతి పరిఢవిల్లుతున్న మన దేశంలో ముస్లింలు తమ ముస్లిమేతర సోదరులను విందులకు ఆహ్వానిస్తారు.

ముస్లిమేతరులు తమ ముస్లిం స్నేహితులకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతారు. వివిధ ధర్మాలు పరిఢవిల్లే మన దేశంలో ఈదుల్ ఫితర్ మన దేశపు భిన్నత్వంలో ఏకత్వం అనే విశిష్ట సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. ఆ విధంగా ఇది సామాజిక పండుగ.

*– ఎ.ఎమ్. ఫీచర్స్*




## ఒకసారి విత్తితే మూడేళ్ల పాటు పంట

ఒకసారి విత్తితే మూడేళ్ల పాటు పంట. ప్రతి రెండు మాసాలకు ఒకసారి దిగుబడి. ఇంటి పెరట్లో పది గింజలను నాటితే కుటుంబానికి సరిపోయే పప్పు. ప్రస్తుతం నెలకొన్న కంది కొరతకు ఇది తిరుగులేని విరుగుడు. కొద్దిగా నీటి వసతి, కొంత శ్రద్ధ తీసుకుంటే ఏడాది పొడవునా మార్కెట్లోకి కంది పంటను తీసుకురావచ్చు. సాధారణ రకాలకు భిన్నమైన కంది విత్తనాలను తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా విభాగం కనిపెట్టింది. ఈ విత్తనాలను రాష్ట్రానికి తీసుకురావడానికి అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అన్నీ అనుకూలిస్తే... ప్రస్తుత సీజన్ నుంచే ఈ కింది విత్తనాలు రాష్ట్రంలో సాగులోకి వచ్చే అవకాశముంది.

ప్రస్తుతం ఉన్న సాధారణ కంది రకాలైతే గింజను విత్తిన 155-165 రోజుల్లో కాపుకొస్తుంది. ఎకరానికి 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. తర్వాత మొక్కను అలాగే ఉంచినా పూత, కాయ రాదు కనుక కోసేస్తారు. వేరుశెనగ, మొక్కజొన్న, జొన్న, పత్తి వంటి పంటల్లో అంతరపంటగా కూడా కందిని సాగుచేస్తున్నారు. కంది రాష్ట్ర ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 4.5 లక్షల హెక్టార్లు. ముఖ్యంగా రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, ప్రకాశం, గుంటూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కందిని ఎక్కువగా పండిస్తారు. అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది 1.40 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే ఈ పంట సాగులోకి వచ్చింది. సాధారణంగా ఈ సమయానికి 2.21 లక్షల హెక్టార్ల విస్తీరణం సాగులోకి రావాల్సి ఉంది.

## కొత్తరకం కందిపంటలో రెండు నెలలలో కోత

దేశవ్యాప్తంగా కూడా కంది ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్లో పప్పు కొరత ఏర్పడింది. దాంతో ధరలు పెరిగాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలన్నా... అక్కడా కొరతలే! ఈ నేపథ్యంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ పర్యవేక్షణ కోసం ఏర్పాటైన మంత్రుల కమిటీ మొదటి సమావేశంలో కొత్త వంగడాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా స్వల్పకాలిక రకాలైతే ఇటు రైతులకు, అటు వినియోగదారులకు లాభదాయకంగా ఉంటుందని అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో తమిళనాడు వ్యవసాయవిశ్వవిద్యాలయం పరిధిలోని భవాని సాగర్ పరిశోధనా కేంద్రం కనిపెట్టిన కొత్త వంగడం గుర్తించి అధికారులు మంత్రులకు వివరించారు. ఈ విత్తనాలను రాష్ట్రనికి తీసుకురావానలి మంత్రులు అధికారులకు సూచించారు.

## ఇంటి పెరటిలో, గట్లపైన కూడా..

తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం భవానిసాగర్ - 1 (బీఎస్ఆర్-1) పేరిట మూడేళ్ల పాటు దిగుబడిని ఇచ్చే వంగడాన్ని కనిపెట్టింది. ప్రస్తుతం ఈ విత్తనాలతో తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో కంది పండిస్తున్నారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లోనే దీనిని వేసుకోవాలి. ఇంటి పెరట్లో, పొలం గట్లపైన కూడా దీనిని పండించడానికి వీలవుతుందని ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు రాఘవరెడ్డి చెప్పారు. ఈ విత్తనాల కోసం అక్కడి అధికారుల్ని సంప్రదించామని తెలిపారు. ఈ రకం విత్తనాలను పొలంలో నాటిన 160 రోజుల్లో మొదటి పంట వస్తుంది. తర్వాత ప్రతి రెండు మాసాలకు ఒకసారి పంట దిగుబడిని తీసుకోవచ్చు. పంటను తీసుకున్న తర్వాత మొక్కను అలాగే ఉంచి, చివరి కొమ్మలను కత్తిరించాల్సి ఉంటుంది. తర్వాత కొత్త శాఖలు వచ్చి మళ్లీ పూత, కాయ వస్తుంది. ఇలా మూడేళ్ల పాటు దిగుబడిని ఇస్తుంది. ఈ రకం పంట సాగు ఖర్చు విషయం విత్తన ధరపై ఆధారపడి ఉంది. ఫౌండేషన్ విత్తనాలు ఎక్కువ మొత్తంలో లభిస్తే వ్యవసాయశాఖ ద్వారా రైతులకు పంపిణీ చేయాలని భావిస్తున్నారు. ఒక వేళ బ్రీడర్ విత్తనాలు ఉంటే వాటిని విశ్వవిద్యాలయం క్షేత్రాల్లో సాగు చేసి ఫౌండేషన్ విత్తనాలను పండించనున్నారు. దీని వల్ల ప్రస్తుత సీజన్‌కు ఈ విత్తనాలు అందుబాటులోకి రావు. అయితే తమిళనాడు నుంచి ఎలాంటి విత్తనాలు వస్తాయనే విషయం రెండు మూడు రోజుల్లో తేలనుంది.

## రైతుల కోసం నీటివనరుల నియంత్రణ కమిషన్

సాగునీటి ప్రాజెక్టుల కింద ఇకపై ప్రతి నీటి చుక్క వినియోగం లెక్క ప్రకారమే సాగుతుంది. ఆయకట్టు చివరి భూములకు నీరు చేరకుండా నోరున్న పెద్ద రైతులు దౌర్జన్యంగా పెద్ద మొత్తంలో మధ్యలోనే నీటి వినియోగానికి పాల్పడే చర్యలకు తెరపడనున్నది. ప్రతి నీటి బొట్టూ వృధా కాకుండా సద్వినియోగం జరుగుతుంది. ఇవన్నీ రైతుల ప్రయోజనాలే

లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నీటి వనరుల నియంత్రణ కమీషన్ ద్వారా కార్యరూపం దాల్చనున్నాయి.

ఎత్తిపోతల పథకాలతో పాటు ప్రతి సాగునీటి ప్రాజెక్టు కింద నీటి లభ్యత ఆధారంగా ప్రతి ఏడాది, ప్రతి సీజన్‌కు రెగ్యులేటరీ కమిషన్ రంగాల వారీగా సాగునీరు, పట్టణ, గ్రామీణ తాగునీరు, పరిశ్రమలకు నీటి కేటాయింపులను చేయనుంది. రంగాల వారీగా బల్క్‌గా కమిషన్ చేసిన కేటాయింపుల ఆధారంగా ప్రాజెక్టు అథారిటీ (ప్రభుత్వం) ఏ ప్రాజెక్టు కింద ఏ ఏ పంటలు వేయాలనేది రైతాంగానికి సూచిస్తుంది. అలాగే డిస్ట్రిబ్యూటరీల వారీగా కూడా ఎంత నీటి వినియోగం చేయాలనేది కూడా ప్రాజెక్టు ఆథారిటీ నిర్ధారిస్తుంది.

## అమలు బాధ్యత కమిషన్‌దే

ఈ విధంగా నిర్ధారించిన మేరకు నీటి వినియోగం సక్రమంగా జరుగుతోందా లేకా ఎవరైనా, ఏ డిస్ట్రిబ్యూటరీ కిందైనా ఎక్కువ వినియోగం చేస్తున్నారా అనేది రెగ్యులేటరీ కమీషన్ పర్యవేక్షించడంతో పాటు ఆ విధంగా అమలు చేస్తుంది. ఎక్కడైనా నిర్ధారించిన నీటి కన్నా ఎక్కువగా వినియోగం జరిగితే అందుకు బాధ్యులైన ఇంజనీర్లు, అధికారులు, సాగునీటి సంఘాలపైన చర్యలను తీసుకునేందుకు కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. నీటి కాలుష్యానికి పాల్పడిన వారిపై కూడా కఠిన చర్యలకు కమిషన్ సిఫార్సులు చేస్తుంది. నిర్ధారించిన నిబంధనల మేరకు నీటి సరఫరా అయ్యేలా చూస్తున్న రైతులతో కూడిన సాగునీటి సంఘాలకు కమీషన్ సూచనల మేరకు పనిచేయని ప్రభుత్వ అధికారులపై క్రమశిక్షణా చర్యలను కూడా సిఫార్సు చేస్తుంది. ప్రతి ప్రాజెక్టు నిర్వహణ, ఆపరేషన్‌కు అయ్యే వ్యయాన్ని సూచిస్తుంది. కమీషన్ చేసిన సూచన ప్రకారం ప్రభుత్వం బడ్జెట్‌లో కచ్చితంగా నిర్వహణ, ఆపరేషన్‌కు నిధులను కేటాయిస్తుంది. ఇక వాటర్ రిసోర్సెస్ రెగ్యులేషన్ కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారి లేదా వాటర్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ రంగంలో ఇద్దరు సభ్యులు ఉంటారు. ఒక సభ్యుడు వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్‌లో నిపుణుడు, మరో సభ్యుడు వాటర్ రిసోర్సెస్ ఎకానమీకి చెందిన నిపుణుడు ఉంటారు. చైర్మన్, సభ్యుల పదవీ కాలం ఐదేళ్ళు ఉంటుంది. 65 సంవత్సరాలు పైబడిన వారు కమిషన్ చైర్మన్‌గా ఉండేందుకు అనర్హులు. కమిషన్ అవసరం అనుకుంటే ప్రత్యేక అహ్వానితులుగా ఇంజనీరింగ్, వ్యవసాయం, తాగునీరు, పరిశ్రమలు, న్యాయ, వాణిజ్యం, ఆర్థిక శాఖల్లో అనుభవం ఉన్న వారిని పిలువవచ్చు. కమిషన్ చైర్మన్, సభ్యులు మరో కార్యాలయం నుంచి ప్రయోజనాలను పొందరాదు.

## ప్రత్యామ్నాయ పంటలే ఆధారం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోఓ ప్రధాన పంటల సాగు విస్తీర్ణం బాగా పడిపోనుంది. తీవ్ర వర్షాభావంవల్ల వేసిన పంటలు ఎండిపోవడంతో పాటు, సకాలంలో వేయాల్సిన పంటల సాగు నిలిచిపోయింది. ఇప్పుడు వర్షాలు కురిస్తే జొన్న, శెనగ, పొద్దుతిరుగుడు, కంది వంటి పంటల మినహా, ప్రధాన పంటలైన పత్తి, వేరుశెనగ వంటి వాటికి పెద్దగా ఉపయోగం ఉండదు. ఖరీఫ్ సీజన్ సాగుకు సమయం ముగింపు దశకు చేరుకున్నందున ఇప్పుడు వచ్చే వర్షాలతో స్వల్పకాలిక రకాలే తప్ప... రెగ్యులర్ పంటల సాగుకు అవకాశం లేదు. తర్వాత వర్షాలు కురిస్తే ముందస్తు రబీకి వెళ్లడమే మంచిదని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పుడు వర్షాలు కురిస్తే ఏయే ప్రాంతాల్లో ఏయే పంటలు వేసుకోవాలి? తర్వాత కురిసే వర్షాలను ఆధారం చేసుకుని సాగు చేయాల్సిన పంటల వివరాలను అధికారులు రూపొందిస్తున్నారు. ఆయా జిల్లాల్లో నెలకొన్న వాతావరణ పరిస్థితులు., అక్కడి నేలల (భూమి) స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని నివేదిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ ప్రణాళికపై దృష్టి సారించింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో అమల్లోకి వచ్చిన ఈ ప్రత్యామ్నాయ ప్రణాళికను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నారు. ఇప్పుడు వర్షాలొస్తే వేలయాల్సిన పంటలకు సంబంధించి స్వల్పకాలిక రకం విత్తనాల్ని సిద్ధం చేస్తున్నారు. వీటిని 50 శాతం సబ్సిడీపై అందించనున్నారు.

## రాయలసీమలో ఉలవలు, జొన్న


రాయలసీమల జిల్లాల సాగుపై వర్షాభావం గణనీయ ప్రభావాన్ని చూపుతోంది. ఈ జిల్లాల్లో వేరుశెనగ పంటను ఖరీఫ్ సీజన్‌లో విస్తారంగా పండిస్తారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో 8 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేస్తారు. అయితే ప్రస్తుతం నెలకొన్న ప్రతికూల పరిస్థితుల కారణంగా కేవలం లక్ష హెక్టార్లు విస్తీర్ణంలోనే ఈ పంటను వేశారు. అయితే సరైన వర్షాలు లేకపోవడం వల్ల వేసిన పంట కూడా బతికే పరిస్థితి లేదు. వర్షాలొస్తే తేలికపాటి నేలల్లో ఉలవలు, ఉల్లి, కొర్ర జొన్న (ఎం-35), శెనగ, సజ్జ కంది పంటలు వేసుకోవచ్చు. అయితే ఎర్ర, నల్లరేగడి నేలల్లో పొద్దుతిరుగుడు పంటను కూడా సాగు చేసుకోవచ్చు. ఈ జిల్లాల్లో తర్వాత వర్షం కురిస్తే ముందస్తు రబీ పంటలకు వెల్లడమే మంచిదని వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రాఘవరెడ్డి అంటున్నారు.

## ఉత్తర తెలంగాణలో పొద్దు తిరుగుడే బెటర్!

ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, మెదక్, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్‌లలో ప్రస్తుతం వర్షాలు కురిస్తే పొద్దుతిరుగుడు పంటను వేసుకోవాలి. అయితే వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఉలవలను కూడా సాగుచేయవచ్చు. ఇసుక నేలలకు భిన్నంగా ఉండే ప్రాంతాల్లో స్వల్పకాలిక కందిని కూడా పండించవచ్చు.

## దక్షిణ తెలంగాణలో ఆముదం

దక్షిణ తెలంగాణలో ఆముదం సాగుకు అనుకూలం. ముఖ్యంగా




మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని నెలల్లో ఈ పంటను సాగు చేయవచ్చు. అయితే ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో కంది, పొద్దుతిరుగుడు, ఉలవలు, జొన్న పంటలకు అనుకూలమైన సమయం.

### దక్షిణ కోస్తాలో పత్తికి అవకాశం

దక్షిణ కోస్తాలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికీ పత్తి పంటను సాగు చేసుకోవడానికి అవకాశం ఉంది. అయితే గట్టి నేలల్లోనే ఈ పంటను వేయాల్సి ఉంటుంది. పత్తి, కందిని కలిపి కూడా సాగు చేయవచ్చు. అయితే నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో మాత్రం జొన్న, బొబ్బర్లు, ఉలవలు తప్ప మిగతా పంటల సాగు కష్టమే.

### ఉత్తర కోస్తాలో మొక్కజొన్న

రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పోలిస్తే ఉత్తర కోస్తాలో కొంత మెరుగైన పరిస్థితి ఉంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు కొంత మెరుగ్గా ఉన్నాయి. ఈ జిల్లాలోని సాగు విస్తీర్ణం కూడా మిగతా జిల్లాలతో పోలిస్తే కొంత నయమే. అయితే ఉభయగోదావరి జిల్లాల్లో మాత్రం వర్షాభావమే నెలకొంది. ప్రస్తుతం ఇక్కడ మొక్కజొన్న వేసుకోవడానికి అనుకూలం. అలాగే కూరగాయలు, కంది, జొన్న, మిరప, రాగి, పిల్లిపెసర వంటి పంటలను కూడా సాగు చేసుకోవచ్చు.

### కందికి మద్దతు ధర 3,500కు పెంపు

కంది పప్పు ధరలను నియంత్రించేందుకు, ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రబీలో నీటి వసతి గల రెండున్నర లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో కంది వేసేందరుకు వీలుగా మద్దతు ధరను క్వింటాల్‌కు 3,500 రూపాయలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ప్రకటించారు. నిత్యావసర సరకుల ధరల నియంత్రణపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వం కందికి మద్దతు ధర క్వింటాల్‌కు 2000 రూపాయలు ప్రకటించగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో వెయ్యి రూపాయలను కలిపి మూడు వేల రూపాయలను ప్రకటించినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు క్వింటాల్‌కు మరో 500 రూపాయలను కలిపి 3,500 రూపాయలను చేస్తున్నట్లు వివరించారు. కందిపప్పు ధర తప్ప మిగతా సరకుల ధరలు అదుపులోనే ఉన్నాయని తెలిపారు. డిమాండ్, సరఫరాలో వ్యత్యాసం వల్లే ధరలు పెరుగుతున్నాయని, మిగతా రాష్ట్రాల కన్నా మన రాష్ట్రంలో ధరలు కొంత నయంగానే ఉన్నాయని చెప్పారు. రాష్ట్రం నుంచి సూపర్‌ఫైన్ బియ్యం గాని, కందిపప్పు గాని ఇతర రాష్ట్రాలకు స్మగ్గింగ్ జరుగుతున్నాయంటే అక్కడ ఎక్కువ ధరలున్నట్లే కదా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ధాన్యం మద్దతు ధర 560 నుంచి 590 రూపాయలుంటే, గత ఐదేళ్లలో 930 రూపాయలు చేశామన్నారు. మద్దతు ధర 590 రూపాయలున్నప్పుడు బియ్యం కేజీ 10 నుంచి 12 రూపాయలకు లభ్యమయ్యేవని, ఇప్పుడు ధాన్యం మద్దతు దర 930 రూపాయలు అయ్యాక కూడా అదే కేజీ బియ్యం 10 నుంచి 12 రూపాయలుంటే అర్థం లేదని చెప్పారు. దరలు పెరగడం వల్ల పేద, సామాన్య ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే రాష్ట్రంలోని 90 శాతం మందికి రెండు రూపాయల కిలో బియ్యం సరఫరాకు సబ్సిడీగా 4000 కోట్ల రూపాయలను కేటాయించామని తెలపారు. టమోటా, వంకాయలు, బెండకాయలు, మిరపకాయలు ధరలు 2003లో ఎంత ఉన్నాయో ఇప్పుడు అంతే ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు.

## రైతుల కోసం 'ఇ-వ్యవసాయం' వెబ్‌సైట్

రైతుల కోసం 'ఇ-వ్యవసాయం' పేరుతో రాష్ట్ర వ్యవసాయశాఖ తెలుగు భాషలో సమగ్ర సమాచారంగల ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. గత అయిదేళ్లుగా వ్యవసాయరంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందుకు నిదర్శనంగా ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. అగ్రినెట్ (అగ్రికల్చరల్ రిసోర్సెస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ నెట్‌వర్క్) పేరుతో ఉన్న ఈ వెబ్‌సైట్ **(www.apagnis net.gov.in)** ను రైతులు వినియోగించుకోవచ్చు. 'ఇ-వ్యవసాయం' ద్వారా ప్రధానంగా 18 పంటలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని నెట్‌లో పొందవచ్చు. సుమారు రూ. 15 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు.

### వెబ్‌సైట్‌లోని వివరాలు

- వరి, ప్రత్తి, చెరకు, పెసలు, వేరుశెనగ, మొక్కజొన్న, కంది, ఆముదం, జొన్న, రాగి, పొద్దు తిరుగుడు, మిర్చి, మినుములు, నువ్వులు, సజ్జ, రాగి, సోయాచిక్కుడు వంటి 18 రకాల పంటల సాగు పద్ధతులను ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.
- సమగ్ర సశ్య రక్షణ విధానాలతో పాటు, అంతరసాగు, పంటల సాగు వాటివల్ల కలిగే ఉపయోగాలను విపులంగా పొందుపరిచారు.
- విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,విత్తన శుద్ధికి చేయాల్సిన విధానాలు ఉంటాయి.
- రైతుల కోసం వివిధ ప్రభుత్వ శాఖల పథకాలు, వాటి ద్వారా ఇస్తున్న రాయితీల వివరాలు సమగ్రంగా క్రోడీకరించారు.
- వివిధ పంటల కనీస మద్దతు ధరలు,రసాయన ఎరువుల సమగ్ర


సమాచారం, వినిమయ పద్ధతులు పొందుపరచారు. రోజువారీ వివిధ రకాల పంటల ధరలు తెలిపే పట్టికలు వెబ్‌సెట్‌లో ఉన్నాయి.

- రైతుల సందేహాలకు సత్వరం ఆన్‌లైన్ ద్వారా సమాధానాలందించే సౌలభ్యం కల్పించారు. అలాగే భూసార పరీక్ష ఫలితాలను కూడా ఆన్‌లైన్‌లో పొందే వీలుంది.
- వ్యవసాయ శాఖ ఎప్పుడు, ఎక్కడ ఏయే కార్యక్రమాలు చేపడుతోంది? సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్ట పెంపకానికి ప్రభుత్వం ఏ మేరకు సహాయం అందిస్తోంది? అన్న వివరాలు పొందుపరిచారు.
- రైతులకు వ్యవసాయ పనిముట్లు ఏవేవి అందుబాటులో ఉన్నాయో పేర్కొన్నారు.
- వ్యవసాయ అనుబంధ విభాగాలైన ఉద్యాన, పశుసంర్ధక, మార్కెటింగ్, పట్టు, విద్యుత్తు, సాగునీటి అటవీ శాఖలతో పాటు ఎన్.జి. రంగా విశ్వవిద్యాలయం, మార్కెఫెడ్, విత్తన ధ్రువీకరణ సంస్థ, ఏ.పి. విత్తనాభివృద్ధి సంస్థ, ఆగ్రోస్‌లతో కూడా అనుసంధానం చేసి సమాచారాన్ని అందిస్తున్నారు.
- వ్యవసాయ,అనుబంధ శాఖల్లోని అవసరమైన అధికారుల ఫోన్ నెంబర్లుఇచ్చారు.
- రైతుల విజయ గాథలకు సంబంధించి వీడియో క్లిప్పింగులు పొందుపరచారు.
- ఎరువులు, క్రిమి సంహారక మందులు, జీవ ఇంధనాలు, డి.ఎన్.ఏ, ఫింగర్ ప్రింటింగ్ పరిశోధనాశాలల వివరాలున్నాయి
- నిషేధించిన ఎరువులు, పురుగుమందుల పేర్లు, విత్తన విక్రయ సంస్థల వివరాలు పొందుపరిచారు.
- వ్యవసాయ శాఖవారి సేవలు, జాతీయ ఆహార భద్రతా మిషన్ వల్ల రైతులు ఎలాంటి సదుపాయాలు పొందవచ్చో తెలిపే అంశాలు ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకొనే వీలుంది.

## తక్కువ నీటితోనే వరి పంట రెట్టింపు?

వరి పండాలంటే మడిలో నిండా నీరుండాల్సిందే, వర్షాలు కురవకున్నా, భూగర్భజలాలు అడుగంటినా... వరి సాగు మరిచిపోవాల్సిందే. ఇకపై ఈ కష్టాలకు సెలవు! జొన్న, మొక్కజొన్న, కంది,చెరుకు పంటల్లాగానే వరి మడుల్లోనూ నీరు మాయమయ్యే అవకాశం కనిపిస్తోంది. తక్కువ నీటితోనే వరి సాగు చేసే కొత్త పద్ధతి ఒకటి రానుంది. దిగుబడి కూడా తక్కువేం కాదు.

సంప్రదాయ సాగులోకంటే రెట్టింపు దిగుబడి తథ్యమని ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టిన రైతు పరంజ్యోతి పొన్నుస్వామి చెబుతున్నారు. ఆయన




రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. గతంలో ఆయన తన పొలంలో 24 కిలోల, 12 కిలోల కాలీఫ్లవర్ సృష్టించారు.ఒక్క పుచ్చుకూడా లేకుండా 23 టన్నుల వంకాయలు పండించారు. ఇప్పుడు సరికొత్త వరిపై దృష్టి సారించారు.

మెదక్ జిల్లా సదాశివపేట మండలంలో ముభారక్‌పూర్‌లోని వ్యవసాయ క్షేత్రం దీనికి వేదికగా మారింది. నాట్లు మొదలుకుని కోతల దాకా సాంప్రదాయానికి భిన్నంగా ఈ ప్రయోగం సాగు చేస్తున్నారు. పంటకు కేవలం రోజుకు పది నిమిషాలు నీరు పెడుతున్నారు. సాధారణంగా వరి నార్లను నాలుగైదు మొక్కలను కలిపి ఒకే చోట మడిలో పాతుకుంటూ వెళ్తారు. ఈ ప్రయోగంలో ఒక్కో వరి మొక్కను మాత్రమే దూరం దూరంగా నాటాలి. సాంప్రదాయ పంటకు ఎకరాకు 20 నుంచి 30 కిలోల విత్తనాలు అవసరమైతే ఇందులో రెండు నుంచి మూడు కిలోలు సరిపోతాయి. సాధారణంగా పంట దిగుబడి ఎకరాకు 40 నుంచి 50 క్వింటాళ్లకు ఉంటుంది. ఈ ప్రయోగంలో వంద క్వింటాళ్లకు పైగా దిగుబడి సాధించవచ్చని పొన్నుస్వామి చెబుతున్నారు.

నెల రోజుల క్రితం ఈ పద్ధతిలో వరి నాట్లు వేశారు. అవి చక్కగా పెరుగుతున్నాయి. పొలంలో ఒక భాగానికి డ్రిప్ పద్ధతిలో నీరు అందిస్తుండగా...మరో భాగంలో ఇతర మొక్కల పెంపకంలాగా నీరు పెడుతున్నారు. తన ప్రయోగం నూటికి నూరు పాళ్లు విజయవంతమవుతుందని రైతు పొన్నుస్వామి గట్టిగా చెబుతున్నారు "ఒక్కో వరి మొక్క విడిగా నాటడం వల్ల గాలి, వెలుతురు, సూర్యరశ్మి, నీరు అవసరమైనంత మేరకు అందుతాయి. రైతులకు ఎరువులు కూడా తక్కువగా అవసరమవుతాయి. పంట కాలం మాత్రం సాధారణంగా ఐదు నెలలు ఉంటుంది" అని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం చేసి మరో మూడు నాలుగు నెలల్లో రాష్ట్ర రైతులకు శుభవార్త అందిస్తానని చెప్పారు. కరువు పరిస్థితుల నుంచి బయటపడేసే ఈ ప్రయోగం విజయవంతమైతే.. అంతకు మించిన ఆనందం ఉండదని చెప్పారు. **- సంకలనం: టి. నర్మద**

# ఎందరో మహానుభావులు

**మానవజన్మ ఎత్తినందుకు కొంతమంది సహృదయులు తమ జన్మలను సార్థకం చేసుకునేందుకు కొన్ని రంగాలను ఎంచుకొని ఆ రంగాలలో తమకు వీలైనంతవరకు మానవాళికి సేవ చేస్తుంటారు. కొందరు విద్యా రంగాన్ని ఎంచుకుంటే, కొందరు వైద్య రంగాన్ని మరికొందరు వేరొక రంగాన్ని, ఎంచుకుని ఆ రంగంలో తమ చుట్టూ ఉన్న వారికి సహాయ పడుతుంటారు.**

ఆంధ్రప్రదేశ్‌లో అటువంటి సేవా దృక్పథం కల్గిన కొద్ది మందిలో డాక్టర్.బి.సోహన్‌సింగ్ ఒకరు. గడిచిన 35 సంవత్సరాలుగా రాష్ట్రంలో డా.సోహనసింగ్ గారు హోమియోపతి వైద్యరంగానికి అనేక విధాల్లో సేవలందిస్తున్నారు.

డాక్టర్. సోహన్‌సింగ్ గారు ధర్మ కిరణ్ ట్రస్టును ఏర్పాటు చేసి, ఆ ట్రస్టు ద్వారా ప్రభుత్వ హోమియో సంస్థలకు రూ. 50 లక్షలకు పైగా ఆర్థిక సహాయం చేసినారు. హోమియో డాక్టర్లకు, రీసెర్చి విభాగాలకు తనవంతు సహాయం అందించారు.

## ఆయన చేసిన ఆర్థిక సహాయాలు

జె.ఎస్.పి.ఎస్. గవర్నమెంటు హోమియో మెడికల్ కళాశాలకు అనుబంధంగా 110 పడకల హోమియో హాస్పిటల్ భవన నిర్మాణానికి ఆయన ఆర్థిక సహాయం చేసారు.ఆ హాస్పిటల్ అభివృద్ధి చెందిన పిమ్మట కేంద్రప్రభుత్వం వారు దానిని 2004-05 సంవత్సరంలో మోడల్ కాలేజ్ సెంటరుగా గుర్తించి రూ.3 కోట్లను దాని అభివృద్ధికి ఆర్థిక సహాయం చేశారు.

గుడివాడ, హైదరాబాదు, కడప, హోమియో కళాశాలల ప్రాంగణాలలో హోమియోవైద్య మూల పురుషుడైన డా. సామ్యూల్ హాన్‌మాన్ శిలా విగ్రహస్థాపనకు డాక్టర్ సోహన్‌సింగ్ ధన సహాయం చేశారు.



డాక్టర్ సోహన్‌సింగ్

కడపలోని ప్రభుత్వ హోమియో కళాశాలలో సమావేశ హాలు నిర్మాణానికి రూ.50,000, గుడివాడ హోమియో కళాశాల భవన నిర్మాణానికి రూ.1.50 లక్షలు, రాజమండ్రిలోని ప్రభుత్వ హోమియో కళాశాలకు రూ.1.00 లక్ష, విజయవాడలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు హోమియో రోగుల కొరకై రూ. 50,000 ఆయన ధన సహాయం చేశారు.

డాక్టర్ సోహన్‌సింగ్‌గారు హైదరాబాద్ లోని ప్రభుత్వ హోమియో హాస్పిటల్ వద్ద ఒక హోమియో ఫార్మసిని ప్రారంభించారు. భారత ప్రభుత్వం ఈ ఫార్మసీకి రూ.85 లక్షలు ఆర్థికసాయం చేసింది. ఆ నిధులతో ఫార్మసీని అభివృద్ధి పరచారు.

ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖరరెడ్డి గారు 3-10-2004న ఆ ఫార్మసీని లాంచనంగా ప్రారంభించారు. ఆ సమయంలో డా. రెడ్డి గారు శ్రీ సోహన్‌సింగ్ సేవలను కొనియాడారు. పిమ్మట హైదరాబాద్‌లోని ప్రభుత్వ హోమియో హాస్పిటల్ పేరును ధర్మకిరణ్ ప్రభుత్వ హోమియో హాస్పిటల్‌గా మార్చారు.

ప్రొ. సోహన్‌సింగ్ గారి కృషివలన హైదరాబాద్, రాజమండ్రి, గుడివాడ, కడపలలోని ప్రభుత్వ హోమియో కళాశాలకు కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. రాష్ట్రంలోని హోమియోపతి డిగ్రీలకు - బి.హెచ్.ఎమ్.ఎస్, మరియు ఎం.డి (హెచ్) గుర్తింపు లభించింది. ఇవిగాక, ఆంధ్రా యూనివర్సిటీ, నాగార్జున యూనివర్సిటీలు ఇచ్చే డిగ్రీలకు గుర్తింపు, ఇంకను రాష్ట్రంలోని వివిధ హోమియోపతి కోర్సులకు గుర్తింపు లభించింది.

డా. సోహన్ సింగ్ రాష్ట్రంలో ప్రారంభించిన బి.సి.టి. ప్రోగ్రాం విజయవంతమైనది. ఈ ప్రోగ్రాం వలన రాష్ట్రంలో 'జపనీస్ ఎన్సెఫలిటీస్' వ్యాధి చాల వరకు అరికట్టబడినది. ఈ కార్యక్రమంలో దాదాపు 3 కోట్ల






మంది పిల్లలకు బి.సి.టి. మందు ఇవ్వబడింది. దీనికి సంవత్సరానికి రూ.17లక్షలు మాత్రమే ఖర్చు అయినది.

గడిచిన 35 సంవత్సరాలుగా డాక్టర్.సోహన్‌సింగ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను, అటు కేంద్ర ప్రభుత్వ విభాగాలకు హోమియోపతి వైద్యరంగంలో డాక్టర్లు, ఇతర ఉదోగ్యుల సంఘాలకు ప్రతినిధిగా, కార్యదర్శిగా, అధ్యక్షుడిగా అనేక పదవులను విజయవంతంగా నిర్వహించారు.

## జననం, కుటుంబ విషయాలు...

రాష్ట్రంలో హోమియోపతి రంగానికి అకుంటిత సేవలందించిన డాక్టర్ సోహన్‌సింగ్ కృష్ణాజిల్లాలోని గుడివాడ తాలూకాలో రావులపాడు గ్రామంలో 1947వ సంవత్సరంలో జన్మించారు. ఆయన తండ్రి కీ.శే. వేణుగోపాలరావు గారు స్వాతంత్ర సమర యోధులు. ఆయన తన పిల్లలకు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న విప్లవకారుల పేర్లను పెట్టారు.

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, రచయిత స్వర్గీయ తాపీ ధర్మారావు గారి మనుమరాలు శ్రీమతి విమల గారు డాక్టర్ సింగ్ గారి సతీమణి.

డాక్టర్ సింగ్‌గారి పుత్రిక, అల్లుడు గారు కూడ అదే సేవా స్ఫూర్తితో పనిచేస్తున్నారు.

రాష్ట్రంలో హోమియోపతి రంగానికి, దాని అభివృద్ధికి 35 సంవత్సరాలుగా సేవలందించిన డాక్టర్ సోహన్‌సింగ్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ హోమియో హాస్పిటల్ సూపరింటెండెంటుగా పదవీ విరమణ చేశారు.

పదవీవిరమణ చేసిన పిమ్మట కూడ నగరంలో 10 పడకల హోమియో హాస్పిటల్‌ను స్థాపించి, రిసెర్చి విభాగమునకు తోడ్పడుతున్నారు. ఇతర వైద్యశాఖల నుండి కూడ రోగుల డాక్టర్ సింగ్‌గారి దగ్గరకు వైద్య సహాయానికై వస్తారు.తన వద్దకు వచ్చే రోగుల నుండి నామమాత్రపు ఫీజు తీసుకుని ఆయన వైద్య సేవలందిస్తారు.

డాక్టర్ సోహన్ సింగ్‌గారు హైదరాబాద్ లో జూబ్లీహిల్స్, అంబరుపేట, కూకట్‌పల్లిలోని హెచ్.బి కాలనీలలో తన ఆస్తులను అమ్మి రాష్ట్రంలోని ప్రభుత్వ హోమియో హాస్పిటల్స్ భవనాల నిర్మాణానికి, లేబరేటరీల నిర్మాణానికి ఇతర సదుపాయాలు కలుగచేయటానికి ఆర్థిక సహాయం చేశారు.రాష్ట్రంలో హోమియోపతి వైద్యరంగ అభివృద్ధికి డార్టర్ సోహన్ సింగ్ చేసిన సేవలు హర్షదాయకం, ముదావహం.

– పి.చంద్రశేఖర్






గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖర్‌రెడ్డి,. మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గార్లతో...




ప్రొ. సోహన్ సింగ్ గారి ఆర్థిక సహాయంతో నిర్మింపబడ్డ ప్రభుత్వ హాస్పిటల్ భవనాన్ని ప్రారంభిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖర్‌రెడ్డి.



# హెూమియో వైద్యం ఎందుకు మంచిది ?

– డాక్టర్ బి. సోహన్ సింగ్

1. హెూమియో మందు వాడుతున్నప్పుడు ఎటువంటి పత్యము చేయనవసరం లేదు. ఈ మందులు వేడి చేయవు. చికిత్సా విధానం నిదానం కాదు. వ్యాధి ఎక్కువై తగ్గుతుంది అనేది అపోహ మాత్రమే.
2. హోమియో మందులు సేవించటం చాలా సులభం, సుఖం. రోగుల సమగ్ర వ్యక్తిత్వాన్ని తెలుసుకొని శాస్త్రీయ పద్ధతిలో అన్ని వ్యాధులకు కావలసినవి కొని వందల సంఖ్యలో విదేశాల నుండి తెప్పించినవి కూడా ఉంటాయి.
3. హోమియోమందు శరీరంలో ఉన్న "వ్యాధి నిరోధక శక్తిని" (Resistance Power) పెంచి తద్వారా వ్యాధి నిర్మూలన చేయును. ఈ పద్ధతి మరే ఇతర వైద్య విధానాలలోను లేదు.
4. రోగి శారీరక బాధలనే కాక, వాటి వెనక ఉన్న మానసిక, జీవరుగ్మతలు సైతం హోమియో మందు నిర్మూలన చేస్తుంది.
5. ఆపరేషన్ తప్పదనుకొన్న చాలా వ్యాధులకు దాని అవసరం లేకుండానే స్వస్థత పొందే అవకాశం ఉంది.
6. ఇతర మందులకు తగ్గని మొండి వ్యాధులకు సైతం హోమియో వైద్యం ద్వారా ఉపశమనం లభిస్తుంది.
7. ఇతర మందులవలె హోమియో మందులకు (Side Effects) దుష్ఫలితాలు ఉండవు.
8. చిన్న పిల్లల సమస్యలకు హోమియో మందులు వాడితే యెడల భవిష్యత్తులో రాబోయే వ్యాధులనుండి కాపాడటమే కాక వారిని సరియైన మార్గంలో పెట్టే అవకాశం ఉంది.

వివరణ : జలుబు మామూలు స్థాయిలో కలిగినప్పుడు ఒక రంధ్రం నుంచి లేదా రెండు రంధ్రాల నుంచి ముక్కు కారడం సంభవించవచ్చు. ముక్కు కారడమనేది దాదాపు నీరు కారినట్టుగా వుంటుంది. లేదా శ్లేష్మం (చీమిడి) పడిశంతో, రక్తంతో లేదా చీముతో కారవచ్చు.

### : మామూలు జలుబు మొదటి దశ :

**లక్షణాలు :** 1. ముక్కు కారడం, జిలపెడుతుంటుంది. తుమ్ములు వస్తాయి.

- **వాడవలసిన మందు, వాడకం – ఆర్సెనిక్ ఆల్బ్.** ఇబ్బంది (బాధ) తీవ్రతను బట్టి ప్రతి మూడు గంటలకు ఒకసారి డోస్ వేసుకోవాలి.

2. జలుబుతో ముక్కు బాగా కారడం, చల్లగాలి తగిలితే మంట కొద్దిగా తగ్గినట్లుగా ఉపశమనం. తుమ్ములు.

- **వాడవలసిన మందు, వాడకం – ఎలియం సిపా.** ప్రతి రెండు నుంచి నాలుగు గంటలకు ఒకసారి డోస్ తీసుకోవాలి.

3. పిల్లలలో పడిశం చిక్కబడితే ముక్కు స్తంభించుతుంది. ముక్కు రంధ్రాల నుంచి ధ్వనులు వస్తాయి.

- **వాడవలసిన మందు, వాడకం – నక్స్ వామికా.** ప్రతి మూడు గంటలకు ఒక డోస్ వేసుకోవాలి.

**వివరణ :** జలుబు మామూలు స్థాయిలో కలిగినప్పుడు ఒక రంధ్రం నుంచి లేదా రెండు రంధ్రాల నుంచి ముక్కు కారడం సంభవించవచ్చు. ముక్కు కారడమనేది దాదాపు నీరు కారినట్టుగా వుంటుంది. లేదా శ్లేష్మం (చీమిడి) పడిశంతో, రక్తంతో లేదా చీముతో కారవచ్చు.

**రెండవ దశ :** (పడిశం బాగా చిక్కబడి ముదురు తెలుపు లేదా పసుపు రండు లేదా ఆకుపచ్చ రంగులోకి వచ్చినప్పుడు)

**లక్షణాలు :** 4. ముదురు పసుపు లేదా ఆకుపచ్చ రంగులో చిక్కగా పడిశం కారడం (చీమిడి తీగగా సాగుతుంది).

- **వాడవలసిన మందు, వాడకం – కాలిబిచ్ (కాలీబైక్రోమ్** ప్రతి మూడు గంటలకు ఒక డోస్ తీసుకోవాలి.

5. ముక్కు నుంచి ఆకుపచ్చ/పసుపు రంగుతో పడిశం కారడం, కఫం పడటం, ఆహారం రుచి తెలియకపోవడం.

- **వాడవలసిన మందు, వాడకం – పల్సటిల్లా.** ప్రతి మూడు గంటలకు ఒక డోస్ తీసుకోవాలి.

### : సైనసైటీస్ :

**వివరణ :** సైనస్‌లలో విపరీతమైన నొప్పి/బాధ కలిగితే తలనొప్పి వస్తుంది. ముక్కు రంధ్రాలు ఏదో ఒకటి లేదా రెండూ స్తంభించుతాయి. శ్లేష్మం (గట్టి పడిశం) గూడు కడుతుంది.) ఆకుపచ్చ రంగులో వుంటుంది. అరచేతులలో చెమట వస్తుంది.

**లక్షణాలు :** 1. ఈ రుగ్మత తొలి దశలో

- **వాడవలసిన మందు, వాడకం – బెల్లడోనా, మెర్క్‌సాల్** ఈ రెండు మందులను ఒకటి విడిచి ఒకటి ప్రతి రెండు గంటలకు ఒకసారి ఒక డోస్ చొప్పున తీసుకోవాలి.

2. తలనొప్పి ఉన్నా లేకున్నా సైనస్‌లు జలుబుతో వున్నప్పుడు; పడిశంతో రక్తపు ఆనవాళ్ళు కనిపించినప్పుడు.

- **వాడవలసిన మందు, వాడకం – కాలిబిచ్ (కాలీబైక్రోమ్)** ప్రతి మూడు గంటలకు ఒకసారి ఒకడోస్ వేసుకోవాలి.

3. కుడివైపు సైనస్ బాధకు గుర్తై కుడివైపు తలనొప్పి కలిగినప్పుడు

- **వాడవలసిన మందు, వాడకం – సాంగ్యునేరియా** ప్రతి రెండు గంటలకు ఒకసారి ఒకడోస్ వేసుకోవాలి.

4. ఎడమవైపు తలనొప్పితో ఎడమవైపు సైనస్ గురయినప్పుడు

- **వాడవలసిన మందు, వాడకం – స్పైజీలియా** ప్రతి రెండు గంటలకు ఒక డోస్.

5. చలిగాలి వల్ల రోగి ఇబ్బంది పడుతున్నా, తలకు గుడ్డ కట్టుకొని బాధ పడుతున్నప్పుడు

- **వాడవలసిన మందు, వాడకం – సిలికా** ప్రతి మూడు గంటలకు ఒక డోస్ వేసుకోవాలి.

## : దగ్గు :

**వివరణ :** ఊపిరితిత్తుల నుంచి అకస్మాత్తుగా గొంతు నుంచి వెలుపలికి వచ్చు గాలిని దగ్గుగా వర్ణించవచ్చును. ఇది పొడి దగ్గుగా లేదా ఖళ్ ఖళ్ మని శబ్దం వచ్చునదిగా వుంటుంది.

**లక్షణాలు:** పై భాగపు శ్వాస అవయవ అంటువ్యాధికి సంబంధించి)

1. తొలిదశలో ముక్కులేదా ముక్కు పైభాగమున దగ్గుతో కూడిన జలుబు
   - **వాడవలసిన మందు, వాడకం – బెల్లడోనా, మెర్క్‌సాల్.** ప్రతి రెండు గంటలకు ఒక దాని తర్వాత ఒకటి.
2. ముక్కు నుంచి చుక్కలు చుక్కలుగా పడిశం పడుట
   - **వాడవలసిన మందు, వాడకం – మెర్క్‌సాల్.** ప్రతి రెండు గంటలకు ఒక డోస్.
3. సైనస్‌లో నొప్పితో పాటు దగ్గుకు సైనస్‌ల వాపు నివారణ మందులు వాడితే దగ్గు కూడా తగ్గుతుంది.
   - **సాంగ్యునేరియా, సిలికా, మెర్క్‌సాల్, స్పైజీలియా మొ॥**

### : శ్వాస నాళికల సంబంధిత దగ్గుకు :

1. ఆగి ఆగి దగ్గు, తుమ్ములతో పెద్ద ధ్వనితో వచ్చినప్పుడు
   - **వాడవలసిన మందు, వాడకం – ఇపికాక్.** నాలుగు గంటలకు ఒక డోస్.
2. చాలా నెమ్మది ధ్వనులతో దగ్గు, మన ఊహకు అందనంత కష్టముతో వస్తున్నప్పుడు
   - **వాడవలసిన మందు, వాడకం – యాంటీమ్ టార్ట్.** ప్రతి మూడు గంటలకు ఒక డోస్.

## : కోరింత దగ్గు :

**(ఊపిరితిత్తుల నుంచి అకస్మాత్తుగా గాలి విడుదలై కోరింత దగ్గు వస్తుంది) వివరణ :** దీనినే కక్కాయ దగ్గుకూత అంటారు. తెరలు తెరలుగా, పక్షికూత వలె భయం కలిగిస్తూ, శ్వాసను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ఇది బాక్టీరియా క్రిముల ద్వారా సంక్రమిస్తుంది. అయిదేళ్ళలోపు పిల్లలలో అధికశాతం వస్తుంది. ఇది ఒక అంటువ్యాధి కూడా. ఈ రుగ్మత గల వారికి సాన్నిహిత్యంగా వున్నా ఈ వ్యాధి వస్తుంది. జలుబు, జ్వరంతోను, ముక్కు బాగా కారడంతోనూ మొదలై రెండు వారాల తర్వాత ఊపిరి సల్పని దగ్గు తెరలు తెరలుగా వచ్చి శ్లేష్మ (కఫం/ తెమడ) పడుతుంది. దగ్గు తెరల తర్వాత వాంతులు వస్తాయి. విపరీత నీరసం వస్తుంది. పిల్లలకు రెండు మాసాలు నిండకముందే టీకాలు వేయించాలి. 2వ, 8వ మాసం వయసులో డి.పి.టి. వేయించాలి.

**లక్షణాలు :** 1. తొలి దశలో

- **వాడవలసిన మందు, వాడకం – డ్రోసెరా.** 3 డోసులు ఇవ్వాలి.

2. వాంతులు అవుతూ, ఆహారం ఇమడని పక్షంలో
   - **వాడవలసిన మందు, వాడకం – ఇపికాక్.** ప్రతి 3 గంటలకు ఒక డోస్.
3. పైన చెప్పిన మందులతో ఉపశమనం కలగకపోతే (దగ్గు తీవ్రంగా ఉండి, వాంతులు తోడైతే)
   - **వాడవలసిన మందు, వాడకం – కార్బోవెజ్.** ప్రతి ఆరు గంటలకు ఒక డోస్.

## : అస్తమా :

**వివరణ :** ఉబ్బసం అని కూడా అంటారు. శ్వాస నాళికలలో తీవ్ర వ్యతిరేక ప్రభావం కలగడంతో ఆయాసం, ఛాతిలో పిల్లి కూతలు వస్తాయి. శ్వాస నాళికలు ముడుచుకుపోయి సన్నగిల్లినందువల్ల ఈ అస్వస్థత వస్తుంది. వంశపారంపర్యంగా కూడా రావచ్చును. ఊపిరి పీల్చుకొనుటకు ఊపిరితిత్తులతో పోరాటం చేయవలసి వస్తుంది. ఛాతిలో ఒత్తిడి ఏర్పడినట్లు బాధపడవలసి వస్తుంది. చలికాలం, వర్షాకాలంలో ప్రత్యేకంగా రాత్రి సమయాలలో ఈ బాధ పెరుగుతుంది.

**లక్షణాలు :** 1. పిల్లలలో ఈ వ్యాధి వచ్చి వాంతులు చేసుకుంటున్నా ఛాతి ఎగసిపడుతున్నా

- **వాడవలసిన మందు, వాడకం – ఇపికాక్.** ప్రతి రెండు గంటలకు ఒక డోసు ఆర్స్ అల్బ్.

2. అర్ధరాత్రి తర్వాత అస్తమా ఎక్కువైతే
   - **వాడవలసిన మందు, వాడకం – ఆర్సెనిక్ అల్బ్.** ప్రతి రెండు గంటలకు ఒక డోస్.

## : తలనొప్పి :

**వివరణ :** శిరోభారం, తల పైభాగం కపాలంలో నొప్పి, రెండు వైపుల కూడా బాధ ఉండవచ్చును. లేదా ఒక వైపున బాధ వుంటే పార్శ్వపు నొప్పి అంటారు. కారణాలు అనేకం ఉండవచ్చును. అజీర్ణం, మలబద్ధకం, మానసిక అశాంతి, విపరీతమైన జలుబు, రక్తంలో దోషం, కీళ్ళవాతం, ఉత్తేజం కలిగించే మందుల వాడకం, అలసట/బడలిక మొ॥ పలు కారణాలు.

**లక్షణాలు :** 1. కుడివైపు తలనొప్పి ముఖ్యంగా కుడి కంటికి మిదుగా వస్తుంటే (వాంతులు రావచ్చును)

- **వాడవలసిన మందు, వాడకం – సాంగ్యునేరియా.** ప్రతి రెండు గంటలకు ఒక డోసు. బాధ తగ్గితే రెండు గంటలకు ఒక డోసు.

2. కంటి గుంటల (కళ్ళమిద పాలభాగం–నుదుటి) మీద తలనొప్పి, తల వెనుకభాగం నుంచి తల చుట్టూ నొప్పి వుండి, తలకు గుడ్డ కట్టుకుంటే ఉపశమనం కలిగినట్టుగా ఉంటే
   - **వాడవలసిన మందు, వాడకం – సిలికా.** ప్రతి రెండు గంటలకు ఒక డోస్.
3. ఎడమవైపు తలనొప్పికి
   - **వాడవలసిన మందు, వాడకం – సిలికా.** ప్రతి రెండు గంటలకు ఒక డోస్.
4. తలనొప్పి వచ్చే ముందు కంటిచూపు మందగించినట్లయితే
   - **వాడవలసిన మందు, వాడకం – స్పైజీలియా.** ప్రతి గంటా రెండు గంటల వ్యవధిలో, నొప్పి తీవ్రతను అనుసరించి ఒక డోస్.
5. వడగాడ్పు వలన తలనొప్పి వచ్చినప్పుడు; ఎండ ప్రభావంతో వచ్చే జ్వరం, తలనొప్పి, అసౌఖ్యాలకు మేలైన నివారణకు
   - **వాడవలసిన మందు, వాడకం – సాంగ్యునేరియా.** ప్రతి రెండు గంటలకు ఒక డోస్. ❑

# 'అపార్డ్' కి ఐఎస్‌వొ 9001 : 2008 సర్టిఫికెట్

**రా**ష్ట్రంలోని గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖల అధికారులకు, సిబ్బందికి సంబంధిత సంస్థల్లో పనిచేసే అధికారులు, సిబ్బందికి నిరంతర శిక్షణ ఇస్తూ, పంచాయితీరాజ్ సంస్థల బలోపేతానికి, గ్రామీణాభివృద్ధికి దోహదపడుతున్న ఎలిమినేటి మాధవరెడ్డి ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎఎమ్ఆర్–అపార్డ్) కు ఐఎస్‌వొ 9001: 2008 సర్టిఫికెట్ లభించింది. ఆగష్టు 6న ఇంగ్లాండ్ లోకి గార్డియన్ ఇండిపెండెంట్ సర్టిఫికెట్ లిమిటెడ్ ఈ సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది.

**వార్తల్లో 'అపార్డ్'**

పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఇతర ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మొదలైన వాటిలో పనిచేసేవారి సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని పెంచడం ద్వారా, సుస్థిరాభివృద్ధికి కృషి చేస్తున్నందుకు 'అపార్డ్'కు ఈ సర్టిఫికెట్ ఇస్తున్నట్లు గార్డియన్ ఇండిపెండెంట్ సర్టిఫికెట్ లిమిటెడ్ సంస్థ ప్రకటించింది. ❑



GUARDIAN INDEPENDENT CERTIFICATION

CERTIFICATE OF REGISTRATION

The Management System of

ALIMINETI MADHAVA REDDY ANDHRA PRADESH ACADEMY OF RURAL DEVELOPMENT

Rajendranagar, Hyderabad - 500 030, Andhra Pradesh, India

has been assessed and complying with

ISO 9001:2008

for the following activities

Providing Capacity Building Services To The Functionaries Of Panchayati Raj, Rural Development And Other Government Departments, Private Companies And NGOs For Achieving Sustainable Development.

Date of Issue: 06 August 2009 Date of Expiry: 05 August 2012

Initial Certification: 06 August 2009

Certificate No. 649923

The validity of this certificate can be verified from the following website www.gicg.co.uk

Guardian Independent Certification Ltd

JAS-ANZ

IAF

106862

## రాష్ట్రంలో ఉపాధి హామీ పథకానికి రూ.6000 కోట్లు

**మన** రాష్ట్రానికి వర్తమాన ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం ప్రకారం రూ.6వేల కోట్లు నిధులు మంజూరయ్యాయని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ వట్టి వసంతకుమార్ వెల్లడించారు. ఈ నిధులు పూర్తిగా సద్వినియోగమయ్యే విధంగా, కూలీలందరికీ సరైన క్రమపద్ధతిలో కూలీలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకుంటామని, ఆవకతవకలు, అక్రమాలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి హెచ్చరించారు.

గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు, స్వయం సహాయ మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా, వెంటనే ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శాఖాపరంగా వచ్చే ఫిర్యాదులను ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌ద్వారా స్వీకరిస్తామని, వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని అయన చెప్పారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల విషయంలో వస్తున్న ఫిర్యాదులను స్వీకరించేందుకే ఈ ఏర్పాటు చేశామని మంత్రి వివరించారు. వ్యవసాయ పనులు తక్కువగా ఉన్న ప్రాంతాలలో ఉపాధిహామీ పనులు విరివిగా జరిగే విధంగా, వలసలు నివారించే విధంగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. వ్యవసాయ పనులకు ఆటంకం కలుగని రీతిలో గ్రామసభలోనే ఉపాధిహామీ క్యాలెండర్ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ పనుల ద్వారా ప్రతీరోజూ కూలీ రూ.100 వచ్చే విధంగా నిబంధనలలో మార్పులు తెచ్చామని, గ్రామీణ ప్రాంతాలలోని కూలీలందరూ నిబంధనలను అర్థం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ పనులు మందకొడిగా జరుగుతున్న గిరిజన ప్రాంతాలలో ఉపాధిహామీ పనులు నూరు రోజులు మాత్రమే నిర్వహించాలన్న నిబంధనలను సడలించామని, ఆ ప్రాంతాలలో నూరునుండి నూటాయాభై రోజుల పాటు పనులు జరిగే విధంగా ఆదేశాలు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలోని టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్‌లతో కుమ్మక్కై కొందరు ఉపాధీహామీ పనులలో అవినీతికి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, ఇలాంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చామని గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి చెప్పారు. ఇక నుండి సామాజిక తనిఖీలను ప్రతీ సంవత్సరం రెండుసార్లు నిర్వహిస్తామని, ఈపద్ధతిలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. పని అడిగే ప్రతీ కూలికి తప్పకుండా పని కల్పించాలని స్పష్టంగా క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని ఆయన చెప్పారు.

– *ఆర్.కె.*

# ఆదివాసుల ఆటపాటలను కాపాడుకుందాం

**భాష సంస్కృతికి ప్రాణం. సంస్కృతి సమాజానికి ఊపిరి. సంస్కృతిని తరతరాల పాటు కొనసాగించటంలో లిపి చాలా ప్రాముఖ్యమైన పాత్ర వహిస్తుంది. లిపి లేని భాషలకు పాటలే ప్రాణం. సహకార వాయిద్యాలతో, నృత్యాలతో పాడే పాటలు ఆయా సమాజాల సంస్కృతిని ఒక తరం నుంచి మరో తరానికి అందిస్తాయి. అందువల్ల లిపి లేని భాషల సంస్కృతిపై బయటి సంస్కృతి ప్రాబల్యం ఎక్కువ అయితే, మొట్టమొదటగా దెబ్బ తినేది పాట. తద్వారా అంతరించేది సంస్కృతి. సంస్కృతి అంతరించిన సమాజంలో వ్యక్తులు మాత్రమే మిగులుతారు. ఇప్పటికే మన రాష్ట్రంలోని గిరిజన సమాజాల్లో పాట అంతరించిపోయే ప్రమాద సూచికలు కనిపిస్తున్నాయి.**

యువతరంలో సంస్కృతి గురించి అవగాహనలోపం స్పష్టంగా కనిపిస్తోంది. గిరిజన భాషలపై కృషి వంద సంవత్సరాల పూర్వం గిడుగు వారు చేస్తే, గిరిజన భాషలను కాపాడే కృషి ఈ మధ్యనే మళ్ళీ ప్రారంభం అయ్యింది. ఆగష్టు 29, 2009 నాడు గిడుగు వారి 146వ జయంతి సందర్భంగా గిరిజన భాషలపై ఇంతవరకు జరిగిన, ఇప్పుడు జరుగుతున్న కృషి ఈ వ్యాసంలో చర్చిద్దాం. అయితే ఈ వ్యాసంలో కొంతమంది చేసిన కృషి ప్రస్తావనే జరిగింది. అంత మాత్రాన వేరే వారు కృషి చేయలేదని కాదు.



రావ్ సాహెబ్ గిడుగు వెంకట రామమూర్తి

## వంద సంవత్సరాల క్రితం

వ్యావహారిక భాషా ఉద్యమానికి ఆద్యుడైన గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారు 29, ఆగష్టు, 1863న విశాఖ పట్నం దగ్గరున్న పర్వతాల పేటలో జన్మించారని వారి కుమారుడైన గిడుగు సీతాపతిగారు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. అతి చిన్న తనంలోనే తండ్రిని కోల్పోయినా కూడా, ఎంతో కష్టపడి మెట్రిక్యులేషన్ వరకు చదివారు. ఆ తరువాత ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఉద్యోగాన్వేషణ జరిపారు. వారి సమకాలీకులైన గురజాడ అప్పారావు గారు మాత్రం ఉన్నత విద్య అభ్యసించగలిగారు. పర్లాకిమిడి (అప్పట్లో ఈ ప్రాంతం సంయుక్త వైజాగ్ పట్నం జిల్లాలో భాగం. ఇప్పుడు ఒరిస్సాలో ఉంది) రాజు గారి పాఠశాలలో నెలకు 30 రూపాయలు జీతంతో 1880లో మన్యప్రాంత ప్రవేశం చేశారు.

## గిరిజన భాషలపై తరతరాల కృషి

అంటే ఇప్పటికి 129 సంవత్సరాల క్రితం విషయం అన్నమాట. ఈ రోజుల్లో కూడా మన్యప్రాంతాలలో ఉద్యోగాన్ని తప్పించుకోవాలని అందరూ ప్రయత్నిస్తుంటే, వంద సంవత్సరాల క్రితం ఆ ప్రాంతాలలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టడం ఎంతో గొప్ప విషయం. అదే కాకుండా, ఆ ప్రాంతంలోనే 1936 వరకు అంటే సుమారు 56 సంవత్సరాలు వారు నివసించటం మరో విశేషం. ఇదే వారి చారిత్రాత్మక కృషికి దోహదం చేసిందని భావించవచ్చు. ఆయా మన్య ప్రాంతాలలో ఉపాధ్యాయ వృత్తి కొన సాగిస్తూన్నప్పుడు, సవరజాతి గిరిజనుల దుస్థితిని చూసి చలించిపోయారు. వారి కోసం బడులను సొంత ఖర్చు మీద పెట్టి, తరువాత ప్రభుత్వంతో పోరాడి 1900 ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలు పెట్టించారు. అయితే సవరలకు చదువు చెప్పాలంటే వారి మాతృభాషలోనే చెప్పాలని గిడుగు వారి వాదన. 1892లో సవర భాష నేర్చుకున్నారు.

1911లోనే సవర భాషలో వాచకాలు తయారు చేశారు. వారి పాటలు, కథలు సేకరించి గ్రంథస్థం చేశారు. ఆధునిక మానవ శాస్త్రానికి (ఆంత్రపాలజీ) పితామహుడు అని పిలవబడే శ్రీ శరత్‌చంద్ర రాయ్ వారి మొదటి పుస్తకం "ముండాలు, వారి ప్రాంతం" 1912లో వెలువడింది. అంటే గిడుగు వారే రాయ్ గారి కంటే ముందున్నారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

1898 లోనే 'గిరిజన విద్యావిధానం' మీద ఒక చక్కటి వ్యాసం రాసి, అప్పటి మద్రాసు ప్రభుత్వానికి పంపారు. దానిలో ముఖ్యమైన విషయాలు ఏమంటే 1) గిరిజనులకు విద్య వారి మాతృభాషలోనే ప్రారంభించాలి. మౌఖికంకే ప్రాధాన్యత ఇవ్వాలి, 2) వారి పరిసరాల నుంచే పాఠ్యాంశాలు రావాలి, 3) అనవసరమైన విషయాలు వారి మీద రుద్దవద్దు, 4) వారి సంస్కృతిపై వారికి నమ్మకం కలిగి, బయటి ప్రపంచంతో ధైర్యంగా మెలిగేలా చేయాలి.

భారత దేశ ప్రథమ ప్రధాని కీ.శే. జవహర్ లాల్ నెహ్రూ గారు ప్రకటించిన పంచశీల గిరిజన విధానం, గిడుగువారు చెప్పిన విద్యా విధానంలోనూ పెద్ద తేడాలు లేవు. అయితే వీరి గిరిజన విద్యా ప్రయత్నంలో చాలా ఆటంకాలు వచ్చాయి. అప్పటి జిల్లా కలెక్టరుగా ఉన్న మెుక్కార్థి గారు గవర్నరు గారితో భోజనం చేసేటప్పుడు "రామ్మూర్తి పంతులు పిచ్చివాడు. నెమ్మదిగా జీవిస్తున్న సవరలకు లేని పోని ఆశలు కలిగించి ప్రశాంతమైన సవర దేశంలో విప్లవం పుట్టించదలచినాడు. అతడు సవర దేశమునకు పోరాదని శాసించదలచినాను" అని తెలిపారట. సవరభాషను నేర్చుకునేటప్పుడు ఆ ప్రాంతంలో నివసించే పైడి (పాణో) వాండ్లను అనువాదకులుగా ఉంచుకున్నారట. ఆ ప్రక్రియలో వారిని ఇంట్లోకి ప్రవేశింపచేయటమేకాక, వారిని పక్కన కూర్చో పెట్టుకునేవారట.

పాణోలను అంటరాని వారుగా పరిగణించ బడేవారు. అందువల్ల పంతులు గారు, బంధువులచే వెలివేయబడ్డారు. ఆయనా బెదరలేదు. ప్రాయశ్చిత్తమునకు ఒప్పుకోలేదు. చివరికి వెలి దానంతటదే వెలిసిపోయింది. సవర భాష నేర్చుకునేందుకు వెల్ష్‌మెన్ అనే అటవీ అధికారి వీరి వద్ద శిష్యరికం చేశారు. అడవి ప్రాంతంలో నివసించటం వల్ల వారు ఎప్పుడూ మలేరియాతో బాధపడేవారట. దానికి మందుగా క్వినైన్ మాత్రలు ఎక్కువగా వాడడం వల్ల బ్రహ్మచెముడు కూడా వచ్చిందని వారి కుమారుడు సీతాపతి గారు తెలిపారు. గిడుగు వారి రచనల్లో ప్రపంచ ఖ్యాతిని ఆర్జించినది ఆంగ్లం-సవర-ఆంగ్ల పదకోశం. 1911లో పదవీ విరమణ చేసారు. 1913లో బ్రిటిష్ ప్రభుత్వం రావ్ సాహెబ్ బిరుదునిచ్చి వారిని సత్కరించారు.

## భారత రాజ్యాంగం వచ్చిన తరువాత

భారత రాజ్యాంగం ఆర్టికల్ 350-ఎ లో "మాతృ భాషలో ప్రాథమిక విద్య నేర్పేందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి" అని పేర్కొనబడింది. కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమాలపై నియమించిన చాలా కమీషన్లు, కమిటీలు ఈ మార్గదర్శక సూత్రాలు అమలు చేయాలని ఉద్ఘాటించాయి. తరువాత ఐదవ పంచవర్ష ప్రణాళిక తయారు చేసేముందు గిరిజన ప్రాంతాల అభివృద్ధికై ఉప ప్రణాళిక ఉండాలని ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. దానిలో భాగంగా ప్రాథమిక స్థాయిలో ఒకటి, రెండు తరగతులలో విద్యా బోధన గిరిజనుల మాతృభాషలో ఉండాలని వక్కాణించారు.

ఆంధ్రప్రదేశ్ తెలుగు ఎకాడమీ వారు గోండీ, కోయ మొదలైన భాషల్లో వాచకాలు తయారు చేశారు. అయితే ఇవి తెలుగు వాచకాలకు ప్రతిరూపంగా తయారు చేశారని విమర్శ వచ్చింది. శ్రీ శంకర్ రెడ్డి లాంటి సామాజిక కార్యకర్తలు సవర భాషలో పాఠ్య పుస్తకాలు రాశారు.

2004-05లో సర్వ శిక్ష అభియాన్ క్రింద గిరిజన మాతృ భాషలో ఒకటి, రెండు, తరగతులకు వాచకాలను (ఈ రచయిత ఆధ్వర్యంలో) గిరిజన సంక్షేమ శాఖ ప్రచురించటం జరిగింది. భాషా వేత్తలే కాక, మానవ శాస్త్రజ్ఞులు, స్వచ్ఛంద సంస్థలు, ఆయా గిరిజన జాతులకే చెందిన ఉపాధ్యాయుల సలహాలతో ఈ పుస్తకాలు రూపొందించడం జరిగింది. గిరిజన సంస్కృతి, భాష, సంప్రదాయాలు, పరిసరాలు, ఆభరణాలు, వాయిద్యాలు, కొలతలు, తూనికలు, పాటలు, ప్రకృతి - చెట్లు, జంతువులు, పక్షులు, కొండలు, అడవులు లాంటివి, కథలు, పుక్కిట పురాణాలు లాంటి అన్ని సమ్మేళించి తెలుగు లిపితో తయారు చేయటం జరిగింది. చాలా పాఠశాలల్లో వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేయటం జరిగింది. అయితే సరైన బోధకులు లేక సరిగా అమలు జరుగలేదు. యీ ప్రయత్నం కూడా సఫలం కాలేదు.



**ఆచార్య శ్రీమతి శతపతి ప్రసన్నశ్రీ**

## ప్రస్తుత కృషి

ఈ మధ్యన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల భాషా చార్యులు శ్రీమతి శతపతి ప్రసన్న శ్రీ గారు యు.జి.సి. సహాయంతో గిరిజన భాషలపై కృషి చేస్తున్నారు. వీరు ఎరుకుల గిరిజన తెగకు చెందినవారు. విశాఖపట్నం గిరిజనుల భాష, పాటలపై ఎంతో కృషి చేస్తున్నారు. చిన్నప్పుడు వారి అమ్మమ్మగారు కథలు, పాటలు చెబుతూ, గిరిజన పాటను కాపాడమని చెప్పిన మాటలు స్ఫూర్తిని, పట్టుదలను కల్పించాయి. విశాఖ జిల్లా ఏజెన్సీలో సుమారు 167 గ్రామాలు ఆరు సంవత్సరాలు పాటు తిరిగారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు నిర్వహించారు. చాలా జాతీయ అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొన్నారు. 2005లో దళిత సాహిత్య అకాడమీ అవార్డును కూడా పొందారు. ఆమె మాటల్లో చెప్పాలంటే "పాట మనుషుల్ని, మనసుల్ని కలుపుతుంది.

"పాట అంతరించకుండా కృషి చేయాలి. మౌఖిక భాషలను పరిరక్షించాలంటే మొదట పాటను రక్షించాలి. అడవుల్లో నివసించే ఆదివాసులకు జీవనం దుర్భరం. పండగలు, పాటలు, నృత్యాలు లాంటివి వారికి కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. చాలా గిరిజన జాతుల ఆట పాటలను సేకరించే కృషి ఒక పద్ధతిగాను, శాస్త్రీయంగాను జరగలేదు. పాట, మాట (భాష) అంతరించి పోయే పరిస్థితులు వస్తున్నాయి. అందువల్ల వీటిని సేకరించి, జాగ్రత్త పరచవలసిన సమయం ఆసన్నమైనది" అంటారు ప్రొ॥ ప్రసన్నశ్రీ. వీరి ప్రయత్నం సఫలం కావాలని, గిరిజన భాషలు, సాహిత్యం సజీవంగా ఉండాలని కోరుకుందాం.

*- డా॥ వి.ఎన్.వి.కె. శాస్త్రి*
*సెంటర్ హెడ్, (యం.,పి)*




# బాల్ బ్యాడ్మింటన్‌లో నాటి మేటి ప్రతిభాశాలి

**క్రీడలకు సంబంధించిన నూతన కాలమ్ ప్రారంభించటమంటే, సాధారణంగా ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఎక్కడ ప్రారంభించాలి? ఏ అంశంపై ప్రారంభించాలి? అని. కానీ, అదృష్టవశాత్తు మనకు ఆ సమస్య లేదు. సమాధానం మన వద్ద సంసిద్ధంగా ఉంది. తాజా అంశంతోనే మన కాలమ్‌ని ప్రారంభించవచ్చు.**

మన ప్రతిష్టాత్మక పత్రిక 'స్థానిక పాలన'లో కొత్త క్రీడా కాలమ్ ప్రారంభించడానికి బ్యాడ్మింటన్ కంటే ఇప్పుడు మంచి అంశం ఏముంటుంది? ఆగష్టు నెలలో ప్రతిష్టాత్మకమైన ప్రపంచస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్‌లో జరిగాయి. ప్రపంచం నలుమూలల నుంచి 45 పైగా టీములు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ టీముల్లో ప్రపంచంలోని అత్యున్నత స్థాయి టీములు కూడా ఉన్నాయి.

ఈ టోర్నమెంట్ జరగడానికి కొన్నిరోజుల ముందు మనకు అత్యంత సంతోషం కలిగించే ఒక సంఘటన జరిగింది. చీఫ్ నేషనల్ బ్యాడ్మింటన్ కోచ్‌గా ఉన్న మన పుల్లెల గోపీచంద్‌కి, అతని శిష్యురాలు సైనా నెహ్వాల్‌కి ఘనమైన జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయి. పుల్లెల




పుల్లెల గోపీచంద్ కాగా, మరొకరు ప్రకాష్ పదుకొనె. క్రీడారంగంలోని ప్రతిష్టాత్మక పురస్కారాలైన రాజీవ్ ఖేల్‌రత్న, అర్జున, ద్రోణ అవార్డులతో పాటు, పద్మశ్రీ అవార్డును కూడా గెలుచుకున్న ఏకైక క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్. రాష్ట్రానికి చెందిన చేతన్ ఆనంద్, జ్వాలా గుత్తా తదితర క్రీడాకారులెందరో బ్యాడ్మింటన్‌లో మంచి నైపుణ్యం సాధించారు.

గోపీచంద్, సైనా వంటి వారికి ఇంకా ఎన్నో సంవత్సరాల పాటు క్రీడా జీవితం ఉంది. అందువల్ల బాల్‌బ్యాడ్మింటన్‌కి మన రాష్ట్రంలో పితామహుడనదగిన ఒక గొప్ప క్రీడాకారుడి గురించి చెప్పుకోవడం ఇక్కడ అవసరం. యవ్వనంలో ఉండగా గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో, దక్షిణ భారతదేశంలో ఆయన పేరు ఇంటింటా మారుమోగింది. బాల్‌బ్యాడ్మింటన్‌లో ఆయన సాధించిన విజయాలు అపురూపమైనవి.

ఆయన పేరు జమ్మలమడక పిచ్చయ్య. బాల్‌బ్యాడ్మింటన్‌కి పితామహుడనదగిన ఆయన వయస్సు ఇప్పుడు 91 సంవత్సరాలు. కానీ మానసికంగా ఆయన ఇప్పటికీ యువకుడే. బ్యాడ్మింటన్ ఆటకు ఉపయోగించే రాకెట్‌పై,


గోపీచంద్‌కి ద్రోణ అవార్డు, సైనా నెహ్వాల్‌కి అర్జున అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రధానం చేసింది. ఒక క్రీడాచార్యుడికి జాతీయ స్థాయిలో లభించే అత్యున్నతమైన గౌరవం ద్రోణ అవార్డే. గోపీచంద్ మన రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో గల నల్లగండ్ల గ్రామానికి చెందిన వారు. హర్యానాలోని హిస్సార్‌లో జన్మించిన సైనా మన రాష్ట్రాన్నే తన స్వస్థలంగా మార్చుకుంది. ప్రపంచంలో ఆరవ ర్యాంకుకు ఎదిగిన సైనా ఇటీవల బ్యాడ్మింటన్‌లో సాధించిన అనేక విజయాలకుగాను ఈ పురస్కారం ఆమెకు లభించింది. ఈ గురు శిష్యుల నైపుణ్యం రానురాను పెరిగిపోతోంది.

బ్యాడ్మింటన్ క్రీడలో వ్యక్తిగతమైన అత్యున్నత స్థాయి ప్రతిభకు నిదర్శనం ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ గెలవటం. ఈ ఛాంపియన్‌షిప్ గెలిచినది మనదేశంలో ఇద్దరే. ఈ ఇద్దరిలో ఒకరు

పసుపు పచ్చని చిన్న బాల్‌పై ఆయన మమకారం ఏమాత్రం తగ్గలేదు.

కృష్ణా జిల్లాలో ఆంధ్రనాట్యమైన కూచిపూడికి మొగ్గ తొడిగిన కూచిపూడి గ్రామంలో 1918 డిసెంబర్ 18న పిచ్చయ్య జన్మించారు. అజామ్‌జాహి మిల్లులో ఉద్యోగం కోసం 1947లో ఆయన వరంగల్‌కి వచ్చారు. కాకతీయ సామ్రాజ్యానికి రాజధానిగా చరిత్రలో విలసిల్లిన వరంగల్‌నే అప్పటినుంచి ఆయన తన స్వస్థలంగా మలచుకున్నారు. వరంగల్‌కి చెందిన కాళోజీ నారాయణరావు, నేరెళ్ళ వేణుమాధవ్ వరంగల్ బిడ్డలుగా ఎంత ప్రసిద్ధి చెందారో, జమ్మలమడక పిచ్చయ్య కూడా అంతగానూ వరంగల్ బిడ్డగా ప్రసిద్ధి చెందారు.

ఈ రచయితకి ఇటీవల ఇంటర్వ్యూ ఇచ్చిన శ్రీ పిచ్చయ్య తన జ్ఞాపకాల




స్రవంతిలోని అనేక విషయాలను పంచుకున్నారు. తన జీవితానికి సంబంధించిన విషయాలు, బ్యాడ్మింటన్‌కి సంబంధించిన అప్పటి ఇప్పటి విషయాలు అనేకం అందులో ఉన్నాయి. ఆయన మాటల్లోనే....

"కృష్ణా జిల్లాలో ఒక క్రీడాకారుల కుటుంబంలో నేను జన్మించాను. మా నలుగురు సోదరుల్లో ముగ్గురు బ్యాడ్మింటన్ క్రీడాకారులే. మా అన్న నారాయణమూర్తి నా అంతటి పేరు తెచ్చుకున్నారు. టెన్నిస్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్‌లో ఆయనకు చాలా నైపుణ్యం ఉంది. మచిలీపట్నంలో చదువుకునే రోజుల్లో నేను ఫుట్‌బాల్ బాగా ఆడేవాణ్ని".

"బ్యాడ్మింటన్‌పై ఆసక్తి కలిగినప్పుడు నేను తెనాలిలో పనిచేస్తున్నాను. రాధాకృష్ణ అనే యూనియన్ నాయకుడు వరంగల్‌లోని అజాంజాహి మిల్స్‌లో నాకు ఉద్యోగం ఇప్పించారు. అయితే, 1947లో రజాకార్ల ఉద్యమం తీవ్రంగా ఉండటంతో నేను అందులో చేరలేకపోయాను. బ్యాడ్మింటన్‌లో నేను చూపే నైపుణ్యం నాకెంతో పేరు తెచ్చిపెట్టింది. 1948-49లో నా శ్రేయోభిలాషులు ఆరువేల రూపాయల హాలి/ఉస్మానియా సిక్కా (నిజాం రాజ్యంలో అమల్లో ఉన్న కరెన్సీ)ని జమ చేశారు. నాతో ఒక క్రీడా సామాగ్రి/జనరల్ స్టోర్‌ను పెట్టించడానికి వాళ్ళు ఆ సహాయం చేశారు. ఈ స్టోర్‌కి వచ్చిన ప్రతిస్పందన చూసి, నేను దాన్ని పూర్తిగా క్రీడా సామాగ్రి స్టోర్‌గా మార్చివేశాను. ఇప్పటికీ అక్కడి పిచ్చయ్య స్పోర్ట్స్ షాప్‌ని మేం నిర్వహిస్తున్నాం."

1944-45 కాలంలో తెనాలిలో ఉండగానే మద్రాసుకు చెందిన ప్రసిద్ధ క్రీడాకారుడు రాజగోపాల్ వంటి వారితో శ్రీ పిచ్చయ్య ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు ఆడి తనకంటూ మంచిపేరు తెచ్చుకున్నారు. డబుల్స్ (వెనుక స్థానంలో), ఫైవ్స్ (మధ్యస్థానంలో) బృందాల్లో ఆయన ఆడుతుండేవారు. 1951లో మద్రాసు స్టేట్ ఛాంపియన్‌షిప్‌ను గెలవటంతో ఆయన పేరు ప్రఖ్యాతులు విస్తరించాయి. 1955లో మొట్టమొదటి బాల్‌బ్యాడ్మింటన్ నేషనల్స్ ఆడి, తొమ్మిదింటిలో గెలిచారు. 1959లో శ్రీ పిచ్చయ్య మధురైలో టోర్నమెంట్ గెలిచారు. ఈ టోర్నమెంట్‌ను వింబుల్డన్ ఆఫ్ బాల్‌బ్యాడ్మింటన్ అని వ్యవహరించేవారు. దాంతో క్రీడాభిమానులంతా పెద్ద ఎత్తున శ్రీ పిచ్చయ్యకు ఘనంగా సన్మానం చేసి, "విజర్డ్ ఆఫ్ బాల్ బ్యాడ్మింటన్" అనే బిరుదుని ప్రధానం చేశారు.

విజయం గొప్ప మత్తునిస్తుంది. అది తలలోకి కూడా త్వరగానే పాకుతుంది. అయితే, అది తన విషయంలో జరగకుండా చూసుకున్నారు శ్రీ పిచ్చయ్య. ఎంతో క్లిష్టమైన ఆట ఆడుతూ, విజయంతో బయటపడిన సందర్భాలు అనేకం శ్రీ పిచ్చయ్య జీవితంలో జరిగాయి. క్రీడాభాషలో



దీన్నే "విషాదాన్ని విజయంగా మలచటం" అని అంటారు. లేదా "ఓటమి కోరల్లో నుంచి విజయాన్ని లాక్కోవటం" అని అంటారు. ఆయన ఇట్లాంటి అరుదైన విజయాలు చాలానే స్వంతం చేసుకున్నారు. అయితే, వాటిని తన గొప్పతనంగా ఎప్పుడూ అనుకోలేదు. హనుమంతుని భక్తుడు కూడా అయిన శ్రీ పిచ్చయ్య "అంతా ఒక అద్భుతం" అని మాత్రం అంటారు. ఈ అద్భుతాల్లో కొన్నిటిని చూద్దాం.

మధురైలో ఒక డబుల్స్ మ్యాచ్ జరుగుతోంది. శ్రీ పిచ్చయ్య, ఆయనకు సరితూగే శ్రీ దక్షిణామూర్తి వ్యతిరేక పక్షాల్లో ఉన్నారు. వేలాది మంది ఆటను చూస్తున్నారు. స్కోర్ బోర్డ్ 28–16 ఉంది. దక్షిణామూర్తి టీమ్‌వైపే విజయం ఖచ్చితంగా కనిపిస్తోంది. పిచ్చయ్యకు దాదాపు ఓటమి తప్పదనుకున్నారు. అప్పటి క్షణాలు ఆయన మాటల్లోనే....

'ఇప్పటికీ నాకు తెలియదు ఏం జరిగిందో. ఒక అద్భుతం అంతా. ఆ తరువాత, ఆట తరువాత ఆటను గెలుస్తూపోయాను. మా ప్రత్యర్థులు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. ఆటను మ్యాచ్‌ను మేమే గెలిచాం. నమ్మశక్యం కాదు ఇప్పటికీ."




మరోసారి, మరో ప్రదేశంలో శ్రీ పిచ్చయ్య, ఆయన భాగస్వామి 16–26 పాయింట్లతో కరీం, వహాబ్‌ల టీమ్ కంటే చాలా వెనుకబడి ఉన్నారు. మ్యాచ్ అట్లాగే ముగుస్తుందని అంతా అనుకున్నారు. కానీ శ్రీ పిచ్చయ్య విజృంభించారు. మళ్ళీ మ్యాచ్ గెలిచారు.

నేషనల్స్‌లో అనేక మార్లు హైదరాబాద్‌కి, ఆంధ్రప్రదేశ్‌కి శ్రీ పిచ్చయ్య ప్రాతినిధ్యం వహించారు. 1970లో మహారాష్ట్రలోని ఉద్గిర్‌లో 52 ఏళ్ళ వయసులో ఆయన ఆఖరిసారి నేషనల్స్ ఆడారు. అదే సంవత్సరం ఆయనను ప్రతిష్టాత్మకమైన 'అర్జున' అవార్డు వరించింది. ఒక బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి 'అర్జున' అవార్డు రావటం అదే మొదటిసారి. తను మొత్తం ఎన్ని మ్యాచ్‌లు ఆడారో ఆయనకు ఖచ్చితంగా గుర్తులేదు. కానీ సుమారు 1200 మ్యాచ్‌లు ఆడానని శ్రీ పిచ్చయ్య చెప్పారు. తరువాతి సంవత్సరాల్లో ఆయన షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్‌లను ఆడుతుండేవారు. డాక్టర్ల సలహా మేరకు 1991 నుండి ఆడటం మానేసి, కేవలం కోచింగ్ బాధ్యతలు చేపట్టారు.

దక్షిణాది రాష్ట్రాల్లో బాల్‌బ్యాడ్మింటన్‌ని ప్రధానంగా ఆడేవారు. చిన్నచిన్న పట్టణాలు, ఆఖరికి పెద్ద గ్రామాల్లోని తాలూకా కార్యాలయాల ఆవరణల్లో, కళాశాల మైదానాల్లో బ్యాడ్మింటన్ కోర్టులుండేవి. ప్రజలకు ఈ ఆటొక ప్రధాన వ్యాపకంగా ఉండేది. అటువంటి ఆట తన ప్రాధాన్యాన్ని కోల్పోయిందా ఇప్పుడు? శ్రీ పిచ్చయ్య కాదనే అంటారు. ఆయన బాల్‌బ్యాడ్మింటన్ పట్ల ఎంతో ఆశావాదంతో ఉన్నారు. అనేక విశ్వవిద్యాలయాల్లో బాల్‌బ్యాడ్మింటన్ తప్పనిసరి ఆటని ఆయన చెప్పారు.

ఆదరించేవారు లేక, క్రికెట్‌పై వ్యామోహంతో బాల్ బ్యాడ్మింటన్, తదితర ఆటలు కొంత వెనుక పడినట్లవుతాయని ఆయన అంటారు. ఈ పరిస్థితిని మార్చడానికి మీడియాగానీ, క్రీడారంగంలోని ముఖ్యులుగాని చేస్తున్నది ఏమీలేదని శ్రీ పిచ్చయ్య భావన. ఇదిలా ఉంటే, స్పోర్ట్స్ షాప్‌లో కూర్చున్న శ్రీ పిచ్చయ్య స్ఫూర్తి కొనసాగుతూనే ఉంటుంది.

**– దాసు కేశవరావు**

(అనువాదం: వై. సరోజ)

# అనవసర ఆందోళన వద్దు, అవగాహన చాలు

- ఇదికూడా సాధారణ ఫ్లూ లాంటిదే.
- రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికే సమస్య.
- సకాలంలో వైద్య సహాయం తీసుకుంటే ప్రమాదం లేదు.
- అనవసర భయం వల్లనే ఇబ్బందికర పరిస్థితులు.
- భరోసానిస్తున్న వైద్య నిపుణులు.

ప్రస్తుతం దేశాన్ని వణికిస్తున్న మహమ్మారి. స్వైన్‌ఫ్లూ.. దీనిపై ప్రజల్లో రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రాణాంతకమైనదన్న ఆందోళన కూడా చాలా మందిలో ఉంది. అయితే స్వైన్‌ఫ్లూపై ఎలాంటి భయాలు అవసరంలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాక్సినేషన్ కమిటీ సభ్యుడు, ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ రణదీప్ బలేరియా భరోసానిస్తున్నారు.


మరణాల శాతం 0.1 శాతం కూడా లేని స్వైన్ ఫ్లూపై ఎందుకు ఇంత రాద్ధాంతం జరుగుతుందో అర్థం కావడంలేదని ఆయన అభిప్రాయపడ్డారు. వైద్య నిపుణులంతా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. "సీజన్ మారినప్పుడు సర్వసాధారణంగా వచ్చే జలుబు, దగ్గులను కూడా కొందరు స్వైన్‌ఫ్లూగా అనుమానించడమే ఆందోళనకు కారణం. ఇది ఏమాత్రం మంచి పరిణామం కాదు"


## స్వైన్ ఫ్లూ

హైదరాబాద్‌లోని స్వైన్ ఫ్లూ నోడల్ కేంద్రం వైద్యుడు, రాష్ట్ర స్వైన్‌ఫ్లూ నోడల్ అధికారి డాక్టర్ శుభకర్ అభిప్రాయపడ్డారు. ప్రజలను చైతన్య పరిచేందుకు మీడియా చొరవ తీసుకోవాలని వైద్యులు కోరుతున్నారు.

### ప్రాణాంతకమైనదా ?

ఇది కూడా సాధారణ ఫ్లూ లాంటిదే. దీనిపై ఎలాంటి భయాందోళన





చెందాల్సిన పనిలేదు. సాధారణ ఫ్లూ కారణంగా సైతం ప్రతియేటా ప్రపంచవ్యాప్తంగా సగటున రెండు లక్షల మంది చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) లెక్కలు చెబుతున్నాయి. అంతమాత్రాన సాధారణ ఫ్లూను ఎవరూ ప్రాణాంతకంగా భావించడంలేదు. స్వైన్ ఫ్లూ కూడా అలాంటిదే. అయితే రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న ఆరేళ్లలోపు పిల్లలు, 60 ఏళ్లు దాటిన వృద్ధులు, శ్వాససంబంధమైన సమస్యలున్న వారు స్వైన్‌ఫ్లూపై నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం. ఇలాంటివారు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

### ఇంత భయం ఎందుకు నెలకొంది?

కొన్ని ఫ్లూలు పందులు, గొర్రెల్లాంటి జంతువుల నుంచి మనుషులకు వ్యాపిస్తాయి. మనుషుల్లో ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందడం స్వైన్‌ఫ్లూ లక్షణం. దీన్ని నిరోధించేందుకు ప్రజల్లో చైతన్యం పెంచాలని మీడియా, ప్రభుత్వాలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన ప్రయత్నాల వల్ల ప్రచారం పెరిగింది. అవగాహన పెంచుకోవాల్సిన ప్రజలు భయం పెంచుకోవడమే ఇబ్బందిగా మారింది.


### ఎలాంటి జాగ్రత్తలు

దగ్గు, జలుబు, ముక్కు నుంచి ద్రవం కారడం. వంద డిగ్రీలు మించి జ్వరం, శ్వాస పీల్చడం ఇబ్బందిగా ఉండటం, గొంతునొప్పి లాంటివి స్వైన్ ఫ్లూ లక్షణాలు. ఈ లక్షణాలు ఉన్నవారు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ప్రత్యేకంగా ఒక గదిలో ఉండటం మంచిది. ముక్కు, నోరుకు పరిశుభ్రమైన రెండు పొరల వస్త్రం కట్టుకోవడంవల్ల ఇతరులకు వ్యాప్తిచెందే ప్రమాదం ఉండదు.

జలుబు, జ్వరం తగ్గేందుకు యాంటీబయాటిక్స్ వాడవచ్చు. చేతులను వీలైనన్ని ఎక్కువ సార్లు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. ఈ లక్షణాలున్న వారు నీరు తాగిన గ్లాసులను ఇతరులు ఉపయోగించరాదు. మూడు రోజులు మందులు వాడినా తగ్గకపోతే మాత్రం గ్రామీణ ప్రాంతాలవారు జిల్లా వైద్యాధికారులను గానీ, హైదరాబాద్‌లోని స్వైన్‌ఫ్లూ నోడల్ కేంద్రం డాక్టర్లను (92461 57447, 98499 02995)ను గానీ సంప్రదించాలి.

- వైరస్ లేకుంటే... మందులు వాడకూడదు.
- స్వైన్‌ఫ్లూ ఉన్నట్లు నిర్ధారించిన తర్వాత రెండు రోజుల్లో వైద్యం ప్రారంభించాలి.

# స్వైన్‌ఫ్లూపై ప్రపంచ ఆరోగ్యసంస్థ కొత్త మార్గదర్శకాలు



స్వైన్‌ఫ్లూ మందులు వాడకంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తాజాగా కొత్త మార్గదర్శకాలు వెలువరించింది. ప్రపంచవ్యాప్తంగా వ్యాధి సోకిన రోగుల్లో చాలా మందిలో ప్రత్యేకమైన ఇన్‌ఫ్లుయెంజా లక్షణాలు కనిపిస్తున్నాయని చెప్పింది. ఎలాంటి వైద్యం తీసుకోకుండానే వారంలోగా పూర్తిగా కోలుకొంటున్నారని తెలిపింది. అంతర్జాతీయ నిపుణుల బృందం ఏకాభిప్రాయంతో తాజా మార్గదర్శకాలు రూపొందించింది. 'ఎం2 ఇన్‌హిబిటర్లు'గా పిలిచే రెండో తరగతి యాంటీవైరల్ మందులకు స్వైన్‌ఫ్లూ ప్రస్తుతం లొంగట్లేదని సంస్థ చెప్పింది.

## డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాలు

- తీవ్రమైన జబ్బులేవీ లేకుంటే స్వైన్ ఫ్లూ రోగులకు యాంటీవైరల్ మందులతో చికిత్స అందించాల్సిన అవసరం లేదు.
- ఒసెల్ టమివిర్, జనామివిర్ లాంటి ఔషధాలు వ్యాధి కారక హెచ్1ఎన్1 వైరస్‌ను దీటుగా ఎదుర్కొంటున్నాయి. తీవ్ర అనారోగ్యాన్ని, మరణాలను నివారించేందుకు, ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం తగ్గించేందుకు, అందులో ఉండాల్సిన సమయం తగ్గించేందుకు బాధితులకు ఇలాంటి మందులు ఇవ్వాలి.
- సరిగ్గా ఉపయోగించినట్లయితే, న్యూమోనియా ముప్పును ఎదుర్కోవడంలో ఒసెల్ టిమివిర్ బాగా పనిచేస్తోందని తేలింది. స్వైన్‌ఫ్లూ కాలానుగుణంగా వచ్చే ఇన్‌ఫ్లుయెంజా సోకిన రోగుల్లో మరణాలకు దారితీసే ముఖ్య కారణాల్లో న్యుమోనియా ఒకటి.



- వ్యాధి తీవ్రంగా ఉన్న, లేదా పరిస్థితి దిగజారుతున్న స్వైన్‌ఫ్లూ రోగులకు సాధ్యమైనంత త్వరగా ఒసెల్ టమివిర్ మందు ఇవ్వాలి. ఇది అందుబాటులో లేకపోతే జనామివిర్ ఇవ్వొచ్చు.
- గర్భిణుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే వీలైనంత త్వరగా యాంటీవైరల్ చికిత్స అందించాలి.
- వ్యాధి తీవ్రంగా ఉన్న, లేదా ఆరోగ్యం క్షీణిస్తున్న ఐదేళ్లలోపు పిల్లలకు సత్వరం వైద్యమందించాలి. అలాగే, తీవ్రమైన జబ్బు వచ్చే ఆస్కారమున్న వ్యక్తులకూ వెంటనే చికిత్స అందించాలి.
- అనారోగ్య పరిస్థితి అలాగే కొనసాగితే తప్ప ఐదేళ్లు పైబడిన ఆరోగ్యవంతులైన పిల్లలకు యాంటీవైరల్ చికిత్స అవసరం లేదు.
- హెచ్1ఎన్1 ఇన్‌ఫెక్షన్లు సోకినట్లు నిర్ధారించిన లేదా సోకినట్లు అనుమానాలున్న వ్యక్తుల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీనొప్పి, మూడు రోజులకుపైగా తీవ్ర జ్వరం లాంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యసాయం పొందాలి.
- పిల్లల్లో వేగంగా లేదా కష్టంగా శ్వాస తీసుకోవడం, నిస్తేజంగా ఉండటం, నిద్ర లేవడానికి ఇబ్బంది లేదా ఆటలు ఆడటంపై నిరాసక్తి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్పందించాలి.

## సమన్వయంతో వ్యాధిని నియంత్రించాలి

స్వైన్‌ఫ్లూ వ్యాప్తిని ఎదుర్కోవడానికి, ప్రపంచవ్యాప్తంగా వ్యాధి ప్రభావాన్ని తగ్గించడానికి సమన్వయంతో పనిచేయాలని డబ్ల్యూహెచ్‌వో, యూనిసెఫ్, రెడ్‌క్రాస్ సహా ఐదు అంతర్జాతీయ సంస్థలు పిలుపునిచ్చాయి.

హెచ్1ఎన్1 వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడం అసాధ్యమని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది ఇది ఇప్పటికే బంగ్లాదేశ్, ఇథియోపియా, హైతీ, ఇరాక్, శ్రీలంక, జింబాబ్వే లాంటి దేశాలకు ప్రబలిందని ఆందోళన వ్యక్తంచేసింది.

**- వై. సరోజ**

ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, రాష్ట్రంపై ఆర్థికమాంద్యం ప్రభావం ఎంత ఉన్నా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగవని ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి ఉద్ఘాటించారు. సాగునీటి పథకాలు, ఇందిరమ్మ గృహ నిర్మాణం, తదితర పథకాలపై మాంద్యం ప్రభావం పడకుండా చూడగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగష్టు 15న సికింద్రాబాద్‌లోని పేరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

# ఎన్ని సమస్యలు ఎదురైనా సంక్షేమ పథకాలు ఆగవు



ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా మనదేశంలో కూడా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రతి రాష్ట్రమూ ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నదని, అయితే రాష్ట్ర ప్రజలను ఈ భారం నుంచి కాపాడటానికి సబ్సిడీపై అనేక నిత్యావసరాలను సరఫరా చేస్తున్నామని, అక్రమ నిల్వలకి అవకాశం ఉన్న వ్యవసాయోత్పత్తుల ధరలను నియంత్రించడానికి సకల చర్యలూ తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చెప్పారు.

గత ఐదేళ్లుగా తమ ప్రభుత్వం చేపట్టి, కొనసాగిస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని ముఖమంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు. సమాన అవకాశాలే లక్ష్యంగా వివిధ కార్యక్రమాల అమలు, అవినీతి నిర్మూలన, కరువు పరిస్థితులు, సహకార సేద్యం తదితర అంశాలపై ఆయన ప్రసంగించారు.

*ముఖ్యమంత్రి ప్రసంగంలో ముఖ్యాంశాలు ... ఆయన మాటల్లోనే . . .*

- స్వేచ్ఛ కోసం దాదాపు 90 సంవత్సరాల పాటు విభిన్న మార్గాలలో మన పూర్వీకులు అసిధారా వ్రతంలా సాగించిన స్వాతంత్ర్య పోరాట ఫలితాలను అనుభవిస్తున్న మనం ఆ స్వాతంత్ర్య యోధులందర్నీ పేరు పేరునా స్మరించుకోవాల్సిన తరుణం ఇది.
- మహాత్ముడిగా మనం అభివర్ణించుకునే మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ సారథ్యంలో ఎంతోమంది దేశభక్తులు ఈ మాతృభూమి దాస్యశృంఖలాలను ఛేదించే మహాయజ్ఞంలో ఆస్తులు పోగొట్టుకున్నారు. సుఖవంతమైన జీవితాన్ని వదులుకున్నారు. తాము, తమ కుటుంబాలు ఏమైపోయినా దేశం స్వేచ్ఛావాయువులు పీలిస్తే చాలనుకున్నారు. మన భవిష్యత్ కోసం వాళ్ళ వర్తమానాన్ని గడ్డిపోచలా త్యాగం చేశారు.
- మన అదృష్టం ఏమిటంటే స్వాతంత్ర్యం సిద్ధించాక అత్యంత దూరదృష్టి కలిగిన నాయకత్వం లభించింది. జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి దేశభక్తులతో కూడిన మంత్రివర్గం పంచవర్ష ప్రణాళికలు రచించి, ఒక ప్రణాళికా బద్ధంగా ఈ దేశ అభివృద్ధికి బాటలు వేశారు. మనకి లభించిన స్వాతంత్ర్యం అర్థవంతం అయ్యేలా వాళ్ళు దీర్ఘకాలిక ప్రణాళికలను అమలు చేయటానికి అనవరతం శ్రమించారు.

★ ఆరు దశాబ్దాల పాటు ఆ ప్రణాళికా విధానాన్ని మనం అమలు చేస్తూ వస్తే, ఈ రోజున కుగ్రామంలో ఆముదం దీపాల స్థానంలో విద్యుత్ లైట్లను వెలిగిస్తున్నాం. ఎడ్లబళ్ళు మాత్రమే నడిచే దారుల్లో సిమెంటు రోడ్లు వేసి బస్సుల్లో వెళ్తున్నాం. గ్రామగ్రామానా రక్షిత మంచినీటిని త్రాగగలుగుతున్నాం. ఒక్కసారి ఊహించండి. ఆనాడు వర్షాలు కురిస్తే తప్ప ఒక్క గింజ కూడా పండని వ్యవసాయం ఇప్పుడు నీటిపారుదల ప్రాజెక్టుల క్రింద ఎలా సాగవుతోందో గమనించండి.

★ ఆనాడు పంచవర్ష ప్రణాళికలు రచించిన నాయకులు ఇప్పుడు మన మధ్యన లేరు. కాని మనం అనుభవిస్తున్నది మాత్రం వాళ్ళ ప్రణాళికల పుణ్యమే. శాశ్వతంగా నిలిచిపోయే జల విద్యుత్ ప్రాజెక్టుల్ని నిర్మించారు. రహదారుల్ని నిర్మించారు. రక్షిత మంచినీటి ప్రాజెక్టులు నిర్మించారు. హాస్పిటల్ భవనాలు నిర్మించారు. మరెన్నో శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించారు.




★ అందుకే వాళ్ళు మా ప్రభుత్వానికి ఆదర్శప్రాయులు. నిజానికి జలయజ్ఞం, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం వంటి దీర్ఘకాలిక ప్రాజెక్టుల ప్రభావం అనుకున్న వెంటనే కనుపించేది కాదు. ఇవ్వాళ తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలకు సాగునీటిని అందిస్తున్న నాగార్జునసాగర్ నిర్మాణం 13 సంవత్సరాల పాటు సాగింది. వాళ్ళెవరూ తమకి తక్షణ రాజకీయ ప్రయోజనాలు ఏముంటాయా అని చూడలేదు. రేపటి రాష్ట్రం గురించి మాత్రమే ఆలోచించారు. అందుకే అలాంటి ప్రాజెక్టులు వచ్చాయి.

★ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి గురించి ఆలోచించకుండా ఏవో ఒకటి రెండు రంగాల మీద మాత్రమే దృష్టిని కేంద్రీకరించే విధానం మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని ఎంత దిగజార్చిందో, అప్పుల ఊబిలో ఎలా ముంచేసిందో గతంలో మీరు చూశారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదనీ, స్వతంత్ర భారత నిర్మాతల దూరదృష్టి, పాలనాదక్షతల స్ఫూర్తితో శాశ్వతమైన వనరుల కల్పన ద్వారా మన రాష్ట్రానికి ఉజ్వల మైన భవిష్యత్ నిర్మించాలనీ గడచిన అయిదేళ్ళుగా మన ప్రభుత్వం సాగిస్తున్న కృషిని మీరు చూస్తున్నారు.

★ ఏ విశ్వాసంతో మీరు ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలని కోరుకున్నారో ఆ విశ్వాసానికి అనుగుణంగా గత అయిదేళ్ళుగా మేం అమలు చేస్తూ వచ్చిన విధానాల్నే యధాతథంగా కొనసాగిస్తామని మీకు హామీ ఇస్తున్నాను. అవకాశమున్నచోట వాటిని మెరుగుపరుస్తామని కూడా హామీ ఇస్తున్నాను. ఈ మెరుగుదలలో భాగంగా ఇప్పటికే వ్యవసాయ విద్యుత్ వేళల్ని రోజుకి తొమ్మిది గంటలకి పొడిగించాలనీ, ఒక్కో కుటుంబానికిచ్చే రేషన్ బియ్యం కోటాను మనిషికి నెలకి నాలుగు నుంచి అయిదు కిలోలకు పెంచాలనీ నిర్ణయించిన విషయం మీకు తెలుసు.

★ ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా మనదేశంలో కూడా నిత్యావసర వస్తువుల ధరల విపరీతంగా పెరిగాయి. ఫలితంగా ప్రతి రాష్ట్రమూ ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. అయితే మన రాష్ట్ర ప్రజలను ఈ భారం నుండి కాపాడటం కోసం బియ్యం, పప్పులు, వంట నూనెల వంటి సరుకుల మీద సబ్సిడీ ఇస్తున్నాం.

★ ప్రజలు ఎక్కువగా వినియోగించే కందిపప్పు సేద్యాన్ని బాగా విస్తరింప చేయాలని నిర్ణయించాం. ఆహారధాన్యాలే కాక, అక్రమ నిల్వలకి అవకాశం వున్న ఇతర వ్యవసాయోత్పత్తుల ధరలను నియంత్రించడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

★ 2004-2008 కాలంలో రాష్ట్ర స్థూల వార్షిక ఉత్పత్తి పెరుగుదల 10 శాతానికి మించిపోయింది. 2004-2009 అయిదేళ్ళ కాలానికి తీసుకున్నప్పటికీ 9 శాతంగా సగటు వృద్ధి రేటుని సాధించాం. అంటే అదే కాలంలో 8.5 శాతంగా వున్న జాతీయ వృద్ధి రేటుని అధిగమించాం. వ్యవసాయం, దాని అనుబంధం రంగాలలో వార్షిక వృద్ధిరేటు లక్ష్యం జాతీయ స్థాయిలో 4 శాతంగా వుంటే, అదే అయిదు సంవత్సరాల కాలంలో మనం 6.38 శాతం వార్షిక వృద్ధి రేటుని సాధించాం. ఇది ఒక అద్భుతమైన రికార్డు.

★ అలాగే యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్, జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునరాభివృద్ధి పథకం క్రింద లబ్ధిదారుల్లో కేంద్రం పెంచిన కేటాయింపులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 144 శాతం పెరుగుదల చూపిస్తున్న కేటాయింపులు కూడా ఆర్థిక మాంద్యం ప్రభావం నుండి మన అభివృద్ధి కార్యక్రమాల వేగాన్ని కాపాడే అవకాశం కల్పిస్తున్నాయి.

★ నాకు విశ్వాసం వుంది. ఆర్థిక మాంద్యం ప్రభావం నుంచి మన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని, ఇందిరమ్మ గృహ నిర్మాణాల్ని కాపాడుకోగలుగుతాం. ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదార్లు, పారిశ్రామిక వాడలు, విద్యుత్ ప్రాజెక్టుల వంటి మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమ వేగం - మందగిస్తే మందగించవచ్చును కాని స్తంభించటం మాత్రం జరగదు.

★ ఇటీవలే విశాఖపట్నం దగ్గర ప్రారంభమయిన గంగవరం పోర్టు మన అభివృద్ధి పథంలో మరో మైలురాయి. గత నాలుగేళ్ళలో మన రాష్ట్రంలో నిర్వహణ ప్రారంభించిన మొదటి ఓడరేవు నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం.

★ మన విద్యుత్ ఉత్పాదక శక్తిని కూడా ఇప్పుడున్న 12427 మెగావాట్ల నుంచి రానున్న అయిదేళ్ళలో 23419 మెగావాట్ల స్థాయికి పెంచే కార్యక్రమాన్ని చేపట్టాం.

★ గోదావరి బేసిన్‌లో ఉత్పత్తయ్యే సహజవాయువులో అధిక భాగం మన

రాష్ట్ర అవసరాలకే ఉపయోగపడేలా, పారిశ్రామిక – గృహ అవసరాలకు సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. సహజవాయువుని వినియోగంలోకి తీసుకురావడం వల్ల 2,799 మెగావాట్ల కెపాసిటీ కలిగిన గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పాదనను పునరుద్ధరించగలిగాం.

- పారిశ్రామిక పెట్టుబడులు పెరిగితే ఎగుమతులు పెరుగుతాయి. రాష్ట్రానికి రెవెన్యూ పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయి. లక్షలాది యువతకి ఉద్యోగాలు లభిస్తాయి. అందుకే పరిశ్రమలకిచ్చే ప్రోత్సాహకాలను గత ఏడాది నాటి రూ. 91 కోట్ల నుండి ఈ ఏడాది రూ.4 17 కోట్లకు పెంచుతున్నాం.

## సుపరిపాలన

- అభివృద్ధి వేగాన్ని తగ్గనీయకుండా చర్యలు తీసుకుంటూనే సుపరిపాలన పట్ల మరింత శ్రద్ధ వహిస్తున్నాం. గత రెండు మాసాలుగా ప్రభుత్వం తీసుకున్న చర్యలు మీరు గమనించి వుంటారు. మన అభివృద్ధి క్షేత్రంలో కలుపు మొక్కల వంటివి అవినీతిశక్తులు. అవినీతి నిరోధక శాఖకి నేను స్పష్టమైన ఆదేశాలిచ్చాను. జిల్లా కలెక్టర్ల సమావేశంలో కూడా – ఎంత వేగంగా, సమర్థంగా, న్యాయంగా ప్రజల సమస్యలను పరిష్కరించగలం? వాళ్ళ అవసరాలను తీర్చగలం? అన్నదే సుపరిపాలనకి కొలబద్ద అని స్పష్టం చేయటం జరిగింది.
- సుపరిపాలన అంటే కేవలం ఫైళ్ళను వేగంగా నడపటమే కాదనీ, అన్ని సామాజిక వర్గాలకూ అభివృద్ధిలో సమాన అవకాశాలు కల్పించటం కూడా సుపరిపాలనలో భాగమేననీ నేను విశ్వసిస్తాను. ఈ విశ్వాసాన్ని ఇప్పటికే అమల్లో పెట్టాం. వెనుకబడిన ముస్లిం మైనారిటీలకు ఇతర వర్గాలతో సమానంగా ఎదిగేలా విద్యా, ఉద్యోగ రంగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించాం.
- 'సమాన అవకాశాలు' అన్న సిద్ధాంతాన్ని ప్రాంతాల విషయంలో కూడా అమలు చేశాం. జలయజ్ఞం క్రింద ఇరిగేషన్ ప్రాజెక్టులు, క్రొత్తగా ప్రారంభించిన విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్ కాలేజీలు, రాజీవ్ త్రిబుల్ ఐ.టి.లు, సంక్షేమ హాస్టళ్ళ భవన నిర్మాణాలు – ఈ అంశాల న్నింటిలోనూ అన్ని ప్రాంతాలకీ సమాన అభివృద్ధికి అవకాశం వుండేలా ప్రణాళికలు రచించి అమలు చేస్తున్నాం.

## సహకార సేద్యం

- భూస్వాములు మాత్రమే మరింత పెద్ద భూస్వాములు కాగలుగుతున్నారు. కానీ ఎకరం – రెండెకరాలున్న చిన్న రైతులు ఎదగలేకపోతున్నారు. చిన్న కమతాల మీద వాళ్ళు భూస్వాముల మాదిరిగా భారీ పెట్టుబడులు పెట్టి ఆధునిక వ్యవసాయం చేయలేరు. మీకు తెలుసు. గత అయిదేళ్ళలో ఆరు లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిపెట్టాం. ఒక్కొక్కరికి వచ్చేది ఒక ఎకరమో, ఒకటిన్నర ఎకరమో. దానిమీద ఏ ఒక్క లబ్ధిదారుడైనా ఎలా భారీ పెట్టుబడి పెట్టి ఆధునిక సేద్యం చేయగలుగుతాడు?
- అతి చిన్న రైతుకి సయితం పెద్ద రైతులతో సమానంగా ఎదిగేలా అవకాశాలు కల్పించగలితేనే భూపంపిణీకి అర్థం వుంటుంది అనుకున్నాను. ఇందుకోసం గత ఏడాది కాలంగా నేను అనేక మంది నిపుణులతో చర్చిస్తూ వచ్చాను. మా ఎన్నికల ప్రణాళికలో కూడా ఈ పథకాన్ని చేర్చాం. దీనికి ఒక సమగ్రమైన రూపాన్ని తీసుకురావటం మాత్రం గత రెండు మాసాల్లోనే జరిగింది.
- ఈ పథకం క్రింద – ఒక గ్రామంలో వున్న రైతులంతా కలిసి ఒక సొసైటీని ఏర్పాటు చేసుకుంటారు. తమ కమతాలపై తమ యాజమాన్య హక్కును తామ ఏర్పాటు చేసుకున్న సొసైటీకి నిర్దిష్ట విలువకి బదలాయిస్తారు. సభ్య రైతుల భూమి విలువ, అందులో వున్న ఇతర సదుపాయాలను బట్టి, ఆయా రైతులకు సొసైటీలో షేర్లు కేటాయించబడతాయి. ఆ మొత్తం క్షేత్రం విలువకు సమానమైన ధనాన్ని మూలధనంగా అయిదేళ్ళ కాలపరిమితితో ప్రభుత్వం సమకూరుస్తుంది. ప్రతి సభ్య రైతుకి అతడి పొలంలో గడచిన అయిదేళ్ళలో అత్యధికంగా పండిన పంటను బట్టి ఆ మేరకు ఏటా ఆదాయం వుండేలా సొసైటీ గ్యారంటీ ఇస్తుంది. అప్పటివరకూ ఆ భూమి మీద రైతుకి వున్న అప్పు తాలూకు వడ్డీలను గణించి, ఇకపై ఆ వడ్డీ భారాన్ని ఆ రైతు మోయనక్కర్లేకుండా సొసైటీ బాధ్యత తీసుకుంటుంది. ఇందుకోసం 'నాబార్డ్' సేవలను ఉపయోగించుకుంటుంది. వందలాది చిన్న చిన్న కమతాల స్థానంలో ఇలా ఏర్పడిన సువిశాల క్షేత్రంలో అత్యంత ఆధునిక సాంకేతిక సాగు పద్ధతులతో మేలిరకం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వగైరా ఉపయోగించి, అంతర్జాతీయ విపణిలో విక్రయించదగిన, నాణ్యత గల పంటలను సొసైటీ పండిస్తుంది. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను నిర్వహిస్తుంది. కోళ్ళు, మేకల పెంపకాన్ని చేపడుతుంది. తోటల పెంపకం, ఫుడ్‌ప్రాసెసింగ్ కూడా చేపడుతుంది. అంటే ఒక చిన్న రైతు తన ఎకరం పొలం మీద నానా వ్యయప్రయాసలతో ఇప్పుడు ఆర్జిసున్న దానికన్నా అధిక ఆదాయాన్ని సొసైటీ సభ్యుడిగా తన షేర్లపై లాభాల రూపంలో పొందుతాడు. గ్రామంలో పెద్ద రైతులతో సమానంగా, చిన్న రైతులతో సమానంగా చిన్న రైతు క్షేత్రంలో సేద్యం జరుగుతుంది. పంటలు పండుతాయి, మార్కెటింగ్ జరుగుతుంది. షేర్ల నిష్పత్తిలో లాభాల పంపిణీ జరుగుతుంది.
- గ్రామం అంతా ఒక యూనిట్‌గా వుంటేనే ఇది సాధ్యపడుతుంది. గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానిస్తేనే ఈ సొసైటీ ఏర్పాటు జరుగుతుంది. చిన్నరైతు కూడా తన గ్రామంలో భూస్వామితో సమానంగా ఎదిగే అవకాశాన్ని కల్పించటానికి ఇంతకన్నా మెరుగైన మార్గం ఏదీ లేదు అని నిపుణులంతా తేల్చాకే ఈ పథకాన్ని చేపడుతున్నాం. ప్రస్తుతం ఈ ప్రయోగాన్ని రాష్ట్రంలో 50 గ్రామాల్లో అమలుచేసే ప్రయత్నం చేస్తున్నాం.
- ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల వ్యవస్థను ప్రక్షాళన చేశాక 2700 సొసైటీలు నికరంగా పనిచేస్తున్నాయి. ఒక్కొక్కటి సుమారు 15 వేల ఎకరాల అవసరాలను చూస్తున్నాయి. ఈ సొసైటీల ద్వారా (భూ సేకరణ మినహా) అన్ని రకాల ఇతర ప్రోత్సాహక కార్యాక్రమాలని అమలు చేయడం జరుగుతుంది.

## సంక్షేమం

- ఇలా దేశంలోనే ప్రథమం అని చెప్పదగ్గ ప్రయోగాలు చేయటంలో ఇప్పుడు మన రాష్ట్రం అగ్రస్థానంలో వుంది. సంక్షేమ రంగంలో ఈ ప్రభుత్వం అమలుచేస్తున్న 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' సామాన్యులకు ఎలాంటి ఆరోగ్య బీమా కల్పిస్తోందో, ప్రతిరోజూ ఎన్ని వందల మందికి పునర్జీవితాన్ని ప్రసాదిస్తోందో మీకు తెలుసు. ఇప్పటికి సుమారు మూడు

లక్షల 50 వేల మందికి ఈ పథకం వల్ల సర్జరీలు జరిగాయి.

- గ్రామాల్లో స్వయం సహాయక బృందాల కోసం 'ఇందిర క్రాంతి పథం' క్రింద మనం ప్రవేశ పెట్టిన పావలావడ్డీ పథకం కోటిమంది పైగా మహిళల పాలిట కల్పతరువుగా వాళ్ళ జీవితాల్లో ఎలా వెలుగులు నింపుతోందో మీకు తెలుసు. ఈ స్వయం సహాయక బృందాల సభ్యులు 60 ఏళ్ళ వయస్సు తరువాత నిస్సహాయ స్థితిలో జీవించకుండా పెన్షన్ వచ్చేలా చేసేందుకే 'అభయ హస్తం' పత్రాలు అందజేస్తున్నాం.
- పావలావడ్డీ పథకం విజయవంతమైంది కనుకనే దీన్ని రైతుల పంట రుణాలకూ వర్తింపజేస్తున్నాం. 'పావలావడ్డీ' అనేది ఒక ఉత్తేజపూరితమైన ప్రోత్సాహకం. దీన్ని ఇప్పుడు అనేక ఇతర వృత్తులలో వారికి కూడా విస్తరించే ప్రయత్నం చేస్తున్నాం.
- అటవీ భూములపై గిరిజనులకు హక్కును దాఖలు పరిచే 2006 నాటి చట్టాన్ని సమర్థంగా ఇతర రాష్ట్రాలకన్నా ముందుగా మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్నాం.
- రైతులకు ఉచిత విద్యుత్, రెండు రూపాయలకు కిలో బియ్యం, కందిపప్పు, పామాయిల్ వంట నూనె, వంట గ్యాస్‌ల మీద సబ్సిడీ... ఇవన్నీ కూడా దేశంలో మొదటిసారిగా మన రాష్ట్రంలో మాత్రమే అమలు జరుగుతున్నాయి. ఇప్పుడు గ్రామాలకు రక్షిత మంచినీటిని బాటిల్స్‌లో సరఫరా చేయాలన్న ప్రయోగాన్ని కూడా దేశంలో మొదటిసారిగా మనమే చేస్తున్నాం.
- జాతీయ వ్యవసాయ రుణ విముక్తి పథకం పరిధిలోకి రాలేకపోయిన రైతులకు అయిదేసి వేల రూపాయల వంతున రుణ విముక్తి సహాయాన్ని అందించిన రాష్ట్రం కూడా మనదే.
- ఎస్.సి.,ఎస్.టి., బి.సి., అల్పసంఖ్యాక వర్గాలు, వికలాంగుల శ్రేణికి చెందిన విద్యార్థులందరికీ పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పుల్ని పెంచాం. ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీలు సహా ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాల విద్యార్థులకూ ఉన్నత విద్యా రంగంలో ఫీజుల రీ ఇంబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టాం. నిజానికి విద్యారంగంలో మేం తీసుకున్న ఈ చర్య కేవలం సంక్షేమ పథకం కాదు. భవిష్యత్ మానవ వనరులపై పెట్టుబడి కూడా... చదువుకోవాలన్న ఉత్సాహం వున్నవాళ్ళకిప్పుడు ఎన్ని అవకాశాలో గమనించండి.
- చేనేత సహకార సంఘాల రుణ బకాయిలను మాఫీ చేసి, వాళ్లకి భారం తగ్గిస్తున్నాం. అలాగే రాజీవ్ యువశక్తి, ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన పథకాల క్రింద వ్యక్తిగత నేత కార్మికులకిచ్చిన రుణ బకాయిలను కూడా రద్దు చేస్తున్నాం. ఈ బకాయిల మాఫీ క్రింద ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ. 312 కోట్లు కేటాయిస్తున్నాం.
- 'ఇందిరమ్మ' గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల నిర్మాణం, ప్రభుత్వ రంగంలోని అన్ని రకాల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, ఉచితంగా బోధనా సామాగ్రి పంపిణీ, పాఠశాల విద్యారంగాన్ని పటిష్టం చేయటానికి 50 వేల మంది ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ... ఇవన్నీ కలిపి చూడండి – అన్ని రంగాలలోనూ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనలతో కూడిన హరితాంధ్రప్రదేశ్ సాధన దిశగా మీరు ఎన్నుకున్న ఈ ప్రభుత్వం సాగిస్తున్న కృషి ఎలాంటిదో స్పష్టమవుతుంది.
- వర్షపాతం తగ్గితే ఏర్పడగల అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడం కోసం ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు, పశుగ్రాసం పంపిణీ వగైరా చర్యలతో కంటింజెన్సీ ప్రణాళిక తయారు చేయించడం జరిగింది. తక్షణ కరువు సహాయక చర్యల కోసం 82 కోట్ల 50 లక్షల రూపాయలను విడుదల చేశాం. ఉపాధి హామీ పథకం క్రింద కరువు పరిస్థితులలో 70 లక్షల మందికి పని కల్పించడానికి రూ.2000 కోట్లు సమకూర్చాలని కేంద్రాన్ని కోరాం.

## పట్టణాభివృద్ధి

- పట్టణాలు, నగరాలు కూడా పెరుగుతున్న జనాభా అవసరాలకి తగినట్లుగా వసతులు పెంచుకోవాలి. జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ పునరాభివృద్ధి పథకం, పట్టణ పేదలకు ప్రాథమిక సేవల పథకం, చిన్న మధ్యతరహా పట్టణాల కోసం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకం, సమగ్ర గృహ – పేద బస్తీల అభివృద్ధి పథకం వంటి పథకాల క్రింద కేంద్ర ప్రభుత్వ నిధులను సేకరించే ప్రయత్నాలు చేస్తున్నాం.
- రాష్ట్ర రాజధాని నగరాన్ని ఒక ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దటానికి మన ప్రభుత్వం చొరవ తీసుకుంది. 2007 ఏప్రిల్ 16న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ రూపాంతరం చెందిన నాటి నుంచి ఇప్పటివరకు నగర పరిధిలో రోడ్లు, ఫ్లైఓవర్లు , తదితర మౌలిక సదుపాయాల కల్పన మీద రూ.5550 కోట్లు మంజూరు చేశాం. ఇప్పటికి రూ. 2765 కోట్లు వెచ్చించి ఒకప్పుడు మున్సిపాలిటీలుగా వున్న జోన్లను కూడా అందంగా అభివృద్ధి చేశాం. రూ.4,607 కోట్ల రూపాయల అంచనాతో ఎనిమిది లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేగా 158 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నాం.
- చాలా సంవత్సరాలుగా జంట నగరాల పౌరులు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా గోదావరీ జలాలను మూడు దశలలో రాజధానికి తరలించటానికి 'మౌలానా అబ్దుల్ కలాం హైదరాబాద్ సుజల స్రవంతి' అనే పథకాన్ని చేపడ్తున్నాం. మొదటిదశ వ్యయం రూ.3,375 కోట్ల రూపాయలు కాగలదని అంచనా. ఈ ఏడాది బడ్జెట్‌లో దీనికోసం రూ.250 కోట్లు కేటాయించాం.
- అలాగే జంట నగరాలలోని పేద బస్తీలలో త్రాగునీటి సరఫరాను మెరుగుపరచటం కోసం కూడా ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.37 కోట్ల రూపాయలు కేటాయించాం.
- 'ఇందిరా క్రాంతి పథం– అర్బన్' క్రింద 7040 మురికివాడల్లో పేద మహిళలతో ఒక లక్షా 83 వేల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశాం. వాళ్ళకి బ్యాంకులతో అనుసంధానం ద్వారా గత సంవత్సరం రూ.843 కోట్ల మేరకు పరపతి సమకూర్చాం. ఈ సంవత్సరం రూ.1200 కోట్ల పరపతిని సమకూర్చేందుకు ప్రణాళిక తయారుచేశాం.
- జంట నగరాలలో పెరుగుతున్న జనాభా అవసరాలకి తగినట్లుగా చేపట్టిన మెట్రో రైలు ప్రాజెక్టు త్వరలోనే కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటున్నాం.
- ఇవన్నీ మన తరువాత తరాలకు కూడా జీవనాన్ని సదుపాయంగా చేయాలని ఆశించి, తదనుగుణంగా రూపొందించి, అమలు చేస్తున్న మౌలిక సదుపాయాల కల్పన పథకాలు.

*– ఆర్.కె.*

# మహానుభావుల పదవల్లరి




కలం పట్టిన ప్రతివాడూ కవి కాదు. భావనలో, ఉక్తిలో తమదంటూ ఒక ప్రత్యేక శైలిని సంతరించుకున్న వారు మాత్రమే పఠితల జ్ఞాపకాలలో పది కాలాలపాటు జీవించగలరు. అలాంటి ప్రతిభామూర్తుల పదవల్లరికి అనువల్లరిని సమకూర్చే ఈ కార్యక్రమానికి ముందుగా అందరికీ వందనాలు!

"ఒక భవనం - జరిగే కథ మొత్తానికి ఆ భవనం వేదిక - కనుక దానికి కథలో ప్రాముఖ్యత వుంది" - ఇదీ ఈ పేరడీకి యెన్నుకున్న అంశం.

## అడవి గోల



అడవి బాపిరాజు గారు సాహిత్యంలో, చిత్రకళలో సిద్ధహస్తులు. వీరి సాంఘిక నవలలు ఆ రోజులలో ఇంటింటి గ్రంథాలైనాయి వీరి నవలలో కథాబలం కంటే విజ్ఞానబోధ అధికంగా వుంటుంది సంఖ్యా వివరాలు, తేదీలు, ఇంటిపేర్లు వీరి రచనలలో కనిపిస్తాయి కనుక అని ఒక వ్యక్తి జీవితకథ లాగా అతి సహజంగా స్ఫురిస్తాయి. సమస్త విషయాలపైన సాధికారంగా చర్చించగల ప్రతిభామూర్తి. పై సందర్భంలో బాపిరాజు గారైతే యిలా వ్రాస్తారు.



రాజమహేంద్రవరములో శ్రీ సర్వోత్తమరావుగారు తమ నివాస భవనమును కట్టించిరి. అది పవిత్ర గౌతమీ నదిని అంది పుచ్చుకున్నట్లుండును. వేయి గజముల నివేశన స్థలములో భవన నిర్మాణము జరిగినది.

తొమ్మిది గజముల మువ్వీసము నిడివియు, పులి లోపల మూడు గజముల ఆరంగుళముల వెడల్పునూ ఆయము కలిగిన డబుల్ హాల్సు గలవు. వంటశాల, భోజనముల గది ప్రత్యేకముగానున్నవి. వారి మారిసు మైనరు కారు నిల్పుటకు వీలుగా పోర్టికో నేర్పాటు చేసిరి. గోడలకు ఏడడుగుల బునాదియు. మూడు జానల మందమునూ వుంచినారు. సింహద్వారము నల్లమాను కొయ్యతో చెక్కిరి. మిగిలిన వురివులన్నియు బ్రశస్తమైన రంగూను టేకుతో తయారు చేసినారు. గోడ బీర్వా లారింటికి బిళ్ళోరి అద్దముల ను బిగింపించిరి.

ఇంటికి ఈశాన్యమున నలుబది గజముల ఖాళీస్థల మును వదలిరి. ఈశాన్యము దైవస్థానమని వాస్తు చెప్పుచున్నది. ధవళేశ్వర వాసియు, వాస్తు శిల్పమున దిట్టయునైన శ్రీ రావిపూడి నరసింహ సిద్ధాంతిగారి పర్యవేక్షణమున గృహనిర్మాణం జరిగినది. ఆనందనామ సంవత్సర చైత్ర బహుళ పంచమిన శ్రీ సర్వోత్తమరావు గారు నూతన గృహప్రవేశ మహోత్సవం గావించుచు శ్రీ నరసింహ సిద్ధాంతిగారిని జత పెద్దాపురం జరీ ధోవతులుతోనూ నూటపదార్లు రొఖ్ఖంతోను సత్కరించిరి.

☆


## చలం కలం

ఒక మహాకవికి యోగ్యతా పత్రం ఇవ్వగలిగిన చలం ఫ్రాయిడ్‌ని తల్లక్రిందుగా అధ్యయనం చేసి యముడికీ, సావిత్రికీ సంబంధ సంపర్కాలు అంటగట్టి తెలివిని వృధా చేసుకున్న చలం, భావ ప్రచారం కోసం తన రచనలకు లేనిపోని అలంకారాలు మాత్రం తగిలించలేదు. చెప్పాలనుకున్నది నగ్నంగా చెప్పేసే చలం శైలిలో ఒక 'తూగు' అప్రయత్నంగానే వచ్చి పడింది. చలం గారి కలం.



సిటీకి చాలా దూరంగా క్రిస్టాఫర్ బంగళా వుంది. నిజానిజాలు తెలియవు కాని తాను ఒంటరిగా వుంటున్నాననే వాదిస్తాడు. బైబిలు, భగవద్గీత చదువుతాడు.

"అంత పెద్ద హవేలీలో ఒంటరిగా ఎలా వుంటున్నావు భాయ్?" అని అడిగితే - "ఒంటరితనం శరీరానికేగాని మనసుకేమి వుంటుంది? అదెప్పుడూ భావాలతో సందడిగానే వుంటుందిగా" అంటాడు క్రిస్టాఫర్,





అయినా నాకు క్రిస్టాఫర్ మీద యెందుకో అనుమానం. అతను బ్రహ్మచర్యం పాటిస్తున్నాడా? అనేది కాదు నా సందేహం. నిజం చెప్తున్నాడా? లేదా? అనేది నాకు కావాలి.

అయినా సృష్టి సహజమైన విషయాలను వీళ్ళంతా యెందుకింత సీరియస్‌గా తీసుకుంటారో, దాన్ని కప్పిపుచ్చుకోవాలని నానా అవస్థలు యెందుకు పడ్తారో నాకు అర్థంకాని విషయాలు.

ఒక ఆదివారం సాయంత్రం క్లబ్ నుంచి సడన్‌గా క్రిస్టాఫర్ ఇంటికి వెళ్లాను. పరచుకున్న నల్లని మైదానం, సమాంతరంగా పైన నీలాకాశం, రెంటినీ కలుపుతున్న

రేఖల్లాగా పచ్చని దేవదారు చెట్లు–చెట్లు మధ్య వొదిగిపోయిన బంగళా – నిజంగా ఒక వరం అది. నాలో ఈర్ష్య రగిలేంతలో క్రిస్టాఫర్ మెట్లమీద నుంచి అప్యాయంగా ఆహ్వానించాడు. అతన్ని అనుసరించి లోనికి వెళ్ళాను.



అప్పటికే మసక చీకటి అవరించింది. బయట చెట్లమీద పిట్టల అరుపులు తప్ప అంతా నిశ్శబ్దం.

క్యాండిల్ వెలిగించి స్టాండ్స్ నింపుతున్నాడు క్రిస్టాఫర్.

"కరెంటు దీపాలు వున్నాయిగా –ఇవి దేనికి?" అన్నాను.

"నాకు క్యాండిల్స్ ఇచ్చే వెలుతురంటే చాలా ఇష్టం. ఆ కాంతిలోని మైల్డ్‌నెస్‌ని నేను ఆరాధిస్తాను" అన్నాడు క్రిస్టాఫర్ గోడమీద మా యిద్దరి నీడల్నీ చూస్తూ. ☆

## వెంకటరమణీయం



**జోకులాష్టమినాడు పుట్టాట్ట ముళ్లపూడి వెంకటరమణ గారు నవ్వుల పువ్వుల వెనుక మనసుని కుదిపే మాంసపు ముడులున్నాయి గనుకనే 'ముళ్లపూడి' హాస్య రచనలలో 'మొగలి పొత్తుల స్పర్శ' వుంటుంది. వేలాది సొంతమాటల్ని జాతీయం చేసిన అభ్యుదయవాది కొత్త టానిక్కు వంటబట్టక 'సాక్షి' గల్లా తన్నేసినా – స్రిష్టు వదలని విక్రమార్కుడిలా నిలిచి, ముగ్గులో ముత్యాలేరుతూ ఎంచక్కా వడ్డీతో సహా జమ వేసుకుంటున్నారు.**

'పౌరాణిక పిక్చర్లా ఎంతకీ తరగని అప్పాపురం హైవే దాటి అసుంటా వెళ్ళంగానే – తెలుగు సిన్మాలో క్యారెక్టరాక్టర్లా అప్పులు తీర్చేయాల నుకున్న ఆసామీలా, దేశవాళీ టెలివిజన్ సెట్‌లా, కళ్ళద్దాల '. .క్షి' (కామా–క్షి)లా గంభీరంగా వున్న వో మేడ కంటికి తగిలింది.



"దీని తాలూకు ఆసామీ ఎవరై వుంటారు చెప్మా?" అన్నెప్పున్నె పన్నేసి. . తటపటాయిస్తుండగా శ్రీమాన్ అప్పాల్నాయుడు గారు క్లోజప్‌లో తారసపడి "మనదే" అన్నారు సినలైన మదీయవాదిలా.

మనదే అనే మాట నా చెవులలో గిరికీలు కొట్టగా 'వీరిది చాటంత హృదయం స్మీ' అని మనంబున తలబోసి "చాలా యిదిగా కట్టించారు" అనేశాను కుంచెం చొరవ తీసుకుని.

"దానికి శానా కతా కమామీషూ వుందోయ్ చెప్పాలంటే" కత్తిలాంటి చుట్ట పొగతో డైలాగ్‌ని కట్‌చేసి – మళ్ళీ అందుకున్నారు.

"కాంతారావ్ ష్టంటుబొమ్మలంటే జనం గోడలు దూకొచ్చేసే రోజులవి. వారానికి నాలుగు డబ్బీలాడేవాళ్లం. రెండాట్లకీ రెండేలు మిగిలేవి అలకంగా. ఎన్నెల రోజుల్లో ఆటే లేదనుకో అప్పట్లో మనకో టూరింగాలుండేదిలే."

లంక పువాకు చుట్టకొస కొరికి కిర్రున ఖాండ్రించి డిష్యుం అని వుమ్మేసి, "అవో పిచ్చి రోజులు. తరాత్తరాత అదంతా కత్తెర మీద సామైపోయింది. టూరింగాలుని గొడ్లసావిడికింద ఫిరాయించేసి, మనం కాన్ట్రాక్టుల్లో పడిపోయాం. ఇందుట్లో నాలుగురాళ్ళు మిగిల్తే అవీ ఇవీ యెట్టి ఈ అప్పుస్టెయిరు లాగించేశాం. 8' ఏకటాకీన వువాచించిన అప్పల్నాయుడుగారు అలవాటుకొద్దీ ఎడమచేతి బొటనవేలు తలకి రాసుకుంటూ వుండిపోయారు.

"మీ అనుభవం. . . బహుదొడ్డదిస్మండి! బంగళా చూస్తుంటేనే తెలిసొస్తోంది!" వో ముక్క స్తుతిగా అన్నాను. అందుకాయన మొట్టికాయ తిన్నవాడిలా మొహం పెట్టి శేరు యిసక్కి సిటికెడు సిమెంటేసేవోడివి నువ్వొద్దని మన లేడీసు అంటే – వాళ్ళక్కాయ్ మాటమీద నిలబడి చిట్టెంలా కట్టించేసేశాడు మన బామ్మరది" అనేసి టెన్సింగ్ నార్కేలా ఫోజెట్టారు ఆ నాయుడుగారు.

గబుక్కున వెయ్యి హార్మనీ పెట్టెలు ఒఖ్ఖపెట్టున వాగించినట్లు "పొద్దుట్నుంచి ఎక్కడ తగలడ్డా. . .?" – లేడీషాట్‌లో లాంగ్ వాయిస్‌తో వులిక్కి ప... డ్డా... ను.

"మన ఆబిడ. . . పనికుర్రాడ్ని. . . హి. . . హ్హి. . ." నాకు ధైర్యం చెప్పాలని శ్రీవారి ప్రయత్నం. తర్వాత నేను నాయుడుగారిగ్గాని, నాయుడు గారు నాగ్గాని కనిపిస్తే ఆ మేడమీద వొట్టు. ☆

## మధ్య మార్గిజం

**ఒకనాడు చక్కని ఇతివృత్తాల రచయిత్రి రంగనాయకమ్మగారు. 'సజీవతకు మార్పు చిహ్నం.' అనే ఆర్యోక్తిని అక్షరాలా నిజం చేశారు 'వైరి మార్గంలో అయితే త్వరగా ముక్తి లభిస్తుందని వీరు విషవృక్షం వ్రాసిరని' కల్పవృక్ష కవి వ్యాఖ్య. పాపం పుణ్యం ఆ శ్రీరామచంద్రుడికి తెలియాలి. ఇదుగో యిప్పటి వారి శైలి మాత్రం యిలా వుండవచ్చు.**

"కాలం యెంత విచిత్రంగా నైనా మారిపోతుందనేది అనుభవంలో గాని తేలని విషయం. కాలంతో బాటు మనుష్యులంతా మారక పోయినా మనుష్యులతో బాటు విల ువలు మారడం ఖాయం. మనిషి మడికట్టుకు కూర్చుంటే – వేసిన చోటే వుంటుంది గొంగళి. ఈ సత్యాన్ని గ్రహించి మడి



వదలి, ఆత్మ (వుంటే) చంపేసుకుని ప్రవర్తిస్తే గుడిసెల్లో వాళ్లంతా బంగాళాలోకి రావడం ఏమంత కష్టం కాదు.

స్టేషన్‌లో దిగి "చలపతిరావుగారి. . . బంగళాకి" అని చెబితే చాలు ఏ రిక్షావాడయినా బేరం చేయకుండానే తెచ్చేస్తాడు సరాసరి. బేరం చేయక పోవడం చలపతిరావు మీద అనుమానం చేత కాదు. భయం వలన మాత్రమే. చలపతిరావుగారు మడి కట్టుకు కూర్చుంటే పూర్వంలాగా 'చలపాయ్' గానే వుండేవాడు.

ఇవ్వాళ చలపతిరావుకి పలుకుబడి, హోదా, అంతస్థూ అన్నీ వున్నాయి. నల్లడబ్బుతో కట్టిన ఆ బంగ్లాకు వాడిన సిమెంటు బ్లాకులో కొన్నారు. ఎటొచ్చీ రాళ్లు మోసిన కూలీలకు మాత్రం పూటా రూపాయి వంతున తెలుపులో ఇచ్చారు.

ఇదంతా చూస్తుంటే మనం సోషలిస్టు వ్యవస్థ ప్యూపాదశలోనైనా వున్నామా? పెట్టుబడిదారీ వ్యవస్థ వటవృక్షపు చిగుళ్ళనైనా తెంపగలిగామా? ఈ బంగళాలు, దర్పాలు, గొప్పవాళ్ళ పిల్లల ఖర్చులు యివన్నీ ఏ వ్యవస్థకు ప్రతీకలు. . . . ☆


## అయస్కాంత కథలు



**మునిమాణిక్యం నరసింహారావు గారు 'కాంతం కథల్ని' రచించి వుండకపోతే తెలుగు సాహిత్యంలో వారు కవిగా గుర్తింపబడే అస్కారమే లేదు. పెళ్ళి కాగానే ఖుషీ నశిస్తుందనే అపప్రధని తొలగిస్తూ, మధ్యతరగతి సంసారాల్లోని సరసాలను, ప్రణయకలహాలను, సున్నితమైన హాస్యధోరణిలో చిత్రించారు. తెలుగుదనం పుట్టిపడే కాంతం కథా విధానం-**

బందరు గొడుగుపేటలో వొక యిల్లు అద్దెకు వున్నదంటే సతీసమేతంగా వెళ్ళాను, కొంచెం పాతదన్నమాటేగాని యిల్లు చాలా నప్పింది.

వంటయింటి ప్రక్కనే గిలకబావి, తులశికోట, తలుపు వున్న స్నానాలగది కాంతానికి యిల్లు నచ్చడానికి ముఖ్య కారణాలు. 'రుబ్బురోలు' కూడా వొకటి. "ఏమండీ! కుదిమట్టసంగా, కుంకుమబరిణెలా వుంది కదండీ" అంటూ దానిని చంటివాడిని నిమిరినట్లు నిమురుతూ యెంతగానో మురిసిపోయింది కాంతం. ఆ డాబా యింటికి వొంపులు తిరిగిన మేడ మెట్లుండడం వల్ల నన్ను ఆ యిల్లు యెంతగానో ఆకట్టుకున్నది. నాలో అనాదిగా నిద్రాణమైవున్న కోరికలు జాగృతాలై గిలిగింతలు పెట్ట సాగినవి. సౌరోపరి భాగాన, పున్నమి వెన్నెలలో తరుణి సరసన జేరి యెన్ని పూసులైనా ఆడవచ్చు. మోవిని మోవిజేర్చి. . . సుధాస్రవంతిలో తేలియాడవచ్చు. మునుపటి కొంపలో వలె వేయి కనుల తడికలు ఇచ్చట లేనందుకు సంతసించాను. కాంతం తలకు నీళ్లోసుకు కురులార వోసుకుంటూ మేడమెట్లమీద నిలబడినట్లు, జడ పాయల జంట జారిన తుషార తుంపరలు నాపై వర్షిస్తున్నట్లు. . . ఎన్నెన్నో మధురోహాలు కలిగినవి.



"మేడ చూశావుటోయ్ యెంతబాగుందో?" కాంతాన్ని వుల్లాసంగా పృచ్ఛించాను.

"మేడ కేమండీ! నిక్షేపంలా వుంది. అడ్డెడు పప్పు రుబ్బిన వడియాలైనా అర్థగంటలో కాగితాల్లా యెండుతాయి. పైగా మేడ కనుక కుక్కలు, కోళ్లు వస్తాయనే బెంగ కూడా వుండదు" అనిన కాంతం మాటలకు, నా మధురోహాలు దూది పింజల వలె యెగిరి పోగా. . ."గృహిణులకు రస హృదయ మించుకలోపము" అని వాపోయాను. ☆


## గుర్రపు బగ్గీ



**గొల్లపూడి మారుతీరావుగారి కథ చదువుతుంటే మాంచివొడుపుగల గుర్రబ్బగ్గీలో ప్రయాణం చేస్తున్నట్లుంటుంది. ఉపమానాలు, అంగాంగ వర్ణనలు అట్టే వుండవు కనుక పఠితకు కథ మీద మనసు నిలిపే అవకాశం ఎక్కువగా వుంటుంది. పాత్ర చిత్రణలో నైపుణ్యం గల కొద్దిమందిలో మారుతీరావు వొకరు. (మీరు చివరంటా చదివి గుర్రబ్బగ్గీలో వెళ్తున్నట్లు లేదని ఫిర్యాదు చేస్తే దానికి బాధ్యుణ్ణి నేనే గాని గొల్లపూడి మాత్రం కాదు)**


రింగురోడ్డులో ఆ మేడ లేకపోతే నిజానికి ఈ కథే లేదు. పదేళ్ళ క్రితం సీతాపతికి ఆ మేడ సంక్రమించి వుండకపోతే ఇవ్వాళ ఆయన వార్డు కౌన్సిలర్‌గా వుండేవాడు కాదు. సీతాపతి కౌన్సిలర్ కాకపోతే ఆ పేటకు మంచినీళ్ల కుళాయిలు వచ్చేవి కావనీ, అపర భగీరథుడనీ ఒక సన్మానసభలో పలువురు అభిభాషించారు.

'ప్రజాధనంతో చేయించాడు' అనే లోకుల మాటల్లోని నిజానిజాలు మనకు తెలియవుగాని పదవిలోకి వచ్చాకనే ఆ మేడ రూపురేఖలు మారిపోవడం జరిగింది. మొజాయిక్ ఫ్లోరింగూ ఫౌంటెన్లూ సీతాపతి కళాహృదయానికి ప్రతీకలని వాళ్ళింటికి వచ్చే ఒకరిద్దరు కాంట్రాక్టర్ల అభిప్రాయం. చుట్టూ పెరిగిన కొబ్బరి మొక్కలు వెన్నెల్లో ఆ మేడకు మేలిముసుగులు అవడం మాత్రం నిజమే. దాన్నిప్పుడు మనం బంగళా అని పిలవడమే మర్యాదగా వుంటుంది.



సీతాపతి స్థితిగతుల్ని బట్టి చూస్తే పై వాటా అద్దెకు ఇవ్వాల్సిన అగత్యం లేదు. ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగారు కావాలని ముచ్చటపడితే కాదనలేక ఔనన్నాడు సీతాపతి. ఆఫీసరుగారి రెండో అమ్మాయి రుక్మిణి ముక్కు కాస్త పొడుగన్న మాటేగాని చూపరి. బాల్కనీలో నిలబడితే కొబ్బరి మొవ్వులో కలిసిపోగలదు. ☆

# నవీనత




**నవీన్ గారి నవలల్ని 'కొని' చదివిన కొందరు గుడ్లనీళ్ళు గుడ్ల నొత్తుకొనడం నేనెరుగుదును. అధివాస్తవికతా శిల్పం అల వాటు పడేదాకా అంపశయ్యలే అవుతాయి వీరి రచనలు. ప్రయోగాత్మక ప్రయోజనాత్మక నవలలు వ్రాశారని నవీన్ గురించి పెద్దల అభిప్రాయం.**

నల్ల రిబ్బన్ ముక్కలాంటి తార్రోడ్డుమీద నడుస్తున్నాడు జీవన్. టక్. . . టక్. . . బూట్ల శబ్దం. చఫ్. . చఫ్. . చఫ్... తన అరికాలు చప్పుడు, తనకు జోళ్ళు లేవు నడుస్తున్నాడు కాదు తూల్తున్నాడు కాదు తూల్తూ నడుస్తున్నాడు.

రోడ్డు ప్రక్కన ప్రథమ రజస్వలానంతరం భయపడ్డ పిల్లలా మేడ, బజ్‌జ్‌జ్ గేటవతల బజ్జర్ చేస్తున్న మోత భౌ.. భౌ.... భౌ...... ఆగి ఆగి స్పానియల్ అరువు బాల్కనీలోంచి. మేడ మీద ఎర్రటి లేటు.. రెడ్.... రెడ్... హు క్రియోటెడ్ దిస్ బ్లడీ రెడ్? ఎరుపు... పుచ్చె పగిలితే ఎర్రటి రక్తం. ఆకలిమంట రెడిష్ బ్లూ. వీధి దీపం కాంతిలో – నేడే చూడండి – ఎబార్షన్ లీగలైజ్డ్. దడిగా దువానసిరా – లూప్ ఈజ్ ది ఓన్లీ హోప్ – కాంపౌండ్ వాల్ మీద నినాదాలు, టంగ్... టంగ్... గోడ గడియారం ఇంకో గంట చచ్చినందుకు ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తోంది. ఆకలి... ఆకలి... పల్స్ జారి పోతోందా? నో నో ఇటీజ్ గోయింగ్ అప్. క్లిక్... ఫ్లాష్... మేడమీద అద్దాల గదిలో నగ్నంగా ఫొటో దిగుతోంది ఇరవై ఏళ్ళ తొలుబొమ్మ. కల్చర్... కలరా... కల్చర్ ఆల్‌రెడీ డెడ్‌ల్ రిమెయిన్డ్ యిన్ మై పూర్ కన్ట్రీ. చఫ్....చఫ్.... చఫ్....

☆




# శవసాహిత్యం



**డిటెక్టివ్ సాహిత్యాన్ని కొందరు శవసాహిత్యం అని పిలుస్తారు. ఈ రంగంలో కృషి చేస్తున్న వారు అనేకులు. ఆ పరిధిలోనే నడుస్తున్న పత్రికలు అనేకం. అపరాధాలు – పరిశోధనలు వీళ్ళ బ్రెయిన్‌డెన్‌లో హమేషా జరుగుతూ ఉంటాయి.**

టెంపో, సస్పెన్స్ ఈ సాహిత్యానికి అలంకారాలు, మరుక్షణంలో ఏం జరిగేది చచ్చినా చదువరికి తెలియదు, భాష, కథాకథనం అందరిదీ దాదాపు వొకలాగే వుంటుంది– శవసాహిత్య శైలి.

"ఆలివ్ గ్రీన్ కాడిలాక్ బులెట్‌లా దూసుకువచ్చి 'కీచ్' మని శబ్దం చేస్తూ గేటు ముందు ఆగింది. డాష్‌బోర్డు లోంచి పెన్‌గన్ తీసుకుని గేటు దగ్గరకు నడిచాడు డిటెక్టివ్ సుధీర్. అసిస్టెంట్ వర్మ పాకెట్ కెమేరాలో మైక్రో ఫిలిమ్ లోడ్ చేసుకుని సుధీర్‌ని ఫాలో అయాడు.

"చాలా కాలంగా మనుష్య సంచారం లేనట్లుంది. కదూ?" అన్నాడు బంగళాని కలియచూస్తూ సుధీర్. "అవును బాస్! నాకూ అలాగే అనిపిస్తోంది." అన్నాడు వర్మ. వర్మ మాట పూరి కాకుండానే బంగళాలోంచి మనిషి మూలుగు అస్పష్టంగా విన్పించసాగింది.



అంతా చీకటి, కన్ను పొడుచుకున్నా కన్పించనంత చీకటి. దూరాన్నుంచి నక్కల అరువులు. టక్.... టక్... నాలుగు అడుగులు ముందుకు వేసి ఆగిపోయాడు సుధీర్. మనిషి మూలుగు ఆగిపోయింది సడెన్‌గా.

పెన్‌టార్చితో బంగళా మెయిన్ డోర్ వైపుకు నడిచారు ఇద్దరూ. "మిస్టర్ వర్మా, బంగళా వెనుక పెద్ద వేపచెట్టు ఉంది గమనించావా?"

"అవున్ సార్! దానికో పెద్ద తొర్ర కూడా వుంది."

"ఎస్." తల పంకించాడు సుధీర్.

"మిస్టరీ అంతా అందులోనే వుందని నా గట్టి నమ్మకం" అరబ్ సెవెన్ సిగరెట్ వెలిగించాడు డిటెక్టివ్ సుధీర్.

*(ఆ మూలుగు ఎవరిది? క్లూ దొరికిందా? హంతకుల జాడ తెలిసిందా? జవాబే కావాలంటే ఈ నవల ద్వితీయ భాగం చదవండి.)*

☆

*Printed & published by Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : Phani Kumar*

## న ం వదినో వ వేడు ల్ల
## ాామ ులు గెలుచుకన శకటాలు




ుథమ తిఐాుమ




ుితీయ ు తిఐాుమ




ుతీయ ు తిఐాుమ




Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.